రెండు మహానగరాలు
రూ॥250/-
పేజీలు:245



నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM సిటీ


సౌదీ చమురు కర్మాగారంపై హౌతీ దాడులు

చమురు మార్కెట్లపై తీవ్ర ఒత్తిడి ప్రపంచదేశాల్లో భయాందోళన

08


సంపుటి 29, సంచిక: 38 | సోమవారం | 27-07-2026 | హైదరాబాద్ | Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12 | వెల రూ. 5.00


### ఆగస్టులో శాసనసభ, మండలి

## సంయుక్త సమావేశం

- లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసే కనిష్ఠ వయస్సును 21 ఏళ్లకు తగ్గించే ప్రతిపాదనపై చర్చ
- వయసు తగ్గించేలా రాజ్యాంగ సవరణ చేపట్టాలి
- డీలిమిటేషన్, మహిళా కోటాతో పాటు ఈ బిల్లును కూడా పార్లమెంటులో ప్రవేశపెట్టాలి
- జాతీయ మీడియాతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్

శాసనసభలు, లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే కనిష్ఠ వయోపరిమితిని 25 ఏళ్ల నుంచి 21 ఏళ్లకు తగ్గించేలా రాజ్యాంగ సవరణ చేపట్టాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇందు కోసం లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన, సీట్ల పెంపు, మహిళా రిజర్వేషన్‌తో పాటు చట్టసభల ఎన్నికల్లో పోటీ చేసే కనిష్ఠ వయోపరిమితి తగ్గింపు బిల్లును కూడా కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని, దీనిపై జెపిసి నివేదిక ఆధారంగా చర్చ జరపాలని కోరారు. దేశ భవిష్యత్తు నిర్మాణంలో యువతను మరింత భాగస్వాములను చేయాల్సిన అవసరం ఉందని, ఒకప్పుడు 'జై జవాన్ జై కిసాన్' అన్న కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు 'జై జవాన్ జై కిసాన్ జై యువ్' అనే నినాదంతో ముందుకు సాగుతుందని సిఎం స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో ఆదివారం జాతీయ మీడియా ప్రతినిధులతో జరిగిన సమావేశంలో సిఎం మాట్లాడారు. విద్యారంగంలో పరీక్షల నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సిఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల నిర్వహించిన సిబిఎస్‌ఈ, నీట్, నెట్ తదితర జాతీయ స్థాయి పరీక్షల నిర్వహణలో తలెత్తిన సమస్యలపై రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులు, వారి కుటుంబాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. ఉద్యమాలు చేసిన విద్యార్థులపై పెట్టిన క్రిమినల్ కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని, నీట్ పరీక్షల వివాదంలో ప్రాణాలు కోల్పోయిన బాధిత కుటుంబాలను కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలని, నష్టపోయిన విద్యార్థులు, వారి కుటుంబాలకు ప్రధాని నరేంద్ర మోదీ క్షమాపణ చెప్పాలని సిఎం డిమాండ్ చేశారు. ఈడి, ఐటి,

తరువాయి 8లో

### ప్రశ్నాపత్రాల లీకేజీపై లోక్‌సభకు

# నేడు సవరణ బిల్లు

- ఎంపిలకు చేరిన ముసాయిదా
- వ్యవస్థీకృత నేరస్థులకు ఏడేళ్ళు శిక్ష, రూ.10 కోట్లు జరిమానా




**న్యూఢిల్లీ :** ప్రశ్నాపత్రాల లీకేజీలను అరికట్టేందుకు ఉద్దేశించిన 2024 నాటి చట్టానికి ప్రతిపాదించిన సవరణలతో ఒక కొత్త బిల్లును సోమవారం లోక్‌సభలో ప్రవేశపెడుతున్నారు. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడానికి ముందుగా ఈ ముసాయిదా బిల్లు ప్రతులను ఎంపీలకు పంపిణీ చేశారు. ఇది పూర్తిస్థాయి కొత్త బిల్లు కాదు. విద్యావ్యవస్థతో అవిభాజ్యంగా అల్లుకుపోయి వ్యవస్థీకృత నేరాలకు పాల్పడుతూ తప్పించుకు తిరుగుతున్న 'ఘరానా లీకేజీ వీరుల' భరతం పడతామని చెబుతున్న కేంద్ర ప్రభుత్వం, ప్రతిపాదిత బిల్లులో నేరస్థులకు కనీస శిక్షల కాలాన్ని ఐదు నుండి పది సంవత్సరాలకు పెంచడంతోపాటు, వారికి విధించే జరిమానాలు కూడా భారీగా పెంచింది. లోక్‌సభ సచివాలయం సమాచారం ప్రకారం 2024 నాటి ప్రభుత్వ పరీక్షల (అక్రమ పద్ధతుల నివారణ) చట్టానికి కొత్త సవరణల బిల్లును కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ సభముందు ఉంచుతారు. ప్రభుత్వ పరీక్షల ప్రశ్నాపత్రాలను ముందుగానే బహిర్గతం

తరువాయి 8లో



పరీక్షల విధానంలో సంస్కరణలకు

## నందన్ నీలేకని సారథ్యంలో టాస్క్‌ఫోర్స్

ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటన


**న్యూఢిల్లీ:** దేశంలో పరీక్షా ప్రశ్నాపత్రాల లీకేజీ లేకుండా పరీక్షల విధానంలో సంస్కరణలు తీసుకురావడానికి నందన్ నీలేకని సారథ్యంలో అత్యున్నతాధికారాలు గల ఒక టాస్క్‌ఫోర్స్ (కర్తవ్య నిర్వహణాబృందం)ను ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఏర్పాటు చేశారు. ప్రపంచ ప్రఖ్యాత సాంకేతిక నిపుణుడు నందన్ నీలేకని సారథ్యంలో ఈ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేస్తున్నట్లు సోషల్ మీడియా ఛానెళ్ళ వేదికగా ఆదివారం రాత్రి మోదీ ఒక వీడియో సందేశాన్ని షేర్ చేశారు. ఈ టాస్క్‌ఫోర్స్‌లో మరో ఐదుగురు సభ్యులు ఉంటారు. వీరంతా సంస్కరణలకు సంబంధించిన నివేదిక రూపొందిస్తారు. భారత అంతరిక్ష పరిశోధనాసంస్థ మాజీ ఛైర్మన్ ఎస్.సోమనాథ్,ఇంటలిజెన్స్ బ్యూరో మాజీ డైరెక్టర్ తపన్ దేకా, చెన్నైలోని ఐఐటి డైరెక్టర్ వి.కామకోటి,కేంద్ర విద్యాశాఖ మాజీ కార్యదర్శి అనితా కర్వాల్, లాజిస్టిక్స్ నిపుణుడు అమృత్‌లాల్ మీనా సభ్యులుగా పనిచేస్తారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి అవకతవకలు లేకుండా వ్యవస్థను ప్రజాస్వామ్యబద్ధంగా, బాహాటత్వ పద్ధతులలో నిర్వహిస్తూ, విశ్వసనీయత కాపాడి,

తరువాయి 8లో

### అమానుష దాడికి

## బాధ్యులెవరు

- విద్యార్థులపై పెల్లెట్ గన్స్ వంటి ప్రాణాంతక ఆయుధాల వినియోగానికి ఎవరు అనుమతించారు?
- కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలి
- ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ డిమాండ్
- హోంమంత్రి అమిత్ షాకు లేఖ



**న్యూఢిల్లీ :** ఢిల్లీలో శాంతియుతంగా నిరసన చేస్తున్న విద్యార్థులపై అమానుషంగా దాడి చేశారని కేంద్ర సర్కార్‌పై ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఈ ఘటనకు బాధ్యులెవరో వెల్లడించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులపై పెల్లెట్ గన్స్ వంటి ప్రాణాంత ఆయుధాల వినియోగానికి ఎవరు అనుమతించారో సమాధానం చెప్పాలన్నారు. ఈ మేరకు రాహుల్‌గాంధీ ఆదివారం కేంద్ర హోంశాఖమంత్రి అమిత్ షాకు లేఖ రాశారు. ఈ అంశంపై యావత్ దేశం సమాధానం కోరుతోందన్నారు. ఈ అంశంపై యావత్ దేశం సమాధానం కోరుతోందన్నారు. ఈ అంశంపై యావత్ దేశం సమాధానం కోరుతోందన్నారు. ఏ ప్రజాస్వామ్యానికైనా

తరువాయి 8లో

# కమ్ముకొస్తున్న కరువు



- లోటు వర్షపాతంతో ఖరీఫ్ కుదేలు
- ఎల్‌నినో ప్రభావంతో రాలని చినుకు
- ముందుకు సాగని సాగు
- వాడుతున్న మొక్కలు.. బీళ్లువారుతున్న మాగాణి భూములు
- అడుగంటుతున్న జలాశయాలు
- తాగునీటికీ కటకటే
- ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సగానికి సగం, ఉమ్మడి వరంగల్ జిల్లాలో గణనీయంగా తగ్గిన వరిసాగు

ప్రజాపక్షం/ఖమ్మం/హనుమకొండ/జనగామ

రాష్ట్రంలో కరువు ఛాయలు కమ్ముకొస్తున్నాయి. లోటు వర్షపాతంతో ఖరీఫ్ కుదేలైంది. ఎల్‌నినో ప్రభావంతో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయి. వర్షాలు లేకపోవడంతో జల వనరులు వట్టిపోతున్నాయి. జులై మొదటి వారంలో అడపా దడపా కురిసిన చినుకులకు రైతులు పత్తి విత్తనాలు నాటారు. అవి మొలకెత్తి మారాకు తొడిగాయి. ఇప్పుడు భూమిలో పదును లేక వాడిపోతున్నాయి. మాగాణి భూములు బీళ్లుగానే ఉన్నాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సగానికి సగం వరి సాగు పడిపోయింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో గణనీయంగా తగ్గిపోయింది. 5.20 లక్షల ఎకరాల సాగు భూమి ఉండగా అందులో సుమారు 2.30 లక్షల ఎకరాలలో వరి పంట సాగు చేస్తున్నారు. నాగార్జున సాగర్ ఎడమ కాలువ ద్వారా 16 మండలాల్లోని సుమారు 2.5 లక్షల ఎకరాల్లో సాగునీరు అందుతుంది. ఈ ఏడాది కృష్ణానది పరివాహక ప్రాంతంలో వర్షాలు లేకపోవడంతో కృష్ణా నదిలోకి కొత్త నీరు రాకపోవడంతో నది పరివాహక ప్రాజెక్టులు అడుగంటాయి. ఈ నేపథ్యంలో నాగార్జున సాగర్ ప్రాజెక్టు ద్వారా ఖరీఫ్‌కు నీరు విడుదలయ్యే అవకాశం లేదు. ఇదే విషయాన్ని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ఇటీవల స్పష్టం చేశారు. దీనితో నాగార్జున సాగర్ ఎడమ ఆయకట్టు పరిధిలోని 2.5 లక్షల ఎకరాలకు సాగు నీరు అందించే అవకాశం లేదు. మధ్యతరహా ప్రాజెక్టులైన పాలేరు, వైరాలో కొంత మేర నీరు ఉన్న భవిష్యత్తు అవసరాల దృష్ట్యా నీటిని విడుదల చేయడం లేదని అధికారులు తేల్చి చెప్పారు. ఇక చిన్న చెరువులు, కుంటలు వెయ్యి వరకు ఉండగా దేనిలోనూ సాగునీటిని అందించేందుకు నీళ్లు లేవు. ఖమ్మం జిల్లాలో రెండున్నర లక్షల హెక్టార్లలో పత్తి సాగు చేస్తున్నారు. ఇప్పటికే దాదాపు 1.5 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేశారు. పత్తి మొక్కలు తేమ లేక వాడిపోతుంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 3.64 లక్షల ఎకరాల సాగు భూమి ఉండగా ఇక్కడ కూడా ప్రధాన ప్రాజెక్టులైన కిన్నెరసాని, మూకమామిడి తదితర మధ్యతరహా ప్రాజెక్టులు నీటి కొరతను ఎదుర్కొంటున్నాయి. ఛత్తీస్‌గఢ్‌లో వర్షాలు పడుతుండడంతో తాలిపేరుకు మాత్రం కొత్త నీరు రావడంతో తాలిపేరు ప్రాజెక్టు క్రింద సాగునీరు అందించే అవకాశం ఉంది.

**సాగని వరి సాగు**

వరంగల్ ఉమ్మడి జిల్లాలో 17.40లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ, వరి సాగు మాత్రం నత్తనడకన సాగుతోంది. ఇప్పటి వరకు 27వేల ఎకరాల్లో మాత్రమే రైతులు వరి నాట్లు వేశారు. ఎల్ నినో ప్రభావంతో వర్షాలు లేకపోవటంతో

తరువాయి 8లో




### కనీస వేతనం రూ.26 వేల కోసం కొట్లాడుతుంటే

## జిపి కార్మికులకు రూ.8500లా?

మల్టీ పర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాల్సిందే

ఉద్యోగ, కార్మిక సంఘం రాష్ట్ర 3వ మహాసభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

ప్రజాపక్షం/రఘునాథపాలెం

గ్రామ పంచాయతీ ఉద్యోగ కార్మికుల శ్రమ దోపిడీకి గురిచేసే జిఒ 51ని రద్దుచేసి మల్టీ పర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాల్సిందేనని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఖమ్మం జిల్లా రఘునాథపాలెంలోని గణేష్ గార్డెన్‌లో తెలంగాణ రాష్ట్ర గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘం రాష్ట్ర 3వ మహాసభలు జరిగాయి. తొలుత మహాసభల సూచికంగా ఏర్పాటు చేసిన ఎఐటియుసి జెండాను సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎండి యూసఫ్ ఆవిష్కరించగా, అనంతరం గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు టంగుటూరి నరసింహారెడ్డి అధ్యక్షతన జరిగిన మహాసభలలో కూనంనేని సాంబశివరావు ప్రసంగించారు. ప్రజల ఆరోగ్యాలను కాపాడటంపై అనునిత్యం పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు అత్యధిక వేతనం ఇవ్వాల్సింది పోయి అత్యల్ప వేతనాలు ఇవ్వడం సరికాదన్నారు. కనీస రూ.26 వేలు ఇవ్వాలని అన్ని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తుంటే పంచాయతీ కార్మికులకు రూ.8500 లు ఇవ్వడం ఏమిటని

తరువాయి 8లో

### శ్రీరాంసాగర్ బ్యాక్‌వాటర్‌లో

## ఈతకు దిగి ముగ్గురు మృతి

మరొకరు గల్లంతు

ప్రజాపక్షం/ముప్కాల్

నిజామాబాద్ జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. శ్రీరాంసాగర్ జలాశయం (ఎస్సారెస్పీ)లో ఈతకు దిగి ముగ్గురు మృతిచెందారు. ముప్కాల్ వద్ద ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్‌లో ఈతకు దిగిన నలుగురిలో ముగ్గురు చనిపోగా, ఒకరు గల్లంతయ్యారు. మృతులను షేక్ ఖలీం (24), నజావత్ (24), ఫర్హాన్ (17)గా గుర్తించారు. చేతికి అంది వచ్చిన యువకులు మృతిచెందడంతో వారి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మృతుల్లో షేక్ ఖలీం, నజావత్ నిజామాబాద్‌లోని ఆటోనగర్‌కు చెందినవారు. ఫర్హాన్‌ను మహారాష్ట్రలోని హిమాయత్‌నగర్‌కు చెందిన బాలుడిగా గుర్తించారు. సంఘటన సమాచారం అందుకున్న వెంటనే సిపి సాయిచైతన్య సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలను స్వయంగా పర్యవేక్షించారు. గల్లంతైన అజీమ్ కోసం పోలీసు, రెవెన్యూ, గజ ఈతగాళ్లు, ఎన్డీఆర్‌ఎఫ్ బృందాలు, అగ్నిమాపక సిబ్బంది సంయుక్తంగా గాలింపు చర్యలు చేపట్టాయి. నీటి ప్రవాహం అధికంగా ఉండటంతో లోతు ఎక్కువగా ఉండటంతో సహాయక చర్యలకు కొంత ఇబ్బది ఎదురైనప్పటికి బృందాలు నిరంతరంగా గాలింపు కొనసాగించాయి. ప్రమాదకర ప్రాంతాలకు దూరంగా ఉండి పోలీసు సంబంధిత శాఖల సూచనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

### ఆదిలాబాద్‌లో జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్

రూ.2,278.14 కోట్లకు పరిపాలనా అనుమతి

2,009.23 ఎకరాల్లో ఎయిర్‌ఫీల్డ్ ఏర్పాటు

ఉత్తర తెలంగాణకు గేమ్ చేంజర్

ప్రజాపక్షం/హైదరాబాద్

ఉత్తర తెలంగాణ అభివృద్ధికి మరో కీలక అడుగు పడిందని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ఆదిలాబాద్‌లో ప్రతిష్ఠాత్మక జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్ ఏర్పాటుకు రూ.2,278.14 కోట్ల పరిపాలనా అనుమతి మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈ ప్రాజెక్టు కోసం మొత్తం 2,009.23 ఎకరాల భూమిని సేకరించనున్నట్లు మంత్రి వెల్లడించారు. ఇందులో 1,609.23 ఎకరాలు భారత వైమానిక దళం (ఐఎఎఫ్) అవసరాల కోసం, 400 ఎకరాలు సివిల్ ఏవియేషన్ ఎన్‌క్లేవ్, ఎంఆర్‌ఓ,

తరువాయి 12లో

# మధ్యాహ్న భారం.

- తలలు పట్టుకుంటున్న ఏజెన్సీలు
- పెరిగిన నిత్యావసరాల ధరలతో ఇబ్బందులు
- రూ.లక్షల్లో భారం
- ధరలు పెంచాలంటూ డిమాండ్



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం

ప్రభుత్వ పాఠశాలల పిల్లలకు వంటలు చేసి పెట్టే మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకుల కడుపు మండిపోతోంది. పెరిగిన నిత్యవసరాల ధరలకు ప్రభుత్వం చెల్లించే బిల్లులకు ఏ మాత్రం పొంతన లేకపోవడంతో వారికి ఆర్థిక భారంగా మారుతోంది. విద్యార్థులకు అందించే కోడిగుడ్డు ధర మార్కెట్లో రూ.8 నుండి రూ.9 వరకూ ఉండగా ప్రభుత్వం మాత్రం కేవలం రూ.6 మాత్రమే చెల్లిస్తోంది. అంతే కాకుండా నిత్యావసరాలైన పప్పులు ఉప్పులు నూనెలు ఇతర ధరలు ఆకాశాన్ని అంటుతున్నా అందుకు అనుగుణంగా ధరలు పెంచక పోవడం 'పెనంమీద నుండి పొయ్యిలో పడ్డ' చందంగా ఉందనే వాదన వినవస్తోంది. ప్రభుత్వం బడుల్లో చదివే పేద, మధ్య తరగతి విద్యార్థులకు చదువులపై మక్కువ కల్పించేందుకు ప్రభుత్వం మధ్యాహ్నభోజన పథకాన్ని అమలు చేస్తోంది. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించడంతో పాటు

తరువాయి 12లో



## ఆశలు బూడిద

- చెరువుగట్టులోని దుకాణ సముదాయంలో అగ్నిప్రమాదం
- రూ.4.5 కోట్ల ఆస్తి నష్టం
- 27 మంది చిరువ్యాపారుల కుటుంబాల్లో తీవ్ర విషాదం

ప్రజాపక్షం/నల్లగొండ/నార్కట్‌పల్లి

నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం చెరువుగట్టు పుణ్యక్షేత్రం ఎదురుగా ఉన్న దుకాణ సముదాయంలో ఆదివారం తెల్లవారుజామున భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఒక్కసారిగా చెలరేగిన మంటలు ఒక దుకాణం నుంచి మరొక దానికి వ్యాపించడంతో 20కి పైగా దుకాణాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈప్రమాదంలో సుమారు రూ.4.5 కోట్లకు పైగా

తరువాయి 12లో

ప్రజాపక్షం
Telugu National Daily
హైదరాబాద్
సోమవారం
27-07-2026
www.prajapaksham.in



# సాహిత్యాన్ని తొలిచేస్తున్న 'చౌర్యం'

సాహిత్యం అనేది మానవ అనుభవానికి కళాత్మక రూపం. ఒక రచయిత తన కాలాన్ని, తన సమాజాన్ని, తన అంతరంగాన్ని, తన ఊహాశక్తిని పదాల ద్వారా పునర్నిర్మిస్తాడు. ఆ పునర్నిర్మాణంలో గత రచనల ప్రభావం తప్పనిసరిగా ఉంటుంది. ఏ రచయితా శూన్యం నుంచి సృష్టించడు. పూర్వ సాహిత్యం, జానపద సంప్రదాయాలు, చరిత్ర, తత్వశాస్త్రం, ఇతర కళారూపాలు, సమకాలీన జీవితం వంటి ఎన్నో అంశాలు ఒక రచయిత సృజనకు మూలాధారాలుగా నిలుస్తాయి. అయితే ప్రభావం, ప్రేరణ, సృజనాత్మక పరివర్తన ఒక వైపు ఉంటే, మరొకరి ఆలోచనలను, పదాలను, నిర్మాణాలను తమవిగా ప్రకటించుకోవడం మరో వైపు ఉంటుంది. ఈ రెండింటి మధ్య ఉన్న సన్నని గీతనే సాహిత్య నైతికత నిర్ణయిస్తుంది. సాహిత్యంలో 'చౌర్యం' (ప్లేజరిజం) అంటే మరొకరి పదాలను, ఆలోచనలను, సృజనాత్మక కృషిని తగిన గుర్తింపు ఇవ్వకుండా స్వంత రచనగా ప్రదర్శించడం. కేవలం కొన్ని వాక్యాలను యథాతథంగా తీసుకోవడం. అంటే, ఒక కథా నిర్మాణం, ఒక ప్రత్యేకమైన భావన, ఒక కవితా రూపకల్పన, ఒక పరిశోధనా ఆలోచన, ఒక విమర్శనాత్మక సిద్ధాంతం వంటి అంశాలను కూడా మూల రచయితకు గౌరవం ఇవ్వకుండా స్వీకరించడం. సాహిత్య చరిత్రను పరిశీలిస్తే, స్ఫూర్తి లేదా ప్రేరణ లేదా ప్రభావానికి, చౌర్యానికి మధ్య తేడా అనాదిగా చర్చనీయాంశమే. ఒక రచయిత మరొక రచయిత నుంచి ప్రేరణ పొందడం సహజం. కానీ ప్రేరణ పొందిన అంశాన్ని తన అనుభవంతో, తన భాషతో, తన దృష్టితో కొత్త కళారూపంగా మార్చడం సృజనాత్మక ప్రక్రియ. అదే విషయాన్ని స్వల్ప మార్పులతో తిరిగి అందించడం ఏ మాత్రం సృజన అనిపించుకోదు. ఒక పురాతన కథను ఆధారంగా చేసుకుని కొత్త కాలానికి అనుగుణంగా కొత్త అర్థాలను సృష్టించడం, ఒక పురాణ గాథను ఆధునిక సామాజిక సమస్యలతో అనుసంధానం చేయడం, ఒక పాత కవితా భావాన్ని కొత్త తాత్విక దృష్టితో పునర్నిర్మించడం వంటి ప్రక్రియలు సాహిత్య పరిణామంలో భాగం. ప్రపంచ సాహిత్యంలో అనేక గొప్ప రచనలు గత సంప్రదాయాలతో సంభాషిస్తూ పుట్టాయి. గ్రీకు పురాణాలు, బైబిల్ కథనాలు, భారత ఇతిహాసాలు, జానపద గాథలు, ప్రాచీన కావ్యాలు అనేక తరాల రచయితలకు ప్రేరణగా నిలిచాయి. కానీ ఆ రచయితలు పాత కథలను యథాతథంగా తమ పేరుతో ప్రచారం చేయలేదు. వారు వాటిని కొత్త భావజాలంతో, కొత్త కళాత్మక దృష్టితో మలిచారు. అందువల్ల ప్రేరణ అంటే సృజనకు విత్తనం. చౌర్యం అంటే ఆ విత్తనం ఎక్కడి నుంచి వచ్చిందో దాచిపెట్టి, ఫలాన్ని మాత్రమే తనదిగా ప్రకటించుకోవడం. ఈ సందర్భంలోనే 'మౌలికత' అనే భావనను కూడా సరిగ్గా అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉంది. సాహిత్యంలో మౌలికత అంటే ప్రపంచంలో ఇంతకు ముందు ఎవరూ ఆలోచించని విషయాన్ని మాత్రమే రాయాలనే నిబంధన కాదు. ఎందుకంటే, మానవ జీవితంలోని అనేక అనుభవాలు శతాబ్దాలుగా పునరావృతమవుతూనే ఉన్నాయి. ప్రేమ, విరహం, యుద్ధం, అధికారం, పేదరికం, అసమానత, మరణం, ఆశ, తిరుగుబాటు వంటి అంశాలు వేల సంవత్సరాలుగా సాహిత్యంలో కనిపిస్తున్నాయి. అయినప్పటికీ ప్రతి గొప్ప రచన ప్రత్యేకంగా నిలుస్తుంది. ఎందుకంటే రచయిత ఆ అంశాలను చూసే దృష్టి, భాష, నిర్మాణం, అనుభూతి ప్రత్యేకంగా ఉంటాయి. ఒకే వర్షాన్ని చూసిన ఇద్దరు కవులు రెండు భిన్నమైన కవితలను రాయగలరు. ఒకే సామాజిక సమస్యను చూసిన ఇద్దరు నవలా రచయితలు భిన్నమైన ప్రపంచాలను నిర్మించగలరు. సాహిత్య మౌలికత అక్కడే ఉంటుంది. కానీ కొందరు రచయితలు మౌలికత అనే బాధ్యతను పక్కన పెట్టి, ఇతరుల కృషిని తమ పేరుతో ప్రచారం చేస్తారు. ఈ ధోరణి వ్యక్తిగత నైతిక పతనం. సాహిత్య వ్యవస్థపై నమ్మకాన్ని దెబ్బతీసే దుర్మార్గం. రచయితకు ఉన్న ప్రధాన మూలధనం విశ్వసనీయత. ఒకసారి ఆ విశ్వసనీయత కోల్పోతే, గొప్ప రచనా నైపుణ్యం ఉన్నప్పటికీ ఆ రచయిత స్థానం ప్రశ్నార్థకమవుతుంది. సాహిత్య చౌర్యం గురించి చర్చించినప్పుడు తరచుగా పదాల స్థాయిలోనే దృష్టి నిలుస్తుంది. కానీ అసలు సమస్య మరింత లోతైనది. ఒక రచయిత ప్రత్యేకంగా నిర్మించిన ఆలోచనా ప్రపంచాన్ని, పరిశోధన ద్వారా కనుగొన్న విషయాన్ని, సంవత్సరాల అనుభవంతో ఏర్పడిన సిద్ధాంతాన్ని గుర్తింపు లేకుండా స్వీకరించడం మరింత తీవ్రమైన ఉల్లంఘన. ఉదాహరణకు, ఒక విమర్శకుడు ఒక సాహిత్య ఉద్యమానికి కొత్త నిర్వచనం ఇచ్చాడనుకుందాం. మరో వ్యక్తి అదే భావనను కొద్దిపాటి పద మార్పులతో తన సిద్ధాంతంగా ప్రచారం చేస్తే, అక్కడ పదాల దొంగతనం కంటే ఆలోచనా కృషి దోపిడీ ముఖ్యమవుతుంది.



చౌర్యం అంటే ఎప్పుడూ ఇతరుల రచనల నుంచే జరగదు. ఒక రచయిత తన పాత రచనలను సరైన సమాచారం లేకుండా తిరిగి ఉపయోగించినప్పుడు, అది స్వీయ చౌర్యం అవుతుంది. సాహిత్యంలో ఇది వివిధ రూపాల్లో కనిపిస్తుంది. ఒకే కథను కొద్దిపాటి మార్పులతో వేర్వేరు పత్రికలకు పంపడం, పాత వ్యాసాన్ని కొత్తదిగా ప్రచురించడం, గతంలో ప్రచురించిన పరిశోధనా ఫలితాలను కొత్త పరిశోధనగా చూపించడం వంటి చర్యలు స్వీయ చౌర్యం జాబితాలోకే చేరుతాయి. అయితే పునర్విమర్శ లేదా పునర్‌రచనకు, స్వీయ చౌర్యం ఒకే రకంగా కనిపించినా, రెంటి మధ్య తేడా ఉంది. ఒక రచయిత తన పాత నవలను కొత్త సందర్భంలో తిరిగి అభివృద్ధి చేసి, అది పాత రచనకు విస్తరణ అని స్పష్టంగా ప్రకటిస్తే అది సృజనాత్మక ప్రక్రియ. కానీ పాత రచనను దాచిపెట్టి కొత్త రచనగా చూపితే అది నైతిక సమస్య అవుతుంది. ఇక, పుస్తకాల పునర్ముద్రణ సాహిత్య ప్రపంచంలో సాధారణమైన ప్రక్రియ. గొప్ప రచనలు తరతరాలకు అందాలంటే పునర్ముద్రణ అవసరం. అనేక భాషలలోని క్లాసిక్ రచనలు నిరంతరం కొత్త సంచికలుగా వెలువడుతుంటాయి. కానీ పునర్ముద్రణలో పారదర్శకత కీలకం. ఒక వ్యాసం, కథ, కవిత ముందుగా ఎక్కడ ప్రచురితమైందో తెలియజేయకుండా కొత్త ప్రచురణగా అందించడం పాఠకులను తప్పుదోవ పట్టిస్తుంది. పత్రికలు, ప్రచురణ సంస్థలు కూడా పునర్ముద్రణ విషయాన్ని స్పష్టంగా పేర్కొనాలి. ప్రత్యేకంగా జిటల్ యుగంలో పాత రచనలు సులభంగా తిరిగి ప్రచారంలోకి వస్తున్నాయి. సామాజిక మాధ్యమాల్లో మూల రచయిత పేరు తొలగించి కంటెంట్‌ను పంచుకోవడం కూడా సాహిత్య హక్కులకు సంబంధించిన సమస్యలను పెంచుతోంది. విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థల్లో 'ప్లేజరిజం' మరింత తీవ్రమైన సమస్య. పరిశోధన అనేది కొత్త జ్ఞానాన్ని సృష్టించే ప్రక్రియ. అందులో ఇతరుల సిద్ధాంతాలు, పరిశోధనా ఫలితాలు ఉపయోగిస్తే తప్పనిసరిగా మూలాలను ప్రస్తావించాలి. ఇతరుల పరిశోధనను కాపీ చేయడం, తప్పుడు గణాంకాలను సృష్టించడం, జరగని ప్రయోగాలను జరిగినట్లు చూపించడం, ఒకే పరిశోధనను అనేక పత్రికల్లో ప్రచురించడం వంటి చర్యలను పరిశోధనా మోసంగా పేర్కోవాలి. శాస్త్ర ప్రపంచంలో ఇలాంటి మోసాలు ఒక వ్యక్తి ప్రతిష్ఠను దిగజార్చడంతోపాటు, మొత్తం జ్ఞాన వ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని తగ్గిస్తాయి. వైద్యం, సాంకేతికత, పర్యావరణ పరిశోధన వంటి రంగాల్లో తప్పుడు సమాచారం సమాజానికి తీవ్రమైన నష్టాన్ని కలిగించవచ్చు.

సాహిత్య ప్రపంచంలో నైతికతను కాపాడే బాధ్యత రచయిత ఒక్కరిపైనే ఉండదు. సంపాదకులు, ప్రచురణ కర్తలు, పరిశోధనా సంస్థలు కూడా కీలక పాత్ర పోషిస్తాయి. రచయిత తన రచనలో ఉపయోగించిన మూలాలను స్పష్టంగా పేర్కొనాలి. అనువాదాలు, అనుసరణలు, పునర్‌రచనలు జరిగినప్పుడు వాటి మూలాలను వెల్లడించాలి. సంపాదకులు రచనలను పరిశీలించే సమయంలో చౌర్యాన్ని గుర్తించే పద్ధతులను అనుసరించాలి. అదే సమయంలో చౌర్య ఆరోపణలు వచ్చినప్పుడు కూడా జాగ్రత్త అవసరం. ప్రతి పోలికను చౌర్యంగా పరిగణించలేం. సాధారణ భావనలు, చారిత్రక వాస్తవాలు, సామూహిక సాంస్కృతిక అంశాలు ఎవరి వ్యక్తిగత ఆస్తి కావు. నిర్ణయం తీసుకునేటప్పుడు సందర్భం, పరిమాణం, ఉద్దేశం వంటి అంశాలను పరిశీలించాలి. ఏదిఏమైనా, సాహిత్య చౌర్యం సహజంగానే రచయితపై ఉన్న నమ్మకాన్ని దెబ్బతీస్తుంది. సాహిత్యంలో పేరు, ప్రతిష్ఠ చాలా కాలం పాటు నిర్మించుకునే సంపద. ఒకసారి రచయితపై చౌర్య ముద్ర పడితే అతని లేదా ఆమె భవిష్యత్ రచనలను కూడా అనుమానంతో చూడే పరిస్థితి ఏర్పడుతుంది. చౌర్యం నిజమైన సృజనాత్మకతకు నష్టం చేస్తుంది. కష్టపడి కొత్త ఆలోచనలు సృష్టించే రచయితలకు అన్యాయం జరుగుతుంది. అదే సమయంలో పాఠకుల విశ్వాసాన్ని కూడా దెబ్బతీస్తుంది. సాహిత్యం అనేది రచయిత–పాఠకుల మధ్య ఏర్పడే మానసిక ఒప్పందం. ఆ నమ్మకం దెబ్బతింటే సాహిత్య వ్యవస్థ మొత్తం బలహీనపడుతుంది. సాహిత్య చౌర్యాన్ని పూర్తిగా నిర్మూలించడం కష్టమైనప్పటికీ, దాని ప్రభావాన్ని గణనీయంగా తగ్గించవచ్చు. మొదటగా రచయితల్లో సాహిత్య నైతికతపై అవగాహన పెరగాలి. మూలాలను గుర్తించ డం, ఉటంకణ పద్ధతులను పాటించడం రచనా ప్రక్రియ లో భాగం కావాలి. విద్యాసంస్థలు చిన్న వయస్సు నుంచే విద్యార్థులకు ప్లేజరిజం గురించి బోధించాలి. పరిశోధకులకు సరైన సైటేషన్ పద్ధతులు, పరిశోధనా నైతికతపై శిక్షణ ఇవ్వాలి. ప్రచురణ సంస్థలు కూడా ఆధునిక చౌర్య గుర్తింపు సాధనాలను ఉపయోగించాలి. అయితే సాంకేతిక సాధనాలతో పాటు మానవీయ పరిశీలన కూడా అవసరం. ఎందుకంటే సాహిత్య చౌర్యం కేవలం పదాల పోలికతో నిర్ణయించలేని సంక్లిష్టమైన విషయం. గొప్ప సాహిత్యం అనేది ఇతరు ల ఆలోచనలను దొంగిలించడం ద్వారా రాదు. వాటితో సంభాషిస్తూ కొత్త సృజనను నిర్మించడం ద్వారా పుడుతుంది. ప్రతి రచయితకు ముందు వచ్చిన సాహిత్య సంపద ఒక పునాది మాత్రమే, దాన్ని తనదిగా ప్రకటించుకునే హక్కు కాదు. స్ఫూర్తిని స్వీకరించడం సృజనాత్మకతకు సంకేతమైతే, మూలాన్ని దాచిపెట్టి స్వంతంగా ప్రకటించడం సాహిత్య నైతికతకు విరుద్ధం. సాహిత్య ప్రపంచంలో స్వేచ్ఛ ఎంత ముఖ్యమో, బాధ్యత కూడా అంతే ముఖ్యం.



– డాక్టర్ ఆర్. లక్ష్మీ ప్రసూన

## అమరత్వానికి రమణీయతను అద్దిన విప్లవ గొంతుక

# పరిటాల నాగన్న



అమరత్వానికి రమణీయత తెచ్చిన విప్లవ గొంతుక ప్రజల పక్షాన పోరాడి ఎందరో త్యాగధనులు తమ ప్రాణాలను కోల్పోయారు. కానీ ప్రాణాలు కోల్పోయిన వీరులను స్మరించడం ద్వారా అమరత్వానికి రమణీయతను అద్దిన విప్లవ గొంతుక పరిటాల నాగన్న అలియాస్ అరుణోదయ నాగన్న. కళ వ్యాపార రంగమై ప్రజా కళలు సైతం వ్యాపార గుప్పె ట్లో చిక్కుకుని విలవిలలాడుతున్న సమయమిది. వర్గ చైతన్యాన్ని, సామాజిక ధృక్పథాన్ని మరిచి తమ గొంతుకలను అమ్ముకుంటున్న సందర్భం. లేని దానిని సృష్టించి ఉన్నట్లుగా ప్రజలను భ్రమించే రీతిలో పాటలు పాడుతూ రాజకీయ నాయకుల ప్రాపకం పొందుతున్నారు. కానీ తన గళాన్ని, కలాన్ని, ప్రజా చైతన్యానికి, వర్గ పోరాటాలకు మాత్రమే అంకితం చేసిన కవి, గాయకుడు అరుణోదయ నాగన్న. తనకు సినిమాల్లో అవకాశం వచ్చినప్పుడు ఆ పారితోషికాన్ని సైతం పార్టీ నిధికి జమ చేసిన నాగన్న ప్రజా సాంస్కృతికోద్యమంలో విరామమెరుగని కళాకారుడు. 40 ఏళ్ల పాటు నిబద్ధతగా తన కంఠాన్ని జన చైతన్యం కోసం ఉపయోగించాడు. ఎమర్జెన్సీ సమయంలో పోట్ల రామనర్సయ్యను అప్పటి పోలీసులు ఎన్‌కౌంటర్ పేరుతో కాల్చి చంపినప్పుడు పోట్ల రామనర్సయ్య త్యాగ చరిత అంతగా తెలిసింది కాదు. కానీ అన్న అమరుడురా మన రామనర్సయ్య అన్న పాటను గ్రామ గ్రామాన పాడి రామనర్సయ్య అమరత్వాన్ని రమణీయంగా మార్చిన కళాకారుడు నాగన్న, ఒక్క పోట్ల రామనర్సయ్యే కాదు అప్పటి దళ నేత ఎల్లన్న అలియాస్ చంద్ర కృష్ణమూర్తి మరణించినప్పుడు ఆయన పాడిన స్మృతి గీతాలు సైతం ఎల్లన్న కీర్తిని అజరామరం చేశాయి. వీరా సూరా విప్లవ రణధీర ఎల్లన్న అన్న పాట బహుళ ప్రజాధరణ పొందింది. నాగన్న గొంతు నుంచి ఆ పాట వింటుంటే రోమాలు నిక్కరపోడుచుకునేవి. ఇటీవల కాలంలో పోలీస్ ఎన్‌కౌంటర్‌లో మరణించిన లింగన్నను స్మరిస్తూ నాగన్న పాడిన పాట లింగన్న అమరత్వాన్ని అజరామరం చేసింది. చికాగో నగరానా చిందిన రక్తంలో తడిసిన ఎర్రగుడ్డ అది ఎట్ల చేరిందో రోళ్లగడ్డ అన్న యోచన పాటను తన గొంతుక ద్వారా వినిపించి నాగన్న లింగన్నకు ఒక చరిత్ర లిఖించాడు. సాదా సీదాగా జనం మధ్యనే ఉంటూ జనం పాటలు పాడిన నాగన్న గొంతుక వినని వారు ఉండరంటే అతిశయోక్తి కాదు. కానీ ఆయన ఆర్థికంగా తీవ్ర దుర్భర స్థితిని ఎదుర్కొన్నారు. ఖమ్మం నగరంలోని మమత ఆసుపత్రి ఏరియాలో నాగార్జున సాగర్ కాలువ కట్టపై చిన్న ఇంట్లో జీవించే వారు. ప్రభుత్వం గుడిసెల తొలగింపులో ఆ గుడిసెను కూల్చివేస్తే నాగన్న కుటుంబం రోడ్డున పడింది. అయినా తన కుటుంబ జీవనోపాధి కోసం ఎవరి ముందు చేయి చాచని నాగన్న తన గొంతును అమ్ముకోవడానికి ప్రయత్నించ లేదు. సీదా సాదా కళాకారులు సైతం ఇప్పుడున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని యూట్యూబ్‌ల ద్వారా వేల రూపాయలు సంపాదిస్తున్న నేటి తరుణంలో బుర్రకథ, యక్షగానం, జముకుల కథ, హరికథ, గొల్లసుద్దులు, పిట్టలదొర ఇత్యాది కళారూపాలను ప్రదర్శిస్తూ అత్యంత ప్రజాదరణ పొందిన నాగన్న తన కళను ప్రజా చైతన్యానికి తప్ప ఆర్థిక అవసరాలకు వినియోగించ లేదు. ఐదు దశాబ్దాల పాటు తన పాటతో ఎందరినో చైతన్యపరిచిన నాగన్న పల్లెటూరి కూలీ రైతానీ పిల్ల జెల్ల సల్లగున్నారా అంటూ రైతులను పలకరించినా ఈ ఊరు మనదిరా ఈ వాడ మనదిరా అంటూ దొర తనాన్ని ప్రశ్నించిన నాగన్నకే చెల్లింది. నాగన్నను సంస్మరించుకుంటున్న సందర్భంగా కలాలు, గళాలు డబ్బుకు దాసోహమంటున్న ఈ వేళ నాగన్న తన కుటుంబాన్ని కళకే అంకితం చేశాడు. నాగన్న భార్య లక్ష్మి సైతం బుర్రకథలో వంతగా నిలవడంతో పాటు పలు పాటలు పాడేది. కుమారుడు అజయ్ సైతం తండ్రి వారసత్వాన్ని పుణికిపుచ్చుకుని అభ్యుదయ గీతాల ఆలాపనలో ఉన్నాడు. నాగన్న జీవితం నుంచి రెండు విషయాలు నేర్చుకోవాలి. ఆర్థిక సమస్యలు చుట్టు ముట్టినా తన గొంతును అరువు ఇవ్వడం ద్వారా ఆర్థిక సమస్యలను అధిగమించే అవకాశం ఉన్నా ఆ పని చేయకుండా గొంతును ప్రజా ఉద్యమానికి అంకితం చేయడం రెండవది తన తర్వాతి తరాన్ని కూడా ప్రజా ఉద్యమాల వైపు మర్చడం నిజంగా అభినందనీయం. వీరులు మరణిస్తే కొన్ని రోజుల పాటు చెప్పుకుని ఆ తర్వా క్రమేపి మరిచిపోవటం అలవాటే. కానీ ఆ వీరునికి సంబంధించిన పాటతో ఆ అమరత్వానికి రమణీయతను అద్ది జగద్విదితం చేయడంతో పాటు అజరామరం చేసిన నాగన్న నిజంగా అమరుడు, స్మరణీయుడు.

ఏనుగు వెంకటేశ్వరరావు, ఖమ్మం

# అనుకరణ గీతాల అక్రమ గేయ సంపుటి జనచంద్రోదయం

(2026 జనవరి 5వ తేదీ సోమవారం నాటి సాహితీ పేజీలో 'సామాజిక చైతన్య స్వరం.. జనచంద్రోదయం' శీర్షికన పుస్తక సమీక్ష ముద్రితమైంది. అది కేవలం ఆ పుస్తకంలో ఉన్న గేయాలపై సమీక్ష మాత్రమే. అయితే, ఆ పుస్తకంలో కొన్ని 'అనుకరణ' పాటలు ఉన్నాయని పేర్కొంటూ డాక్టర్ తంగెళ్ళ శ్రీదేవి రెడ్డి రాసిన 'అనుకరణ గీతాల అక్రమ గేయ సంపుటి.. జనచంద్రోదయం' వ్యాసం. ఇందులో ఇచ్చిన వివరణలు, చేసిన ఆరోపణలు రచయిత్రి అభిప్రాయాలే తప్ప 'ప్రజాపక్షం' దినపత్రికకు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఈ వివాదంలో ఎలాంటి సంబంధం లేదు. జోక్యం చేసుకోదు).

ఇటీవల ఆవిష్కరింపబడిన 'జనచంద్రోదయం' అన్న గేయ సంపుటి నా చేతికొచ్చింది. రచయిత పేరు గడ్డమీది చంద్రమోహన్‌గౌడ్ అని ప్రచురింపబడి ఉంది. పుస్తకం తెరిచి ఒక్కొక్క గీతాన్ని చదువుతుంటే, అవన్నీ ఎక్కడో అక్కడ, ఎప్పుడో అప్పుడు, ఎవరో వేర్వేరు కవులు రాసిన గీతాలుగా నాకు స్ఫురించాయి. అయితే పల్లవి (కొన్ని మార్పులతో), లేదా చరణాలు, లేదా కవితాత్మ (స్పిరిట్ ఆఫ్ ది పోయెం) ఇతర కవులవి తస్కరించి చంద్రమోహన్ గౌడ్ పేరుతో అచ్చేసుకున్నట్లు అర్థమై పేజీలు తిరిగేస్తుంటే, నాకు తెలిసిన కొన్ని మూలరచనలు; వాటి కాపీ రచనలు(అనుకరణలు) ఇక్కడ పొందుపరుస్తున్నాను.

పూలా సీరే గట్టి ఎర్రా రైకే తొడిగి
సర్రు సర్రున రావే ఓ మర్దల్ పిల్లా
సారాసీసలు దేవే ఓ ముద్దులగుల్ల ॥పూల॥

ఎర్రా ఎర్రని ఒళ్ళు నల్లా నల్లని కళ్ళు
జామపండ్లా పెదాలే మర్దల్ పిల్లా
పాడు పాడవె పదాలే ముద్దుల గుల్ల ॥పూల॥

ఎస్వీ (సరిగమలు 1978–2015)

**ఈ గీతానికి యథాతథ అనుకరణ...**

పట్టుచీరే గట్టి పట్టురైకే తొడిగి
చెంగు చెంగున రావే నామర్దల్ పిల్లా
బోనమెత్తగ రావా నా ముద్దుల పిల్లా ॥పట్టుచీరె॥
అందమైనా ఒల్లు నల్లనల్లని కళ్ళు
దొండపండు పెదాలే నా మర్దల్ పిల్లా
బిర్రు బిర్రున రావే నా మర్దల్ పిల్లా ॥పట్టుచీరె॥

గడ్డమీది చంద్రమోహన్ గౌడ్ (జన చంద్రో-దయం, 2025)

**అలాగే మరో అనుకరణ గీతం...**

రివ్వు రివ్వున రావే నా మరుదలు పిల్లా
సర్రు సర్రున రావే నా ముద్దుల గుల్లా

నన్ను కోరగరావే నా ముద్దుల గుమ్మా
నన్ను చేరగరావే నా ముద్దుల గుమ్మా

గడ్డమీది చంద్రమోహన్ గౌడ్ (జన చంద్రోదయం)

**ఇంకో మూలరచన...**

జాతరంటే జాతర మాంకాళి జాతర
మన గౌలిపురం కెళదామే మాంకాళి జాతర

ఎస్వీ (సరిగమలు)

**ఈ గీతానికి అనుకరణ....**

జాతరంటె జాతర మేడారం జాతర
సమ్మక్క సారక్కలు వెలసిన జనజాతర

చంద్రమోహన్ గౌడ్ (జన చంద్రోదయం)

**మరో మూలరచన....**

నిదురించిన మన జాతిని కదిలించిన వీరులార
స్వేచ్ఛ కొరకు కదనాలను నడిపించిన ధీరులార
ఎర్రెర్రని వందనాలు అందుకోండి లాల్‌సలాం

ఎస్వీ (కమ్యూనిస్టు ఉద్యమగీతాలు 2005)

**ఈ గీతానికి అనుకరణ**

నిదురించిన పీడితులను కదిలించిన ధీరుడా!
సర్వాయిపాపన్న సమరశీల యోధుడా!

చంద్రమోహన్ గౌడ్ (జనచంద్రోదయం, 2025)

**అలాగే మరో ప్రఖ్యాత గీతం...**

చెయ్యెత్తి జైకొట్టు తెలుగోడా!
గతమెంతో ఘనకీర్తి గలవోడా!
సాటిలేని జాతి ఓట మెరుగని కోట
నివురు గప్పినేడు నిదురపోతుండాది
జై కొట్టి మేల్కొలుపు తెలుగోడా!
గతమెంతో ఘనకీర్తి గలవోడా!
సుడిగాలి వీచింది అణగారి పోయింది
నట్టనడి సంద్రాన నావ నిలుచున్నాది

వేములపల్లి శ్రీకృష్ణ (తెలుగులో ఉద్యమగీతాలు, 1991)

**ఈ పాట బాణీని ఉన్నదున్నట్లుగా రాసిన అనుకరణ గీతం...**

కలిసి పనిచేద్దాం కామ్రేడా
గతమెంతో ఘనకీర్తి గలవోడా
కలిసి పని చేద్దాం కామ్రేడా
గతమెంతో ఘనకీర్తి గలవోడా...
పెనుగాలి వీచింది పాపము పండింది
భవిష్యత్ మనదే కామ్రేడా
బాధలుండవిక కామ్రేడా...

చంద్రమోహన్‌గౌడ్ (జనచంద్రోదయం, 2025)

అలాగే....
కమ్యూనిస్టులం మేము కష్టజీవులం
ఔనన్నా కాదన్నా అదే ఇష్టులం
ఇది ప్రజానాట్యమండలి, జననాట్యమండలి కళాకారులు పాడుతున్న సుప్రసిద్ధ గీతం.
ఇంత ప్రఖ్యాతి చెందిన గీతాన్ని కూడా ఈ అనుకరణ పితామహుడు వదలలేదు.
కమ్యూనిస్టులం మేము కమ్యూనిస్టులం
ప్రజల కొరకు పోరాడే ఎర్రజెండా బిడ్డలం

చంద్రమోహన్‌గౌడ్ (జనచంద్రోదయం)

**ప్రజాకవి కాళోజీ గీతం...**

అవనిపై జరిగేటి అవకతవకలు జూసి
ఎందుకో నా హృదిని ఇన్ని ఆవేదనలు

(నా గొడవ)

**ఈ గీతాన్ని అనుకరిస్తూ.....**

అవనిపై అడుగిడి అంతరిక్షము చేరి
అన్నీటిలో నువ్వు అధిగమించినావు

చంద్రమోహన్ గౌడ్ (జనచంద్రోదయం)

గని కార్మికకవి కె.లక్ష్మీనారాయణరాసిన విశేష ప్రాచుర్యం పొందిన ప్రజానాట్యమండలి గీతం...
సూడు మల్లేశా! సూడు మల్లేశా
దేశమెట్ల పోతుందో కనరా మల్లేశా
(ప్రతిధ్వని, ప్రజానాట్యమండలి పాటలు, 1981).
ఈ పాట చూపిన బాటలో...
సూడు చెల్లెమ్మా! జెరా సూడు చెల్లెమ్మా
ధరలెట్లా పెరగవట్టె సూడు సెల్లెమ్మా

చంద్రమోహన్ (జనచంద్రోదయం)


'అవ్వ నీకు దండమే
మా అవ్వ నీకు దండమే'
అనే పల్లవితో సాగే ప్రజాగేయానికి అనుకరణ...
నాన్న నీకు దండమే
ఓ నాన్న నీకు దండమే

చంద్రమోహన్ (జనచంద్రోదయం)

ఇవి మచ్చుకు కొన్నిమాత్రమే. ఎవరైనా సాహిత్య పరిశోధక విద్యార్థి పూనుకుంటే, ఇంకా ఈ జనచంద్రోదయంలోని అనేక గీతాలకు మాతృకలయిన మూలగీతాలు దొరుకుతాయి. ఒక సృజనాత్మక కవి ఎంతో మేధోమథనంతో మొదట ఒక పల్లవిని అల్లుకుని, ఒకటికి రెండు సార్లు మననం చేసుకుని గీతాన్ని సృజిస్తాడు. దానికి ఒక బాణీని, భాషను, భావ వ్యక్తీకరణను సమకూర్చుకుంటాడు. గాయకులతో కూర్చుని పాటకు తుదిరూపమిస్తాడు. ఒక మాతృమూర్తి ఆరోగ్యకరమైన శిశువును ప్రసవించడానికి పడే పురిటినొప్పులు పడినట్లుగా మధనపడి ఒక గీతాన్ని రచిస్తాడు. ఇదొక సృనాత్మక కళ. ఒరిజినల్ కవికి తన ప్రతిగీతం ఒక బిడ్డ లాంటిదే. యాభై సంవత్సరాలుగా కంటికిరెప్పలా కాపాడుకుంటున్న తన స్వీయ రచనను ఒక అనుకరణకవి, కాపీ రచయిత నిస్సిగ్గుగా, నిర్భీతిగా, నిస్సంకోచంగా, నిస్సందేహంగా ఒక గద్దలాగా వచ్చి తన్నుకుపోతుంటే ఎంతో మానసిక వ్యధకు గురవుతాడు. ఇది సహృదయులైన సాహితీ వేత్తలకు మాత్రమే అర్థమవుతుంది. రచయితలుగా చలామణి కావాలని ఉబలాటపడే అకవులకు, కుకవులకు, గేయచోరులకు ఈ వేదన అర్థం కాదు. 'ఫలానా కవి అవ్వ నీకు దండమే అంటే, నేను నాన్న నీకు దండమే అన్నాను కదా!', ఎస్వీ గౌలిపురం జాతర అన్నాడు, నేను మేడారం జాతర అన్నా ను. 'ఆయన ప్రేమాప్రేమా అన్నాడు నేను లవ్ లవ్ అ న్నాను, భాష మారింది కదా' అని మొండిగా వాదించ టం అమాయకత్వం, అజ్ఞానం, మూర్ఖత్వాలకు పరాకాష్ట.

– డా॥ తంగెళ్ళ శ్రీదేవిరెడ్డి

# పుస్తకాలతో హైవే నిర్మాణం!



కొంత వాస్తవం... మరి కొంత అతిశయోక్తి కలగలసిన సమాచారంగా ఎం6 మోటార్‌వే నిర్మాణాన్ని ప్రస్తావించుకోవాలి. ఇంగ్లాండ్‌లోని వెస్ట్ లాండ్స్‌లో ఉన్న ఈ రహదారిని 2003లో పునర్నిర్మించారు. ఆ సమయం లో మిల్స్ అండ్ బూన్ ప్రచురణ సంస్థ వద్ద అమ్ముడుకాకుండా మిలిగిపోయిన 25 లక్షల పుస్తకాలను వినియోగించారని అంటారు. ఇందులో నిజం లేకపోలేదు. పుస్తకాలను రీసైక్లింగ్ చేశారు. వాటి గుజ్జును ఇతర పదార్థాలతో కలిసి రోడ్డు అడుగు భాగంలో ఉపయోగించారు. ఇందులో ఎన్ని పుస్తకాలు వినియోగించారన్నది ఎవరూ లెక్కించలేదు. అయితే, సుమారుగా 25 లక్షల వరకూ ఉండవచ్చని అంచనా. ఈ చర్యపై ప్రపంచ వ్యాప్తంగా కొంత వ్యతిరేకత కూడా లేకపోలేదు. ఇది సాహిత్య పరంగా ఒక విరుద్ధ భావనను కలిగిస్తుంది. ఒకవైపు పుస్తకాలు జ్ఞానానికి చిహ్నం. మరోవైపు అవే పుస్తకాలు రో డ్డు నిర్మాణాన్ని వినియోగించడం వాటి పట్ల ప్రదర్శించే నిర్లక్ష్యానికి నిదర్శ నం. కానీ, ఇక్కడ భావోద్వేగం కంటే వాస్తవం ముఖ్యం. వినియోగించకుండా పక్కన పడేస్తే వృథా అయ్యేవి. రీసైక్లింగ్ ద్వారా అవి కనీసం ఉపయోగంలోకి వచ్చాయి. ఇలావుంటే, ఈ ఘటనను నవలల పట్ల పాఠకుల్లో ఆసక్తి ఉండదని, అందుకే, లక్షలాది పుస్తకాలు అమ్ముడుకాకుండా ఉండిపోయాయని విమర్శించేవారు కూడా లేకపోలేదు. అయితే, ఇది సరైన వాదన అనిపించుకోదు. మార్కెట్‌లో అమ్మకాలను బట్టి సాహిత్య విలువను అంచనా వేయలేం. ఇది కేవలం డిమాండ్–సప్లయి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని మాత్రమే సూచిస్తుంది.

ఈ వారం కవితలు

## అక్షర విన్యాసాలు



అక్షరజల్లులు కురిపిస్తా,
ఆనందధారలు పారిస్తా,
అక్షరగంగను ప్రవహింపజేస్తా,
అమృతస్నానం చేయిస్తా

అక్షరవిత్తనాలు నాటుతా,
ఆలోచనలమొక్కలు మొలిపిస్తా,
అక్షరతోటను పెంచుతా,
అందాలలోకము చూపిస్తా

అక్షరపువ్వులు పూయిస్తా,
అనురాగపరిమళాలు చల్లిస్తా,
అక్షరమకరందం పంచుతా,
అంతరంగాలను అలరిస్తాe

అక్షరదీపాలు వెలిగిస్తా,
అజ్ఞానచీకట్లు తొలగిస్తా,
అక్షరజ్యోతులు ప్రసరింపజేస్తా,
అభ్యుదయమార్గం కనబరుస్తాe

అక్షరామృతము త్రాగిస్తా,
ఆనందసాగరంలో ముంచేస్తా,
అక్షరరాగాలు ఆలపిస్తా,
అలసిన మనసులు మురిపిస్తాe

అక్షరకిరణాలు విరజిమ్ముతా,
ఆశల రెక్కలు తొడిగిస్తా,
అక్షరాకాశంలోకి తీసుకెళ్తా,
అనంతవిశ్వాలు వీక్షింపజేస్తాe

అక్షరమే నా ఆభరణం,
అక్షరమే నా అభ్యుదయం,
అక్షరమే నా ఆరాధనం,
అక్షరసౌరభమే నా జీవనంe

గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్,

## జ్ఞానమే గెలిచింది...

చలి చీమల చేత చిక్కి.. చచ్చినట్లు..
బొద్దింకలు నీట్‌ను చుట్టుముట్టి
అ'ధర్మా'న్ని ఓడించాయి..
పుష్కర కాలపూ గడ్డకట్టుకుపోయిన
అవినీతి పర్వతాలను

తమ నెత్తుటి గాయాల
ఆజాది ఆవాజ్ లతో..
విద్యార్థి జ్ఞానం బాంబులతో
టియర్ గ్యాస్‌తో ఉక్కిరిబిక్కిరి చేసింది

జెన్ జీ జీవంతో.. లాటిల మేకులతో..
మతోన్మాద మూకల తోపుడులో
చిద్రమైన చిరిగిన దుస్తుల్లో దేహాల సాక్షిగా

వాళ్ళు చెప్పిందే నిజమైంది..
అ ధర్మమే ధర్మంగా సాగదని
సన్సద్ సాక్షిగా రాజీనామాగా మారింది
వాళ్ళ దేహాలనే కాదు, హృదయాల మీద
చేసిన, విదేశీ మూకలు, విచ్ఛిన్న కారులు,
యాంటీ నేషనల్, కలిస్తానని, చైనా, పాకిస్తాన్, టుక్ డే టుక్ డే గ్యాంగులనీ..

కషాయ మూకలు విషం చెప్పినా,
అమ్ముడు పోయిన మీడియా..
కళ్ళని కలాన్ని గలాన్ని మూసుకున్నా..
కరసేవకుల కర్రలు, కంకర రాళ్లు



జంతర్ మంతర్‌లో.. నిత్యనిర్బంధాన్ని
చప్పట్ల తో గెలిచిన యువ చేతనం..

పగిలిన తలల.. చెందిన నెత్తుటి సాక్షి

భగత్ సింగ్ ఇంక్విలాబ్,జై భీమ్ స్ఫూర్తిలో
ఆజాది.. అజాదీ! సనాతన దుర్మార్గుల
అన్యాయాల అక్రమాల అజ్ఞానంపై అజాదీ
అంటూ..డిల్లీలో జ్ఞాన బు(బొ)ద్దింకలు..
న్యాయాన్ని, ప్రజాస్వామ్యాన్ని, పోరాడే
స్ఫూర్తిని, రేపటి భవిష్యత్తుని వెలిగించాయి
ఎవడు యువతరాన్ని మోసగించినా
సహించేది లేదని ప్రజాస్వామ్యాన్ని
గెలిపించారు.. జ్ఞానమే గెలిచింది
అజ్ఞానం రాజీనామా చేసింది..
జయహో జెన్ జీ..

సహచరి. 9440970454

### ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై
# బిజెపి రాజకీయాలు మానాలి


బిజెపి పాలిత రాష్ట్రాల్లో
ఈ పథకాన్ని అమలు చేస్తున్నారా?
విద్యార్థుల సంక్షేమంపై ప్రశ్నించే
కనీస నైతిక అర్హత వారికి లేదు
మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల అంశాన్ని రాజకీయ లబ్ధి కోసం ఉపయోగించుకోవాలని చూస్తున్న బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు ముందుగా కొన్ని ప్రశ్నలకు సమాధానం చెప్పాలని రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఒక్కరోజులో ఏర్పడిన సమస్య కాదని, గత బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే భారీగా పేరుకుపోయిన వారసత్వ సమస్య అని మంత్రి పేర్కొన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పేరుతో నేడు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తున్న బిజెపి, తాము పాలిస్తున్న రాష్ట్రాల్లో ఎక్కడ ఈ పథకాన్ని అమలు చేస్తున్నారో వెల్లడించాలని సవాల్ విసిరారు. విద్యార్థుల సంక్షేమంపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని అమలు చేయాలని, రాష్ట్రాలపై ఉన్న ఆర్థిక భారాన్ని కేంద్రం కూడా పంచుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దేశ యువతకు రాజకీయాల్లో మరింత అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో ఎమ్మెల్యే, ఎంపి ఎన్నికల్లో పోటీ చేసే కనీస వయో పరిమితిని 21 సంవత్సరాలకు తగ్గించాలని చేసిన ప్రతిపాదన దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిందన్నారు. దీనికి బిజెపి ప్రభుత్వం మద్దతు ఇస్తుందా? లేదా? అనే విషయాన్ని స్పష్టం చేయాలన్నారు. విద్యార్థి ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి విద్యార్థి సంఘాల ఎన్నికలు నిర్వహించాలనే స్పష్టమైన అభిప్రాయంతో కాంగ్రెస్ పార్టీ ఉందన్నారు. ఈ విషయంలో బిజెపి వైఖరి ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు.
అలాగే, పరీక్షల పేపర్ల లీకేజీలతో విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడుతోందని ఆరోపిస్తూ, అలాంటి ఘటనలను అరికట్టడంలో విఫలమైన బిజెపికి విద్యార్థుల సంక్షేమంపై ప్రశ్నించే కనీస నైతిక అర్హత లేదని మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా విమర్శించారు.

# వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో ప్రత్యేక తనిఖీలు

6 ప్రత్యేక బృందాలు ఏర్పాటు
రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి వారం తనిఖీలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీలను మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా తీర్చిదిద్ది రైతులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు వారి వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు లభించేలా చర్యలు చేపట్టడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిని సారించింది. ఇందుకు సంబంధించి వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాల మేరకు వ్యవసాయ, సహకార శాఖ ముఖ్య కార్యదర్శి కె.సురేంద్ర మోహన్ రాష్ట్రంలోని అన్ని వ్యవసాయ మార్కెట్ కమిటీల పనితీరును సమగ్రంగా పరిశీలించేందుకు ఆరు ప్రత్యేక తనిఖీ బృందాలను ఏర్పాటు చేశారు. ఈ బృందాలు వ్యవసాయ మార్కెటింగ్ సంచాలకుల పర్యవేక్షణలో రాష్ట్రవ్యాప్తంగా మార్కెట్ కమిటీలను ఈ వారం ఆకస్మిక తనిఖీ చేయనున్నాయి. మార్కెట్ కమిటీల పరిపాలన, రైతులకు అందుతున్న సేవలు, మార్కెట్ నిర్వహణ, మౌలిక సదుపాయాలు, ప్రభుత్వ ఆదాయ పరిరక్షణ వంటి అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నట్లు అధికారులు తెలిపారు. రైతులు పంటల విక్రయంలో ఎదుర్కొంటున్న సమస్యలు, కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) కొనుగోలు ప్రక్రియలో ఉన్న లోపాలు, రైతులు నష్టపోయే ధరలకు పంటలను విక్రయించాల్సిన పరిస్థితుల కారణాలు, మార్కెట్ సెస్ ఎగవేత నివారణ చర్యలు, మార్కెట్ కమిటీలలో పరిపాలన, సేవలు, మౌలిక సదుపాయాల పరిస్థితిని ప్రత్యేకంగా పరిశీలించనున్నారు. అలాగే రైతులకు గిట్టుబాటు ధరలు లభిస్తున్నాయా, వేలంప్రక్రియ పారదర్శకంగా జరుగుతోందా, ఎంఎస్‌పి కొనుగోలు కేంద్రాల నిర్వహణ, చెల్లింపులు సకాలంలో జరుగుతున్నాయా, డిజిటల్ సేవలు, రికార్డుల నిర్వహణ, ప్రభుత్వ మార్గదర్శకాల అమలు వంటి అంశాలపై కూడా తనిఖీలు నిర్వహించనున్నారు.ప్రత్యేక బృందాలు ప్రతి వారం తమ తనిఖీ నివేదికలను ప్రభుత్వానికి సమర్పించనున్నాయి. గుర్తించిన లోపాలు, తక్షణ చర్యలు అవసరమైన అంశాలు, విధానపరమైన సంస్కరణలు, మార్కెట్ వ్యవస్థ బలోపేతానికి అవసరమైన సూచనలను నివేదికల్లో పొందుపరచనున్నట్లు తెలిపారు. ఈ నివేదికలపై వచ్చే వారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యవసాయ సహకార శాఖ ముఖ్య కార్యదర్శితో కలిసి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించనున్నారు. రైతులకు గిట్టుబాటు ధరలు, మార్కెట్లలో మెరుగైన సౌకర్యాలు, పారదర్శక లావాదేవీలు, ప్రభుత్వ ఆదాయ పరిరక్షణే ఈ ప్రత్యేక తనిఖీల ప్రధాన లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు.

### రాష్ట్రవ్యాప్తంగా నేటి నుంచి
# రైతు వేదికల్లో విత్తన మేళా

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రైతులకు నాణ్యమైన విత్తనాలను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించే లక్ష్యంతో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 27 నుంచి 29 వరకు మూడు రోజుల పాటు రాష్ట్రంలోని 32 జిల్లాల ప్రతి మండల కేంద్రంలోని రైతు వేదికల్లో విత్తన మేళాలను నిర్వహించనున్నారు. ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటితో సాగుకు అనువైన ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులను ప్రోత్సహించేందుకు ప్రతి రైతు వేదికలో నాలుగు నుంచి ఐదు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి, నాణ్యమైన విత్తనాలను అందుబాటులో ఉంచనున్నట్లు వ్యవసాయ శాఖ తెలిపింది. విత్తన మేళాలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం , ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ రీసెర్చ్ , ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయిల్ సీడ్స్ రీసెర్చ్, కృషి విజ్ఞాన కేంద్రాల శాస్త్రవేత్తలు పాల్గొని రైతులకు పంటల ఎంపిక, సాగు విధానాలు, వాతావరణ పరిస్థితులకు అనుగుణమైన వ్యవసాయ పద్ధతులపై శాస్త్రీయ సలహాలు, సూచనలు అందించనున్నారు. ఆయా విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలు సిఫారసు చేసిన నాణ్యమైన విత్తనాలు కూడా ప్రత్యేక కౌంటర్లలో విక్రయించనున్నారు.అలాగే వ్యవసాయ విస్తరణ అధికారులు, మండల వ్యవసాయ అధికారులు, సహాయ వ్యవసాయ సంచాలకులు, జిల్లా వ్యవసాయ అధికారులు, ఉద్యాన శాఖ అధికారులు రైతులకు పంటల ఎంపిక, విత్తనాల ఎంపిక, సాగు విధానాలు, నీటి యాజమాన్యంపై అవసరమైన మార్గదర్శకత్వాన్ని అందించనున్నారు.రాష్ట్రంలోని రైతులందరూ తమ సమీప రైతు వేదికలో నిర్వహించే విత్తన మేళాలో పాల్గొని, శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల సూచనల మేరకు తమ ప్రాంతానికి అనువైన పంటలను ఎంపిక చేసుకుని, నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేసి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ సంచాలకులు డాక్టర్ బి. గోపి కోరారు.

### నేడు సిపిఐ ఆధ్వర్యంలో...
# దేశ వ్యాప్తంగా నిరసనలు : రామకృష్ణ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నీట్ పరీక్ష ప్రశ్నా పత్రాల లీక్ నేపథ్యంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని రద్దు చేసి పరీక్షల నిర్వహణ అధికారాన్ని తిరిగి రాష్ట్ర ప్రభుత్వాలకే ఇవ్వాలని, 'నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ (ఎన్ఇపి) 2020'ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం దేశ వ్యాప్తంగా అంబేద్కర్ విగ్రహాల వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టాలని సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ పిలుపునిచ్చారు. ఈ నిరసన ప్రదర్శనలలో సిపిఐ శ్రేణులు, ప్రజలు, విద్యార్థులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.
పార్లమెంటులో మతపరమైన, ప్రజాస్వామ్య వ్యతిరేక బిల్లులను ఆమోదింపజేసుకునేందుకు బిజెపి ప్రభుత్వం పార్టీల ఫిరాయింపులను ప్రోత్సహిస్తూ కుట్రలు చేస్తోందని, దీనికి వ్యతిరేకంగా ప్రతిపక్షాలు అప్రమత్తంగా ఉండి పోరాటాన్ని కొనసాగించాలని కోరారు.

**కేంద్ర విద్యాశాఖ మంత్రి పదవి ఎన్‌డిఎలోని లౌకిక పార్టీలకు ఇవ్వాలి**

భారత రాజ్యాంగం, లౌకికవాదం పరిరక్షించబడాలంటే కేంద్ర విద్యాశాఖ పదవిని బిజెపి నాయకుడు ప్రహ్లాద్ జోషికి కాకుండా ఎన్‌డిఎలోని లౌకిక పార్టీలైన తెలుగు దేశం, జెడియులకు ఇవ్వాలని ప్రధాని మోదీని రామకృష్ణ డిమాండ్ చేశారు. నీట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని జంతర్ మంతర్ వద్ద 49 రోజుల పాటు సాగిన విద్యార్థుల పోరాటం, దేశవ్యాప్త ఆందోళనల ఫలితంగానే ఆయన రాజీనామా చేశారని, ఇది విద్యార్థుల ఘన విజయమని ఆయన పేర్కొన్నారు.

# నెరవేరిన దశాబ్దాల కల

కొమురవెల్లి రైల్వే స్టేషన్‌ను
ప్రారంభించిన కేంద్ర మంత్రులు
కిషన్ రెడ్డి, బండి సంజయ్

**ప్రజాపక్షం/సిద్దిపేట/కొమురవెల్లి :** ప్రముఖ శైవ క్షేత్రమైన కొమురవెల్లి శ్రీ మల్లికార్జున దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం కోసం రైల్వే స్టేషన్ ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందని కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ అన్నారు. ఆదివారం సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయ సమీపాన సుమారు 6 కోట్ల వ్యయంతో నిర్మించిన కొమురవెల్లి పుణ్యక్షేత్రం రైల్వే హాల్ట్ స్టేషన్‌ను కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి, కేంద్ర హోం వ్యవహారాల శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డిలతో కలిసి ప్రారంభించారు. కొమురవెల్లి పుణ్యక్షేత్రం స్టేషన్ నుండి సిద్దిపేట సికింద్రాబాద్ డెమో రైలు నంబర్ 77654 ను జెండా ఊపి ప్రారంభించారు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి.అంతకు ముందు కొమురవెల్లి శ్రీ మల్లికార్జున స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి,బండి సంజయ్, ఈ సందర్భంగా ఆలయ పూజారులు వేద ఆశీర్వచనాలు అందజేశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ కొమురవెల్లి మల్లికార్జున స్వామి సన్నిధిలో రైల్వే స్టేషన్ నిర్మాణం కేవలం రెండు సంవత్సరాల కాలంలో పూర్తి చేసి ప్రారంభించడం సంతోషంగా ఉందని అన్నారు.తెలంగాణ వ్యాప్తంగా ఉన్న మల్లికార్జున స్వామి భక్తుల సౌకర్యం కోసం రైల్వే స్టేషన్ నిర్మాణం చేసినట్లు తెలిపారు. రైల్వే స్టేషన్‌లో మరో 40 కోట్ల రూపాయలతో రెండు ప్లాట్‌ఫామ్ లు ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు చేపట్టినట్లు తెలిపారు. రైల్వే స్టేషన్ నుండి కొమురవెల్లి ఆలయం వరకు భక్తులు వెళ్లడానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. హైద్రాబాద్ నుంచి యాదగిరిగుట్ట వరకు ఎంఎంటిఎస్ రైల్వే నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం భూ సేకరణ పూర్తి చేస్తే వెంటనే పూర్తి కావడానికి అవకాశం ఉంటుందని, నిధులు కూడా కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. మల్లన్న స్వామి భక్తులు హైద్రాబాద్ నుంచి కొమురవెల్లి వరకు కేవలం 25 రూపాయలతో రావచ్చని అన్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ శంషాబాద్ ఎయిర్ పోర్ట్ మాదిరిగా నిర్మించామని తెలిపారు. తెలంగాణాలో ఆరు అమృత్ భారత్



ట్రైన్‌లు నడుస్తున్నాయని అన్నారు. మూడు బుల్లెట్ ట్రైన్‌లు ప్రధాని నరేంద్ర మోడీ కేటాయించారని అన్నారు. అయిదు లక్షల కోట్ల రూపాయల అభివృద్ధి బుల్లెట్ ట్రైన్ ద్వారా జరగబోతోందని తెలిపారు. అంతకు ముందు కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ, లక్షలాది మంది భక్తులు కొమురవెల్లి రైల్వే స్టేషన్ రావాలని ఎన్నో రోజుల నుంచి కలలు కన్నారని,ఆ కళ ఈ రోజు నెరవేరిందని అన్నారు. కొమురవెల్లి రైల్వే స్టేషన్ కు ఆరు కోట్ల రూపాయలు కేటాయించి అత్యాధునిక పద్దతిలో నిర్మించారని తెలిపారు.
ఎన్నికల వరకు మాత్రమే రాజకీయాలు ఉంటాయని, ఎన్నికల తర్వాత అభివృద్ధిపై లక్షలాది కోట్ల రూపాయలు నిధులు ప్రధాని నరేంద్ర మోదీ కేటాయించారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిలు రఘునందన్ రావు, కె.లక్ష్మణ్, చామల కిరణ్ కుమార్‌రెడ్డి, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ఎమ్మెల్యే పల్లారాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

### విద్యార్థుల విజయాన్ని సిఎం రేవంత్
# ఖాతాలో వేసుకునే యత్నం


కల్వకుంట్ల కవిత ధ్వజం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నీట్ పరీక్ష పేపర్ లీక్ అంశంలో విద్యార్థుల విజయాన్ని సిఎం రేవంత్ రెడ్డి తన ఖాతాలో వేసుకోవడం సిగ్గుచేటని తెలంగాణ రక్షణ సేన (టిఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. ఎన్నికల సమయంలో యువతకు ఇచ్చిన హామీలను సిఎం రేవంత్ రెడ్డి అమలు చేయాలని,లేదంటే, కాంగ్రెస్‌ను గద్దె దించడం ఖాయమని ఆమె ఆదివారం ఒక ప్రక టనలో పేర్కొన్నారు. విద్యార్థులు 36 రోజుల పాటు ఉద్యమిస్తే కేంద్ర ప్రభుత్వం దిగొచ్చిందని, తప్పనిసరి పరిస్థితుల్లోనే కేంద్రమంత్రి తన మంత్రి పదవికి రాజీనామా చేయాల్సిన స్థితిని తీసుకొచ్చారని కవిత గుర్తు చేశారు. విద్యార్థుల ఘనతను తాము సాధించినట్లుగా నాలుగు గంటల పాటు నగర వీధుల్లో ముఖ్యమంత్రి సహా కాంగ్రెస్ నాయకులు ఊరేగింపు చేశారని ఎద్దేవా చేశారు.
కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను విద్యార్థులు ఎక్కడ నిలదీస్తారోనని ముందస్తుగానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఊరేగింపులు తీశారని ఆరోపించారు. విద్యార్థులను, యువతను పట్టించుకోని వారు 21 ఏళ్లకే యువత పార్లమెంట్ లో ఉండాలని, ఆ దిశగా బిల్లు తీసుకొస్తామని చెబుతున్నారని పేర్కొన్నారు. ఉస్మానియా యూనివర్సిటీకి వెళ్లి అట్టహాసంగా వెయ్యి కోట్ల నిధులను ఇస్తామని చెప్పి ఇప్పటి వరకు ఒక్క రూపాయి ఇవ్వలేదన్నారు.

### 'విరించి' హెల్త్‌కేర్‌లో
# రూ.2.46 కోట్ల భారీ స్కామ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్‌లోని ప్రముఖ కార్పొరేట్ ఆస్పత్రి విరించి హెల్త్‌కేర్ ప్రైవేట్ లిమిటెడ్లో రూ.2.46 కోట్లకు పైగా ఆర్థిక మోసం జరిగిన ఘటన వెలుగులోకి వచ్చింది. సంస్థలో ఉద్యోగిగా పనిచేసిన తండ్యాల రాజేష్ గాంధీ ఆస్పత్రి నిధులను అక్రమంగా తన ఖాతాలతో పాటు తన తండ్రి, సోదరుడు, బంధువులు, సన్నిహితుల బ్యాంకు ఖాతాలకు మళ్లించినట్లు ఫోరెన్సిక్ ఆడిట్‌లో గుర్తించారు. ఈ మేరకు హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సిసిఎస్)లో కేసు నమోదైంది. విరించి హెల్త్‌కేర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వేదుల సత్యనారాయణ ఫిర్యాదు మేరకు పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఫిర్యాదు ప్రకారం తండ్యాల రాజేష్ గాంధీ 2016 నుంచి ఆస్పత్రిలో ఉద్యోగిగా పనిచేస్తూ ఏజెంట్లకు చెల్లించాల్సిన రెమ్యునరేషన్, ఇన్సెంటివ్‌లు, ప్రొఫెషనల్ ఫీజుల చెల్లింపుల బాధ్యతను నిర్వహించేవాడు. చెల్లింపుల కోసం రూపొందించే బల్క్ ట్రాన్స్‌ఫర్ ఫైళ్లలో అసలు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల స్థానంలో తన ఖాతా, తన తండ్రి తండ్యాల జగన్నాథరావు, సోదరుడు తండ్యాల మోతీలాల్, ఇతర బంధువులు, సన్నిహితుల ఖాతా వివరాలను నమోదు చేసి కంపెనీ నిధులను అక్రమంగా మళ్లించినట్లు ఆరోపణలు ఉన్నాయి.




బ్యాంకులు బల్క్ ట్రాన్స్‌ఫర్‌లలో ఖాతాదారుడి పేరును ఖాతా నంబర్‌తో సరిపోల్చి పరిశీలించకపోవడాన్ని ఆసరాగా చేసుకుని ఈ మోసానికి పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అనుమానం రాకుండా ఒకే ఖాతాను పదేపదే ఉపయోగించకుండా వివిధ పేర్లు, వివిధ ఖాతాలను వినియోగిస్తూ అసలు చెల్లింపుల మధ్యే నకిలీ ఎంట్రీలను కలిపినట్లు ఫోరెన్సిక్ ఆడిట్‌లో తేలిందని తెలిపారు. మొదట చిన్న మొత్తాలను మళ్లించి వ్యవస్థలో లోపాలను పరీక్షించిన నిందితుడు, అనంతరం మోసం బయటపడడం లేదని నిర్ధారించుకున్న తర్వాత ఏటా భారీ మొత్తాలను అక్రమంగా బదిలీ చేసినట్లు విచారణలో వెల్లడైంది. ఆర్థిక సంవత్సరాల వారీగా 2016–17లో రూ.2,68,661, 2017–18లో రూ.7,89,300, 2018–19లో రూ.39,70,043, 2019–20లో రూ.88,96,997, 2020–21లో రూ.28,75,142, 2021–22లో రూ.78,59,046 చొప్పున మొత్తం రూ.2,46,59,189 కంపెనీ నిధులను దుర్వినియోగం చేసినట్లు సంస్థ పేర్కొంది. అంతర్గత విచారణ, ఫోరెన్సిక్ ఆడిట్ అనంతరం మోసం వెలుగులోకి రావడంతో నిందితుడు ఉద్యోగానికి హాజరుకాకుండా పరారైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. నిందితులు వినియోగించిన బ్యాంకు ఖాతాలను వెంటనే ఫ్రీజ్ చేయాలని, అక్రమంగా మళ్లించిన నిధులను స్వాధీనం చేసుకోవాలని, కుట్రలో భాగమైన ఇతర వ్యక్తులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సంస్థ పోలీసులను కోరింది. ఈ ఫిర్యాదు ఆధారంగా ఇఒడబ్ల్యూ ఇన్‌స్పెక్టర్ డొంగరి శ్రీనివాసరావు దర్యాప్తు చేస్తున్నారు.

### స్థానిక సంస్థల్లో దివ్యాంగులకు
# ప్రాతినిధ్యం కల్పిస్తాం

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలోని స్థానిక సంస్థల్లో దివ్యాంగులకు కోఆప్షన్ సభ్యులుగా ప్రాతినిధ్యం కల్పించే దిశగా తెలంగాణ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎస్‌సి, ఎస్‌టి. దివ్యాంగులు, వృద్ధులు, ట్రాన్స్‌జెండర్ల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. ఈ ప్రతిపాదనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారని వెల్లడించారు.
ఆదివారం జూబ్లీహిల్స్‌లో నిర్వహించిన నియోప్లై బోల్ట్ మొబిలిటీ పరికరాల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొని, వెన్నెముక గాయాలు , ఇతర తీవ్ర వైకల్యం ఉన్న 90 మంది దివ్యాంగులకు సుమారు రూ.1.26 కోట్ల వ్యయంతో అత్యాధునిక మొబిలిటీ పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఇటీవల ట్రాన్స్‌జెండర్లకు స్థానిక సంస్థల్లో ప్రాతినిధ్యం కల్పించినట్లే, దివ్యాంగులకు కూడా కోఆప్షన్ సభ్యులుగా అవకాశం కల్పించాలని ప్రభుత్వం పరిశీలిస్తోందన్నారు. మైనారిటీలకు ఉన్న తరహాలోనే దివ్యాంగులకు కూడా స్థానిక సంస్థల్లో ప్రాతినిధ్యం కల్పించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. దివ్యాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, పెన్షన్లు, ఉచిత బస్సు ప్రయాణం, సంక్షేమ పథకాల విస్తరణతో పాటు సేవలను మరింత మెరుగుపరిచేందుకు చర్యలు చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు.



# అవినీతిలో 'రెవెన్యూ' టాప్!

వరుస దాడులతో ఉక్కుపాదం
మోపుతున్న ఎసిబి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రభుత్వ కార్యాలయంలో సాధారణ సేవ కోసం వెళ్లినా 'ఫైలు కదలాలంటే...', 'సంతకం కావాలంటే...', 'పని త్వరగా పూర్తవ్వాలంటే...' అంటూ లంచం అడిగే ఘటనలు ఇంకా పూర్తిగా తగ్గలేదు. రాష్ట్ర ప్రభుత్వం అవినీతిని అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకుంటున్నప్పటికీ, తెలంగాణ అవినీతి నిరోధక శాఖ (ఎసిబి)కి వస్తున్న ఫిర్యాదులు మాత్రం ప్రభుత్వ యంత్రాంగంలో అవినీతి ఇంకా సవాలుగానే ఉందని సూచిస్తున్నాయి. ఎసిబి ప్రతి ఏడాది నమోదు చేస్తున్న ట్రాప్ కేసులు, ఆదాయానికి మించిన ఆస్తుల కేసులు, ఆకస్మిక తనిఖీలు పరిశీలిస్తే కొన్ని శాఖల పేర్లు పదేపదే కనిపిస్తున్నాయి. ముఖ్యంగా ప్రజలతో నిత్యం ప్రత్యక్ష సంబంధం ఉండే శాఖల్లోనే ఎక్కువ అవినీతి ఆరోపణలు నమోదవుతున్నాయని విశ్లేషణ చెబుతోంది. ఈ కోవలోనే రెవెన్యూ శాఖ మొదటి స్థానాన్ని ఆక్రమించింది. భూమి రికార్డులు, మ్యూటేషన్లు, పట్టాదార్ పాస్‌బుక్‌లు, సర్వేలు వంటి సేవలు అందించే రెవెన్యూ శాఖపై అత్యధిక ఫిర్యాదులు వస్తున్నాయి. ఒక సంతకం, ఒక ధృవీకరణ, ఒక రికార్డు సవరణ కోసం కూడా కొందరు అధికారులు, సిబ్బంది అక్రమంగా డబ్బు డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలు తరచూ వెలుగులోకి వస్తున్నాయి. అందువల్ల ఈ శాఖకు చెందిన అధికారులు ఎసిబి ట్రాప్‌లలో ఎక్కువగా చిక్కుతున్నారని గణాంకాల ధోరణి సూచిస్తోంది. ఇక పోలీస్ శాఖలో కూడా పాస్‌పోర్ట్ వెరిఫికేషన్, విచారణలు, పరిపాలనా ప్రక్రియలు, ఇతర సేవలకు సంబంధించి లంచం ఆరోపణలపై కేసులు నమోదవుతున్నాయి. ప్రజలతో నేరుగా సంబంధం ఉండే సేవల్లో పారదర్శకత పెంచాల్సిన అవసరం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మున్సిపల్ శాఖలు, జిహెచ్‌ఎంసి, టౌన్ ప్లానింగ్ విభాగాలు కూడా ఎసిబి దృష్టిలో కీలకంగా నిలుస్తున్నాయి. భవన నిర్మాణ అనుమతులు, లేఅవుట్ ఆమోదాలు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు, అక్రమ నిర్మాణాల వ్యవహారాల్లో లంచాల ఆరోపణలు తరచూ నమోదవుతున్నాయి.
రిజిస్ట్రేషన్, స్టాంప్స్ శాఖలో ఆస్తుల రిజిస్ట్రేషన్, మార్కెట్ విలువ నిర్ణయం, పత్రాల నమోదు వంటి ప్రక్రియల్లో అక్రమ డిమాండ్లపై ఫిర్యాదులు వస్తుండగా, రవాణా శాఖ (ఆర్టిఎ)లో డ్రైవింగ్ లైసెన్సులు, వాహన రిజిస్ట్రేషన్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు వంటి సేవలకు సంబంధించిన ఆరోపణలు కూడా ఎసిబి దృష్టికి చేరుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీరాజ్ శాఖకు సంబంధించిన అభివృద్ధి పనుల బిల్లులు, టెండర్లు, గ్రామపంచాయతీ అనుమతులు, సంక్షేమ పథకాల అమలులో కూడా అవినీతి ఆరోపణలు వెలుగులోకి వస్తున్నాయి. అదే విధంగా విద్యుత్, ఇరిగేషన్, రోడ్లు–భవనాలు, పట్టణాభివృద్ధి వంటి ఇంజినీరింగ్ శాఖల్లో టెండర్లు, బిల్లుల చెల్లింపులు, పనుల ఆమోదాలకు సంబంధించిన కేసులు కూడా నమోదు అవుతున్నాయి.
**ట్రాప్ కేసులే ఎక్కువ...** ఎసిబి నమోదు చేసే కేసుల్లో అత్యధికం ట్రాప్ కేసులే. ప్రభుత్వ ఉద్యోగి లేదా అధికారి లంచం డిమాండ్ చేశాడని బాధితుడు ఫిర్యాదు చేయడం, ఏసీబీ ప్రణాళికాబద్ధంగా ఉచ్చు వేసి నగదు స్వీకరిస్తున్న సమయంలో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకోవడం ఈ కేసుల ప్రత్యేకత. ఈ తరహా కేసులే ఎసిబి పనితీరులో ప్రధాన భాగంగా ఉంటున్నాయి.

**ఆదాయానికి మించిన ఆస్తులపై ప్రత్యేక దృష్టి**

ఇటీవలి కాలంలో ఎసిబి దృష్టి కేవలం ట్రాప్ కేసులకే పరిమితం కాకుండా, ఆదాయానికి మించిన ఆస్తుల కేసులపైనా కేంద్రీకృతమైంది.
కోట్ల రూపాయల విలువైన స్థిరాస్తులు, బంగారం, నగదు, విలాసవంతమైన వాహనాలు, పెట్టుబడులు బయటపడుతున్న కేసులు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమవుతున్నాయి. కొంతమంది అధికారులు తమ చట్టబద్ధ ఆదాయానికి మించి భారీ ఆస్తులు కూడబెట్టినట్లు దర్యాప్తులో బయటపడుతున్న సందర్భాలు ఉన్నాయి.

**సాంకేతిక నిఘాతో దూకుడు..**

ఎసిబి ప్రస్తుతం సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ ఫోన్ కాల్ రికార్డులు, బ్యాంకు లావాదేవీలు, డిజిటల్ చెల్లింపులు, ఆస్తుల రిజిస్ట్రేషన్ వివరాలు, షెల్ కంపెనీల అనుసంధానాలు వంటి అంశాలపై దృష్టి సారిస్తోంది. అవసరమైన చోట ఇతర దర్యాప్తు సంస్థలతో సమన్వయం చేస్తూ అవినీతి మూలాలను గుర్తించే ప్రయత్నం చేస్తోంది.

**ప్రజల పాత్ర కీలకం : ఎసిబి డిజి చారుసిన్హా**

లంచం ఇవ్వకుండా, లంచం అడిగితే వెంటనే ఎసిబికి సమాచారం ఇవ్వడం ద్వారా మాత్రమే అవినీతిని తగ్గించవచ్చని ఎసిబి డిజి చారుసిన్హా చెబుతున్నారు. చాలా ట్రాప్ కేసులు ప్రజల ధైర్యమైన ఫిర్యాదుల వల్లే విజయవంతమయ్యాయని పేర్కొంటున్నారు.
ప్రజల్లో అవగాహన పెరగడం, ప్రభుత్వ సేవలను మరింత డిజిటలైజ్ చేయడం, కార్యాలయాల్లో పారదర్శకత పెరగడం ద్వారా అవినీతికి గణనీయంగా అడ్డుకట్ట వేయవచ్చని చారుసిన్హా సూచిస్తున్నారు. అవినీతిని అరికట్టే బాధ్యత కేవలం ఎసిబిదే కాదు, లంచం ఇవ్వకుండా ఉండే పౌరస్ఫూర్తి, పారదర్శక పరిపాలన, వేగవంతమైన దర్యాప్తు, న్యాయపరమైన చర్యలు ఈ నాలుగు కలిసి పనిచేసినప్పుడే అవినీతి రహిత పాలన సాధ్యమవుతుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



**అవినీతిలో టాప్–10 విభాగాలు..**

**రెవెన్యూ శాఖ** – భూ రికార్డులు, మ్యూటేషన్, పట్టాదార్ పాస్‌బుక్‌లు, సర్వేలు
**పోలీస్ శాఖ** – ధ్రువీకరణలు, విచారణలు, పరిపాలనా సేవలు
**మున్సిపల్ పరిపాలన** (జిహెచ్‌ఎంసి/మున్సిపాలిటీలు) – బిల్డింగ్ పర్మిషన్లు, టౌన్ ప్లానింగ్
రిజిస్ట్రేషన్ స్టాంప్స్ శాఖ – ఆస్తుల రిజిస్ట్రేషన్, మార్కెట్ విలువ
**పంచాయతీరాజ్ శాఖ** – అభివృద్ధి పనులు, బిల్లులు, టెండర్లు
**రవాణా శాఖ** – లైసెన్సులు, రిజిస్ట్రేషన్, ఫిట్‌నెస్
**విద్యుత్ శాఖ** – కొత్త కనెక్షన్లు, సాంకేతిక అనుమతులు
ఇరిగేషన్ / ఆర్ అండ్ బి/ ఇంజినీరింగ్ శాఖలు – కాంట్రాక్టులు, పనుల బిల్లులు
**వైద్య ఆరోగ్య శాఖ** – కొనుగోళ్లు, పరిపాలనా అనుమతులు. పట్టణాభివృద్ధి సంస్థలు (హెచ్ఎండిఎ తదితరాలు) – లేఅవుట్లు, ప్రాజెక్టు అనుమతులు

2023లో 95 కేసులు, 2024లో 152, 2025లో అత్యధికంగా 199 కేసులు నమోదయ్యాయి. ఇందులో ట్రాప్ కేసులు – 157, ఆదాయానికి మించిన ఆస్తుల (డిఎ) కేసులు – 15 క్రిమినల్ మిస్‌కండక్ట్ కేసులు – 26 ఉన్నాయి.
273 మంది అరెస్టు అయ్యారు.

ప్రజాపక్షం
Telugu National Daily

హైదరాబాద్
సోమవారం
27-07-2026
www.prajapaksham.in


మహానగరి
GREATER HYDERABAD

# పెట్టుబడుల మోసాల హబ్‌గా 'హైదరాబాద్'

## సిసిఎస్‌కు పోటెత్తుతున్న కేసులు... కోట్ల రూపాయలతో పరారవుతున్న కేటుగాళ్లు!

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ''నెలకు 15 శాతం లాభం... ఏడాదిలో పెట్టిన డబ్బు రెట్టింపు... రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడి పెడితే భారీ రిటర్న్స్... స్టాక్ మార్కెట్‌లో నష్టమే ఉండదు... క్రిప్టోలో ఇప్పుడు పెట్టుబడి పెడితే కోటీశ్వరులవుతారు...'' అంటూ మాయమాటలు చెప్పి ప్రజల నుంచి కోట్ల రూపాయలు వసూలు చేసి పరారవుతున్న మోసగాళ్లపై హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సిసిఎస్)కు ఫిర్యాదులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఆర్థిక నేరాల దర్యాప్తులో కీలక కేంద్రంగా మారిన సిసిఎస్‌కు వస్తున్న కేసుల్లో పెట్టుబడుల మోసాలే అధికంగా ఉండటం ఆందోళన కలిగిస్తోంది. ఒకప్పుడు చిట్ ఫండ్‌లు, ఫైనాన్స్ సంస్థల మోసాలకే పరిమితమైన నేరాలు ఇప్పుడు సాంకేతికతను ఆసరాగా చేసుకుని కొత్త రూపు దాల్చాయి. సోషల్ మీడియా ప్రకటనలు, వాట్సాప్ గ్రూపులు, టెలిగ్రామ్ ఛానెల్లు, నకిలీ ట్రేడింగ్ యాప్‌లు, క్రిప్టో పెట్టుబడులు, రియల్ ఎస్టేట్ వెంచర్లు, మల్టీ లెవల్ మార్కెటింగ్ సంస్థల పేర్లతో ప్రజలను ఆకర్షించి భారీ మొత్తాలను కాజేస్తున్న ముఠాలు పెరుగుతున్నాయని దర్యాప్తు సంస్థలు గుర్తిస్తున్నాయి.

అధిక లాభాల ఆశతో జీవితకాల పొదుపులు, పదవీ విరమణ ప్రయోజనాలు, పిల్లల చదువు, వివాహాల కోసం దాచుకున్న డబ్బును పెట్టుబడిగా పెట్టి చివరికి మోసపోయిన బాధితులు సిసిఎస్‌ను ఆశ్రయిస్తున్నారు. ఉద్యోగులు, వ్యాపారులు, గృహిణులు, పదవీ విరమణ పొందిన ఉద్యోగులు, విదేశాల్లో పనిచేస్తున్న వారి కుటుంబాలు ఇలా అన్ని వర్గాల వారూ బాధితుల జాబితాలో ఉండటం పరిస్థితి తీవ్రతను చాటుతోంది. దర్యాప్తులో నిందితులు నకిలీ కంపెనీలు ఏర్పాటు చేయడం, ప్రముఖులతో దిగిన ఫోటోలను ప్రచారానికి ఉపయోగించడం, అద్దె కార్యాలయాలను ఏర్పాటు చేసి నమ్మకం




కల్పించడం, ప్రారంభంలో కొంతలాభం చెల్లించి మరింత పెట్టుబడి పెట్టించేలా ప్రలోభపెట్టడం వంటి పద్ధతులను అనుసరిస్తున్నట్లు వెలుగులోకి వస్తోంది. అనంతరం కార్యాలయాలు మూసివేసి, ఫోన్లు స్విచ్ ఆఫ్ చేసి పరారవుతున్న ఘటనలు తరచుగా నమోదవుతున్నాయి.

### కూపిలాగుతున్న దర్యాప్తు అధికారులు

సిసిఎస్ అధికారులు ఇటువంటి కేసుల్లో బ్యాంకు లావాదేవీల విశ్లేషణ, డిజిటల్ ఆధారాల సేకరణ, షెల్ కంపెనీల గుర్తింపు, నిందితుల ఆస్తుల వివరాల పరిశీలన, అవసరమైతే ఇతర రాష్ట్రాల పోలీసులతో సమన్వయం చేస్తూ దర్యాప్తు కొనసాగిస్తున్నారు. అయితే మోసపూరితంగా వసూలు చేసిన సొమ్మును వివిధ బ్యాంకు ఖాతాల ద్వారా మళ్లించడం, క్రిప్టో కరెన్సీల్లోకి మార్చడం, బినామీ ఖాతాలను వినియోగించడం వంటి అంశాలు దర్యాప్తుకు సవాళ్లుగా మారుతున్నాయని తెలుస్తోంది. నిపుణుల అభిప్రాయం ప్రకారం, అసాధారణంగా అధిక లాభాలు వస్తాయని హామీ ఇచ్చే ఏ పథకంపైనా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. పెట్టుబడి పెట్టే ముందు సంస్థ చట్టబద్ధత, నమోదు వివరాలు, సంబంధిత నియంత్రణ సంస్థల అనుమతులు, గత చరిత్రను తప్పనిసరిగా పరిశీలించాలి. కేవలం సోషల్ మీడియా ప్రచారాన్ని లేదా పరిచయస్తుల మాటలను నమ్మి పెద్ద మొత్తాలు పెట్టుబడి పెట్టడం ప్రమాదకరమని సూచిస్తున్నారు.

### ప్రజల్లో అవగాహన ఉండాలి
### సిసిఎస్ అధికారులు

ఆర్థిక నేరాల స్వరూపం మారుతున్న నేపథ్యంలో ప్రజల్లో ఆర్థిక అవగాహన పెరగడం అత్యవసరమని సిసిఎస్ అధికారులు అభిప్రాయపడుతున్నారు. అధిక లాభాల ఆశకు బదులుగా జాగ్రత్త, పరిశీలన, చట్టబద్ధ సంస్థల ఎంపిక వంటి అంశాలకే ప్రాధాన్యం ఇస్తే ఇటువంటి మోసాలను గణనీయంగా తగ్గించవచ్చని వారు చెబుతున్నారు. పెట్టుబడుల పేరుతో మోసపోయిన బాధితులు ఆలస్యం చేయకుండా వెంటనే పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేస్తే నిందితులను గుర్తించడం, నష్టపోయిన సొమ్ములో కొంతైనా తిరిగి రాబట్టే అవకాశాలు మెరుగుపడతాయని అధికారులు సూచించారు. ఎక్కువగా రియల్ ఎస్టేట్, వెంచర్లు, ప్లాట్లు, ఫామ్ ల్యాండ్లు, స్టాక్ మార్కెట్, ట్రేడింగ్, ఆప్షన్ ట్రేడింగ్, క్రిప్టో కరెన్సీ, బిట్‌కాయిన్, డిజిటల్ కాయిన్లు, మల్టీ లెవల్ మార్కెటింగ్ (ఎంఎల్ఎం), సభ్యత్వాలు, చెయిన్ మార్కెటింగ్, చిట్ ఫండ్స్, అనుమతి లేని ఫైనాన్స్ సంస్థల్లో మోసాలు జరుగుతున్నాయని వెల్లడించారు.

### టాప్-10 పెట్టుబడి మోసం పద్ధతులు

1. అధిక వడ్డీ ఇస్తామంటూ నకిలీ ఫైనాన్స్ సంస్థలు.
2. రియల్ ఎస్టేట్ వెంచర్ల పేరుతో ప్లాట్ల మోసాలు.
3. స్టాక్ మార్కెట్ ట్రేడింగ్‌లో భారీ లాభాల హామీలు.
4. క్రిప్టో కరెన్సీ పెట్టుబడుల పేరుతో మోసాలు.
5. మల్టీ లెవల్ మార్కెటింగ్ (ఎంఎల్ఎం) చైన్ స్కీములు.
6. సోషల్ మీడియా ప్రకటనల ద్వారా పెట్టుబడుల ఎర.
7. నకిలీ మొబైల్ యాప్‌ల ద్వారా డబ్బు వసూళ్లు.
8. విదేశీ పెట్టుబడుల పేరుతో మోసాలు.
9.బంగారం, డిజిటల్ గోల్డ్ పెట్టుబడుల పేరుతో మోసాలు.
10. ప్రముఖుల పేర్లు, నకిలీ ప్రశంసాపత్రాలు, నకిలీ రిజిస్ట్రేషన్ పత్రాలతో నమ్మకం కల్పించడం.

---

# యువజన సమస్యలు విస్మరిస్తున్న పాలకులు

### ఎఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి నెర్లకంటి శ్రీకాంత్




**ప్రజాపక్షం/తుర్కయంజాల్ :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువజన సమస్యలు విస్మరిస్తున్నారని ఎఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి, జిల్లా ఇన్చార్జి నెర్ల కంటి శ్రీకాంత్ పేర్కొన్నారు. అబ్దుల్లాపూర్ మెట్టు మండల ఎఐవైఎఫ్ నూతన కమిటీ ఎన్నిక రావి నారాయణరెడ్డి కాలనీ సిపిఐ కార్యాలయంలో ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు, నిరుద్యోగ ఇతర విద్య, వైద్యం సంబంధించిన ఎప్పటికప్పుడు ఉద్యమాలు నిర్మించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గసభ్యులు ఆందోజు రవీంద్రచారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి, పబ్బతి లక్ష్మణ్, పార్టీ మండల కార్యదర్శి అజ్మీర్ హరిసింగ్ నాయక్, కేతరాజు నర్సింహా హాజరయ్యారు.
**నూతన కమిటీ ఎన్నిక :** ఎఐవైఎఫ్ మండల కమిటీ కార్యదర్శిగా నిమ్మల గణేష్, అధ్యక్షుడిగా వంగూరి శోభన్, కార్యవర్గ సభ్యులుగా పోల్మూరి రాజు ప్రవీణ్, సిర్పంగి శ్రీను, చంటి, భాను ప్రకాష్, అశోక్, ఆరావత్ శ్రీను, వినయ్, అంగోత్ సుధాకర్‌ను ఎన్నుకున్నారు.

## సిఎం సహాయనిధి చెక్కు పంపిణీ



**ప్రజాపక్షం/కేశంపేట :** ఆదివారం కేశంపేట మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామానికి చెందిన జటావత్ బన్నీ అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నేపథ్యంలో వారి కుటుంబ ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి రూ.60వేల చెక్కును సర్పంచ్ ఆనంద్‌కుమార్ బాధిత కుటుంబానికి అంధించారు. కార్యక్రమంలో నాయకులు కుమ్మరి శేఖర్, ఉడిత్యాల వెంకటేష్ పాల్గొన్నారు.

## అక్రమ ప్రాజెక్టులను నిలిపివేయాలి

### ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి





**ప్రజాపక్షం/షాద్‌నగర్:** నిబంధనలకు విరుద్ధంగా కర్ణాటక ప్రభుత్వం నిర్మిస్తున్న అక్రమ ప్రాజెక్టులను అడ్డుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం కృష్ణానది, భీమా నదులపై కర్ణాటక ప్రభుత్వం అక్రమంగా చేపట్టిన నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ నది జలాల్లో తెలంగాణ రాష్ట్రానికి దక్కాల్సిన వాటా ఏమాత్రం దక్కడం లేదని, ఉమ్మడి పాలమూరు జిల్లాకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. పాజెక్టుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే ఉమ్మడి పాలమూరు జిల్లా మరోసారి ఏడారిగా మారే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీమంత్రులు శ్రీనివాస్‌గౌడ్, డాక్టర్ సి.లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డితోపాటు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారుల సమస్యలు పరిష్కరించాలి



**ప్రజాపక్షం/కొందుర్గు:** తెలంగాణ ఉద్యమకారుల సమస్యలను పరిష్కరించాలని ఉద్యమకారుల సంక్షేమ సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పి.వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం కొందుర్గు, జిల్లేడు చౌదరిగూడ మండలాల చెందిన ఉద్యమకారుల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు పి.వెంకట్‌రాంరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులకు గుర్తింపు కార్డులు మంజూరుతోపాటు ఇళ్ల స్థలాలు కేటాయించి న్యాయం చేయాలని కోరారు.
**జిల్లేడు చౌదరిగూడ నూతన కార్యవర్గం...**తెలంగాణ ఉద్యమకారుల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పద్మారం వెంకటేష్ యాదవ్, ఉపాధ్యక్షులుగా వీరన్నపేట సలీం, ఇంద్రానగర్ శేఖర్, పద్మారం రాములు, ప్రధాన కార్యదర్శిగా రమేష్ నాయక్, కార్యదర్శులుగా బాల్‌రాజ్, నర్సింలు, జహంగీర్, నవీన్, నరేష్ గౌడ్, గోర్ల బాలయ్య, హరిశ్వర్‌రెడ్డి, వనంపల్లి రవి, శివకుమార్, సలహాదారులుగా కోనేరు శ్రీనివాస్, దామోదర్, ఉమ్మడి మండలాల అధ్యక్షుడిగా మంగులాల్ నాయక్, ఉపాధ్యక్షులుగా పెద్ద ఎల్కిచర్ల బాల్‌రాజ్, మల్లేష్ గౌడ్, కమ్మరి భూపాలచారి, శ్రీధర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బాబురావును ఎన్నుకున్నారు.

## ప్రత్యేక ఓటరు జాబితా సవరణ



**ప్రజాపక్షం/మియాపూర్:** మియాపూర్ డివిజన్ పరిధిలోని జెపిఎన్ నగర్‌లో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఓటరు జాబితా సవరణ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్న ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పారదర్శకంగా, వేగవంతంగా ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఓటరు జాబితా సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎన్నికల శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

---

# జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో.. 29న బోనాల సంబురాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మున్సిపల్ సహకార్ మజ్దూర్ యూనియన్ (ఎంఎస్ఎంయు), ఐఎన్‌టియుసి ఆధ్వర్యంలో ఈనెల 29న ట్యాంక్ బండ్‌లోని జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో సంప్రదాయ బోనాల పండుగను ఘనంగా నిర్వహించనున్నారు. ఈ వేడుకల్లో సుమారు 1,500 మంది జిహెచ్ఎంసి ఉద్యోగులు పాల్గొననున్నారు. ఐఎన్‌టియుసి వర్కింగ్ ప్రెసిడెంట్, తెలంగాణ రాష్ట్ర ఐఎన్‌టియుసి ప్రధాన కార్యదర్శి ఆదిల్ షరీఫ్, ఐఎన్‌టియుసి ప్రధాన కార్యదర్శి ఆర్.డి. చంద్రశేఖర్, ఐఎన్‌టియుసి చీఫ్ వైస్ ప్రెసిడెంట్ మొగుళ్ల రాజిరెడ్డి ముఖ్య అతిథులుగా ఈ కింది ప్రముఖులను ఆహ్వానించారు. ఎమ్మెల్సీ, టిపిసిసి అధ్యక్షులు బొమ్మ మహేశ్ కుమార్‌గౌడ్, మాజీ పార్లమెంటు సభ్యులు, మాజీ మంత్రి, ఆల్ ఇండియా ఐఎన్‌టియుసి అధ్యక్షులు డాక్టర్ జి. సంజీవరెడ్డి, కార్మిక శాఖ మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్పర్సన్ గద్వాల విజయలక్ష్మి, రాష్ట్ర కనీస వేతనాల సలహా బోర్డు చైర్మన్ బి. ఝనక్ ప్రసాద్, వీరితోపాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, మాజీ కార్పొరేటర్లు, కార్మిక నాయకులు ఈ వేడుకల్లో పాల్గొననున్నారు. జిహెచ్ఎంసి, ఎంఎంసి, సిఎంసి పరిధిలోని దాదాపు 1,500 మంది ఉద్యోగులు హాజరుకానున్న నేపథ్యంలో, యూనియన్ నిర్వహించే బోనాల వేడుకల్లో ఇది అతిపెద్దదిగా నిలవనుంది. ప్రధాన కార్యదర్శి ఏవిఎస్ గాంధీ, అదనపు ప్రధాన కార్యదర్శి కె. శివకుమార్, మహిళా కమిటీ చైర్‌పర్సన్ ఎల్. మెర్సీ,



యూనియన్ ప్రతినిధులు కె. రాజు, వై. యాదగిరి, పల్లవి, పి.ఎస్. ఉమేష్ బాబు, ఖాజా పాషా ఉద్యోగులందరినీ వేడుకల్లో పాల్గొనాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆదిల్ షరీఫ్ మాట్లాడుతూ బోనాలు కేవలం ఒక పండుగ మాత్రమే కాదని, అది తెలంగాణ హృదయ స్పందన అని అన్నారు. కష్టాలు, రోగాల నుంచి ప్రజలను కాపాడినందుకు అమ్మవారికి కృతజ్ఞతలు తెలిపే సంప్రదాయం నుంచి ఇది ఆవిర్భవించిందని, నేడు ఇది విశ్వాసం, సంస్కృతి, ఐక్యతలకు ప్రతీకగా నిలిచిందని తెలిపారు. సంప్రదాయాలను కాపాడే పెద్దలను, వాటిని ముందుకు తీసుకెళ్లే యువతను ఒకే వేదికపైకి తీసుకొచ్చే వారధిగా బోనాలు నిలుస్తుందన్నారు. జిహెచ్ఎంసి, సిఎంసి, ఎంఎంసి అధికారులు, ఉద్యోగులందరూ పెద్ద ఎత్తున పాల్గొని బోనాల ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆదిల్ షరీఫ్ పిలుపునిచ్చారు.

---

# ఇందిరమ్మ ఇళ్ల పేరుతో సైబర్ మోసాలు...జాగ్రత్త

### సిపి సజ్జనార్ హెచ్చరిక

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రభుత్వం చేపట్టిన 'ఇందిరమ్మ టవర్స్' ఇళ్ల కేటాయింపు పేరిట సైబర్ మోసాలు జరిగే అవకాశముందని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని నగర పోలీసు కమిషనర్ వి.సి సజ్జనర్ హెచ్చరించారు. లబ్ధిదారుల నుంచి రూ.10,000 ముందస్తు డిపాజిట్ (ఇఎండి) చెల్లించే ప్రక్రియ ప్రారంభం కావడంతో, సైబర్ నేరగాళ్లు నకిలీ కాల్స్, అపరిచిత లింకులతో బురిడీ కొట్టించే ప్రమాదముందని ఆయన స్పష్టం చేశారు.ఈ పథకంలో ఎలాంటి దళారులు లేదా మధ్యవర్తులకు తావులేదని, ఎంపిక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా జరుగుతుందని తెలిపారు. నిబంధనల ప్రకారం చెల్లించిన ఇఎండి సొమ్ము భద్రంగా ఉంటుందని, ఒకవేళ ఇల్లు కేటాయించకపోతే ఆ మొత్తాన్ని దరఖాస్తుదారుడి ఒరిజినల్ బ్యాంకు ఖాతాకే ప్రభుత్వం నేరుగా తిరిగి జమ చేస్తుందని వివరించారు. 'డబ్బులు చెల్లిస్తే ఇల్లు కచ్చితంగా ఇప్పిస్తాం' అని నమ్మించే వారి మాటలు నమ్మవద్దని సూచించారు. 'ఈ రోజే ఆఖరు తేదీ.. వెంటనే డబ్బులు కట్టకపోతే ఇల్లు రద్దవుతుంది' అని భయపెట్టి, తొందరపాటులో



నగదు బదిలీ చేయించుకోవడం నేరగాళ్ల ప్రధాన ఎత్తుగడ అని హెచ్చరించారు. వాట్సాప్ లేదా మెసేజ్‌ల ద్వారా వచ్చే అపరిచిత లింకులను నమ్మి ఎపికె ఫైళ్లను ఇన్‌స్టాల్ చేస్తే ఫోన్ హ్యాక్ అయి బ్యాంక్ ఖాతాలు ఖాళీ అవుతాయని తెలిపారు. అలాగే ప్రభుత్వ పోర్టళ్లను పోలిన నకిలీ వెబ్‌సైట్లను సృష్టించి మోసగించే అవకాశం ఉందన్నారు. గైడ్ చేస్తామనే నెపంతో 'ఎనీడెస్క్', 'టీమ్‌వ్యూర్' వంటి స్క్రీన్ షేరింగ్ యాప్‌లను డౌన్‌లోడ్ చేయించి బ్యాంకు వివరాలు కాజేస్తారని పేర్కొన్నారు. ఈ పథకానికి సంబంధించి ఎలాంటి సందేహాలున్నా నివృత్తి చేసుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా '04024603572' అనే హెల్ప్‌లైన్ నంబర్‌ను అందుబాటులోకి తెచ్చిందని తెలిపారు.

---

# 27 నుంచి 29వరకు గ్రామసభలు

### రంగారెడ్డి జిల్లా పంచాయతీ అధికారి వి.సురేష్‌మోహన్



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఉత్తర్వుల ప్రకారం, ఆగస్టు 27 నుండి 29వ వరకు తప్పనిసరిగా గ్రామసభలు నిర్వహించగలరని రంగారెడ్డి జిల్లా పంచాయతీ అధికారి వి.సురేష్‌మోహన్ ఆదివారం ఒక ప్రకటన లో తెలిపారు. అందులో భాగంగా జలసిరిలో ప్రతి గ్రామ పంచాయతీకి నాలుగు వ్యవసాయ కుంటలు ప్రతి విలేజ్ ఆర్గనైజేషన్‌కు 2 చొప్పున, 150 నుండి 250 వ్యక్తిగత ఇంకుడు గుంతలు నిర్మించాలని తెలిపారు. సామూహిక ఇంకుడు గుంతలు, ప్రతి గ్రామ పంచాయతీకి ఊట చెరువు, ఇంకుడు చెరువు, మండలానికి కనీసం 20 ఉండేలా చూసుకోవాలని సూచించారు. విబిజి రామ్‌జి నూతన మార్గదర్శకాలు మరియు పనులపై ప్రజల్లో అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. 16వ ఆర్థిక సంఘం మార్గదర్శకాల ప్రకారం ఆర్థిక సంఘం నిబంధనలతోపాటు గ్రామ పంచాయతీ సొంత ఆదాయ వనరులను పెంచుకోవాల్సిన ప్రాముఖ్యతను వివరించాలని ఆయన సూచించారు. గ్రామ పంచాయతీ, విలేజ్ ఆర్గనైజేషన్ భవనాలకు సంబందించి ఇప్పటికే మంజూరైన భవనాల నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించి, పూర్తి చేయలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి రెండు మండలాలకు పంచాయతీ రాజ్ అండ్ గ్రామీణాభివృద్ధి శాఖ నుండి ఒక "ప్రత్యేక అధికారి"ని నియమించడం జరిగిందన్నారు. లక్ష్యాలను సాధించాలని గ్రామ సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు, ఎంపిఒ, ఎంపిడిఒ లకు ఆదేశాలు జారీ చేసినట్లు డిపిఒ సురేష్ మోహన్ వివరించారు.

---

# డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతాం : మధు యాష్కీ

**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** డగ్స్ విక్రయాలు, డ్రగ్స్ తీసుకునే వారిపై ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకుంటుందని టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపి మధుయాష్కీ గౌడ్ హెచ్చరించారు. ఆదివారం బిఎన్.రెడ్డి ఉమ్మడి డివిజన్‌లోని సాహెబ్ నగర్, కాప్రాయి చెరువును స్థానిక నాయకులతో పాటు కాలనీ వాసులతో కలిసి చెరువు కట్టను పరిశీలించారు. ఈ మేరకు కాలనీ వాసులు పలు సమస్యలు మధుయాష్కీ దృష్టికి తీసుకోచ్చా రు. చెరువు సుందరీకరణ చేయాలని, సాయంత్రం సమయంలో ఆకతాయిల అరాచకాలు ఎక్కువగా ఉన్నాయని, వారిని అరికట్టే విధంగా పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించాలని, కాలనీ వాసులు రాత్రి సమయంలో బయటకు వెళ్లాలంటే భయభ్రాంతులకు గురి అవుతున్నారని వారికి వివరించారు. ఈ సందర్భంగా మధుయాష్కీ గౌడ్ మాట్లాడుతూ డ్రగ్స్, మాదకద్రవ్యాలు విక్రయాలు జరిపితే తీవ్రమైన చర్యలు తీసుకుంటామని, పోలీసులు రాత్రి సమయంలో పెట్రోలింగ్ నిర్వహించాలని ఆదేశించారు. చెరువుకట్టలపై రాత్రి సమయంలో ఎవరైన వస్తే స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. నూతనంగా ఏర్పాటు అయిన సాహెబ్ నగర్ డివిజన్‌ను అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడానికి ప్రజాప్రభుత్వం బాధ్యత తీసుకుంటుందన్నారు. శివారు కాలనీలకు రూ.12 కోట్లతో స్ట్రామ్ వాటర్ పైప్‌లైన్, డ్రైన్ వాటర్ పైప్‌లైన్ పనులకు టెండర్లు పూర్తి చేసి పనులు ప్రారంభం దశలో ఉందని ఆయన తెలిపారు. శివారులకు కాలనీలకు డ్రైనేజీ, విద్యుత్ దీపాలు, సీసీ రోడ్లు, మట్టిరోడ్లు మరమత్తులు చేయడానికి నిధులు మంజూరు అయ్యే విధంగా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మి ప్రసన్న రామ్మోహన్‌గౌడ్, సాహెబ్ నగర్, బిఎన్.రెడ్డి డివిజన్ అధ్యక్షులు కేతావత్ రమేష్ నాయక్, పి.గణేష్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా పార్టీ స్పోక్‌పర్సన్ దాము మహేందర్ యాదవ్, మకుంటం సదాశివుడు, నర్సింహా యాదవ్, విద్యారెడ్డి, భవాని సరస్వతి, నందకిషోర్, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



**సాహెబ్ నగర్‌లో సర్ ప్రక్రియను పరిశీలించిన మధుయాష్కీ ...**సాహెబ్ నగర్ డివిజన్‌లో నిర్వహిస్తున్న సర్ ప్రక్రియను ఆదివారం మధుయాష్కీ గౌడ్ పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. సర్ ప్రక్రియల్లో ఓటర్ తమ ఓటును ఎన్యూమరేషన్ ఫారంను పూర్తి స్థాయిలో నింపి సంబంధిత బిఎల్ఓలకు సమర్పించాలని కోరారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ఆగస్టు 3 తేదీ వరకు చివరి అవకాశం ఉండడంతో ప్రతి ఓటరు తమ ఓటును నిలుపుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి డివిజన్‌లో సర్ హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రజలు తమ ఓటు హక్కును కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ లక్ష్మి ప్రసన్న రామ్మోహన్ గౌడ్, డివిజన్ అధ్యక్షులు కేతావత్ రమేష్ నాయక్, పి. గణేష్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు కొండోజు శ్రీనివాస్, బిఎల్ఓలు తదితరులు పాల్గొన్నారు.

---

# కార్మిక హక్కుల రక్షణకు సమరశీల పోరాటాలు

### ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు




**ప్రజాపక్షం/రంగారెడ్డి:** కార్మిక హక్కుల రక్షణకు సమరశీల పోరాటాలకు కార్మికలోకం సిద్ధం కావాలని ఎఐటియుసి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు పిలుపునిచ్చారు. నిరంతరం కార్మికుల పక్షాన పోరాడుతూ వారి హక్కులను కాపాడే కార్మిక సంఘం ఒక్క ఎఐటియుసి మాత్రమే అన్నారు. ఆదివారం జరిగిన రంగారెడ్డి జిల్లా గండిపేట్ మండలం ఎఐటియుసి నాలుగవ మహాసభకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సీనియర్ నాయకులు శంకరయ్య అధ్యక్షతన మహాసభ జరిగింది. ఈ సందర్భంగా పర్వతాలు మాట్లాడుతూ కార్మిక లోకం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను బిజెపి నేతృత్వంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం తుంగలో తొక్కి, కొత్తగా నాలుగు లేబర్ కోడులను తీసుకొచ్చిందని విమర్శించారు. కొత్త లేబర్ కోడ్‌లతో కార్మిక హక్కులు, చట్టాలు కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పటికీ కార్మికులకు కనీస వేతనాలు అమలు కావడం లేదని, జీతభత్యాలు అలవెన్సులు, పెరగకపోవడం వల్ల కార్మికులు అనేక ఆర్థిక అసమానతలు ఎదుర్కొంటున్నారని, నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగి, సామాన్యుల జీవితాలను ఆగం చేస్తున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ధరలను అదుపు చేయలేని అసమర్థ ప్రభుత్వాలు నేడు కేంద్ర, రాష్ట్రాల్లో ఉన్నాయని విమర్శించారు. కార్మిక హక్కుల రక్షణకు ఉద్యమాలే శరణ్యమన్నారు. ఆగస్టు 2న తుక్కుగూడలో జరిగే మహాసభలలో జిల్లాలో కార్మికుల సమస్యలపై తీర్మానాలు చేసి భవిష్యత్తు ఉద్యమాలకు కార్యాచరణ రూపొందిస్తామని పర్వతాలు తెలిపారు. మహాసభలో ఎఐటియుసి జిల్లా కార్యదర్శి ఎస్.మల్లేష్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలాని పిలుపునిచ్చారు.
**ఎఐటియుసి నూతన కమిటీ ఎన్నిక...**అనంతరం గండిపేట మండలం నూతన కమిటీని 15 మందితో ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ఎం శంకరయ్య, అధ్యక్షుడిగా శివ, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా భాస్కర్, మండల ప్రధాన కార్యదర్శిగా వెంకటేష్, ఆఫీస్ బేరర్స్‌గా మరో తొమ్మిది మందిని ఎన్నుకున్నారు.

## రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యుడు రంగరాజు ముదిరాజ్‌కు సన్మానం

ప్రజాపక్షం/నవాబుపేట్ : వికారాబాద్ జిల్లా నవాబుపేట్ మండల కేంద్రంలోని లక్ష్మారెడ్డి గార్డెన్‌లో ఆదివారం రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యుడు కె.రంగరాజు ముదిరాజ్‌కు నవాబుపేట్ మండల ముదిరాజ్ సంఘం నాయకులు, బిసి సంఘం నాయకులు ఘనంగా సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా రంగరాజు ముదిరాజ్ మాట్లాడుతూ, ఇందిరమ్మ రాజ్యంలో బిసిలు, ఎస్‌సిలు, ఎస్‌టిలు, మైనారిటీలు సహా అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా జీవిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బిసి సంఘం జిల్లా అధ్యక్షుడు యాదగిరి యాదవ్, కౌన్సిలర్ మల్లికార్జున్ గౌడ్, ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు రాఘవేందర్ ముదిరాజ్, ఉపాధ్యక్షుడు విజయ్ కుమార్ ముదిరాజ్, సర్పంచులు శ్రీనివాస్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## అవకతవకలకు తావులేకుండా 'సర్'



ప్రజాపక్షం/నవాబుపేట్ : వికారాబాద్ జిల్లా నవాబుపేట్ మండలంలోని తిమ్మారెడ్డిపల్లి, నవాబుపేట్ గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఆదివారం నిర్వహించిన ఎస్ఐఆర్ ప్రక్రియ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సామా వెంకటరెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షులు కొండల్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిఎల్ఒలు, బిఎల్ఎలతో కలిసి ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా సామా వెంకటరెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల ప్రక్రియలో ప్రతి అర్హత కలిగిన ఓటరు తప్పనిసరిగా ఎస్ఐఆర్ ప్రక్రియలో నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని కోరారు. అలాగే, బిఎల్ఒలు పూర్తి పారదర్శకతతో విధులు నిర్వహిస్తూ, ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా నమోదు ప్రక్రియను చేపట్టాలన్నారు. ప్రతి అర్హుడి వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మేడిపల్లి వెంకటయ్య, సర్పంచ్ల సంఘం మండల అధ్యక్షులు కొండల యాదవ్, సర్పంచులు దాన నర్సింలు, ఉప సర్పంచ్ రామ్ చంద్రయ్య, నాయకులు శేఖర్, ప్రభాకర్ రెడ్డి,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జవహర్‌నగర్ డంపింగ్ యార్డును శాశ్వతంగా మూసివేయాలి



ప్రజాపక్షం/జవహర్ నగర్: నాలుగు మండలాల ప్రజల ఆరోగ్యాలకు ప్రమాదకరంగా మారిన జవహర్ నగర్ రాంకీ డంపింగ్ యార్డును శాశ్వతంగా మూసివేయాలని పర్యావరణ సైంటిస్ట్ డాక్టర్ బాబురావు, ప్రొఫెసర్ లుబ్నా సర్వత్ డిమాండ్ చేశారు. ఆదివారం యాప్రాల్‌లోని డిఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో 'జవహర్ నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటీ' ఆధ్వర్యంలో అవగాహన సదస్సు జరిగింది. నగరంలోని ఇతర ప్రాంతాల చెత్తను జవహర్ నగర్‌కు తరలించవద్దని, ఏ ప్రాంత చెత్తను ఆ ప్రాంతంలోనే ప్రాసెస్ చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పర్యావరణ వేత్తలు డిమాండ్ చేశారు. లక్షలాది మంది ప్రజలు కదిలిస్తేనే డంపింగ్ యార్డు మూసివేత సాధ్యమవుతుందని విరసం నేత ప్రొఫెసర్ సి. ఖాసీం పిలుపునిచ్చారు. ప్రజల జీవించే హక్కును హరిస్తున్న డంపింగ్ యార్డును వెంటనే మూసివేయాలని సదస్సులో పాల్గొన్న కాంగ్రెస్, సిపిఐ, సిపిఎం, బిఆర్ఎస్, ఆప్, విప్లవ పక్షాలు, హక్కుల సంఘాల నేతలు స్పష్టం చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే పోరాట కమిటీ చేపట్టే ఉద్యమానికి పూర్తి మద్దతు ఇస్తామని ప్రకటించారు. కాగా, ఈ సమస్య పరిష్కారానికి సిఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని కాంగ్రెస్ నేతలు తెలిపారు. కార్యక్రమంలో వివిధ సాంస్కృతిక బృందాలు ఆలపించిన ఉద్యమ గేయాలు ప్రజలను ఆలోచింపజేశాయి. ఈ సదస్సులో పోరాట కమిటీ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## గబ్బిలాలపేటలో మౌలిక వసతులు కల్పిస్తాం



ప్రజాపక్షం/జవహర్‌నగర్ : జవహర్ నగర్ పరిధిలోని గబ్బిలాలపేట కాలనీవాసులు ఎదుర్కొంటున్న మౌలిక సదుపాయాల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని మేడ్చల్ జిల్లా మైనార్టీ అధ్యక్షురాలు రషీదా బేగం హామీ ఇచ్చారు. కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడం, సీసీ రోడ్లు లేక ప్రజలు పడుతున్న అవస్థలపై స్థానికులు ఆమెను కలసి తమ సమస్యలను విన్నవించారు. కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు రషీదా బేగం స్వయంగా గబ్బిలాలపేటను సందర్శించి, క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ, రోడ్లు, సరియైన డ్రైనేజీ వ్యవస్థ, విద్యుత్ దీపాలు లేకపోవడం వల్ల కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యలను వెంటనే మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ దృష్టికి తీసుకెళ్లి, పూర్తి సమాచారంతో కూడిన వినతిపత్రాన్ని అందజేస్తానని తెలిపారు. ఎంపి నిధులు ప్రభుత్వ సహకారంతో కాలనీలో త్వరితగతిన సీసీ రోడ్లు, డ్రైనేజీ లైన్లు, విద్యుత్ వసతులు మంజూరయ్యేలా చొరవ చూపుతానని హామీ ఇచ్చారు.

## 27నుండి 29వరకు, విత్తన మేళా

ప్రజాపక్షం /వికారాబాద్ : జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాలలోని రైతువేదికలో 27నుండి 29వరకు , విత్తన మేళా నిర్వహించడం జరుగుతుందని జిల్లా వ్యవసాయ అధికారి కవిత తెలిపారు. ఎల్‌నినో పరిస్థితుల దృష్ట్యా విత్తన మేళా సందర్భంగా ప్రత్యామ్నాయ పంటల సాగు ,అత్యవసర ప్రణాళికపై రైతులకు అవగాహన కల్పించే సమావేశాలను ఎఇఒలు నిర్వహిస్తారని ఆమె తెలిపారు. విత్తన మేళా సమయంలో విత్తన వ్యాపారులు రైతు వేదికలలో కౌంటర్లను ఏర్పాటు చేసి అత్యవసర ప్రణాళికలో భాగంగా ప్రోత్సహిస్తున్న పంటల విత్తనాలన్నింటిని అందుబాటులో ఉంచాలని ఆమె ఆదేశించారు. రైతుల సౌలభ్యం కోసం అన్ని కంపెనీలకు చెందిన వివిధ రకాల విత్తనాలు ఒకే చోట లభించే అవకాశాన్ని రైతులు వినియోగించుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో ద్వారా లబ్ది పొందేలా చూడాలని ఎంఇఓ ,ఏఈఓలను జిల్లాత వ్యవసాయ అధికారులను అదేశించారు.


## గోవులు తరలిస్తున్న వ్యక్తులు అరెస్టు

ప్రజాపక్షం/చర్లపల్లి : అక్రమంగా గోవులను తరలిస్తున్న వ్యక్తులను అరెస్టు చేసిన సంఘటన కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సాయిలు తెలిపిన వివరాల ప్రకారం జగదేవ్‌పూర్ మార్కెట్ నుండి జియాగూడకు గోవులను తరలిస్తుండగా స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు కుషాయిగూడ మార్కెట్ వద్ద అక్రమంగా తరలిస్తున్న వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించారు. 27 ఎద్దులు,8 గేదేలను గోషాలకు తరలిస్తుండగా పట్టుకున్నారు.రెండు బొలెరో వాహనాలను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. గోవులను తరలిస్తున్న వ్యక్తులను అరెస్టు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

## మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో

# మందకొడిగా ప్రత్యేక ముమ్మర సవరణ

- నేటికి కేవలం 54 శాతమే పూర్తి
- తలనొప్పిగా మారిన 2002 జాబితా ప్రామాణిక నిబంధన
- అవగాహన కల్పించటంలో వైఫల్యం
- భాగస్వాములు కాని ప్రజాప్రతినిధులు
- ఫొటోలు, పత్రికా ప్రకటనలకే పరిమితం




ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి : కేంద్ర ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా చేపట్టిన ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో మాత్రం నేటికీ మందకొడిగా కొనసాగుతోంది. ఈ ప్రక్రియ మరో 9 రోజులలో గడువు ముగియనుండగా కేవలం 54 శాతంతో మాత్రమే లక్ష్యాన్ని సాధించి రాష్ట్రంలోనే చివరి స్థానంలో ఉంది. జిల్లా యంత్రాంగం ప్రారంభం నుండి ఓటర్లకు సమగ్రంగా అవగాహన కల్పించటంతో పాటు జిల్లాలోని రాజకీయ పార్టీ ప్రతినిధులను భాగస్వాములను చేయటంలో కనపరచిన నిర్లక్ష్యమే దీనికి ప్రధాన కారణమైంది. నేటికీ జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, మాజీలు అంటీ అంటనట్లుగానే ఉంటుండటం గమనార్హం. జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు సర్వే ప్రక్రియలో భాగంగా కొనసాగుతున్న ఎన్యుమరేషన్ పత్రాల పంపిణీ, వాటిని తిరిగి తీసుకోవటంలో పరిశీలన పేరిట కేవలం అప్పుడప్పుడు క్షేత్ర స్థాయిలో వెళ్లి బిఎల్ఓలను కలవటం, ఫొటోలు దిగటం, పత్రికా ప్రకటనలు ఇవ్వటానికే పరిమితం అవటం ప్రధాన లోపంగా పేర్కొనవచ్చు. కొద్ది రోజుల క్రితం నుండే జిల్లాలోని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాత్రమే సర్వే గురించి కొన్ని ప్రాంతాల్లో అవగాహన సంబంధిత బోర్డులను ఏర్పాటు చేసారే తప్ప మరే నలుగురు ఎమ్మెల్యేలు ఆ దిశగా అడుగు వేయక పోవటం గమనార్హం. తమకు సంబంధించిన పూర్తి వివరాలు పూరించి ఇవ్వాలంటూ ఓటర్లకు పంపిణీ చేస్తున్న ఎన్యుమరేషన్ పత్రాలు 2002 ఓటరు జాబితాను ప్రామాణికంగా చేసుకొని ప్రస్తుత ఓటర్ల వివరాలతో మ్యాపింగ్ చేయాలంటూ ఎన్నికల సంఘం ఆదేశించటం, బిఎల్ఓలకు తలనొప్పిగా తయారైంది. ఓటర్లకు ఎన్యుమరేషన్ పత్రాల్లో 2002 నాటి వివరాలతో పాటు వాటికి సంబంధించిన ఆధారాలను సైతం జతపరచాలన్న నిబంధన అటు ఓటర్లను, ఇటు బిఎల్ఓలను అయోమయానికి గురి చేస్తోంది. దీంతో ఎన్యుమరేషన్ పత్రాలు తీసుకొన్న ఓటర్లు వాటిని పూరించి ఇవ్వటంలో కనపరుస్తున్న నిర్లక్ష్యం కారణంగా ఒక్కో ఇంటికి బిఎల్ఓలు మూడు నాలుగు సార్లు వెళ్లి అందుబాటులో ఉన్న వివరాలతో పూర్తి చేసి ఇవ్వాలంటూ బతిమిలిడాతున్న పరిస్థితులు నెలకొన్నాయి. ఓటర్ల వివరాలు పూరించటంతో పాటు ప్రతి ఒక్కరి పుట్టిన తేదీ ధృవీకరణ పత్రాలు, ఫొటోలు సైతం జతపరచాలన్న మరో నిబంధన సైతం జాప్యానికి మరో కారణంగా మారింది. దీంతో పలు చోట్ల ఎన్యుమరేషన్ పత్రాలను నామమాత్ర వివరాలతో పూర్తి చేయించి డిజిటలైజేషన్ చేస్తున్నారు.

### తలనొప్పిగా మారిన 2002 ప్రామాణికం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 24 ఏళ్ల క్రితం 2002 నాటి ఓటరు జాబితాను ప్రామాణికంగా తీసుకోవాలన్న నిబంధన కారణంగా వివిధ రాష్ట్రవాసులకు వలస జిల్లాగా పేరొందిన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో ముఖ్యంగా అద్దెకు ఉంటున్న ఓటర్లు ఇళ్లు మారటం, మరో ప్రాంతానికి వలస వెళ్లటం కారణాల వల్ల అప్పటి జాబితా ప్రకారం ఆ చిరునామాల్లో ఆ ఇళ్లల్లో లేకపోవటం, ప్రస్తుతం వారెక్కడున్నారో తెలియక ఎన్యుమరేషన్ పత్రాల పంపిణీ, వాటిని పూర్తి చేయించటంలో ఎదురైన ఇబ్బందులు ఇక్కడ తలనొప్పిగా మారాయి. మరో పక్క తమకిచ్చిన ఎన్యుమరేషన్ ఫారాలు పూరించటంలో 2002నాటి తమ ఓటరు సంఖ్య,సీరియల్ నంబర్,పోలింగ్ కేంద్రం వివరాలు తెలియక పోవటం సైతం జాప్యానికి కారణమవుతోంది.ఇళ్లు మారిన వారితో పాటు మరో ప్రాంతానికి వెళ్లిన ఓటర్లు తాము ఎన్యుమరేషన్ పత్రాలు తీసుకోవాలంటే 2002 లో ఓటు వేసిన ప్రాంతానికే వెళ్ల వలసి వస్తున్నందున వాటిని పూరించి ఇవ్వక పోతే తమ ఓటు హక్కు ఎక్కడ కోల్పోవాల్సి వస్తుందో అని కొందరు, ఫారాలు అందిన వారు వాటిని ఎలా పూరించాలో తెలియక ఆందోళన చెందుతున్నారు.

### క్షేత్రస్థాయిలో అవగాహన కరువు

ఎస్ఐఆర్ ప్రక్రియపై జిల్లా యంత్రాంగం అక్కడక్కడ మాత్రమే ఫ్లెక్సీలు,బ్యానర్లు ఏర్పాటు చేసినప్పటికి ఎక్కడా ప్రజలను సమీకరించటం ద్వారా సమగ్రంగా అవగాహన కల్పించలేక పోయారు. ఎన్యుమరేషన్ పత్రాలు పూరించి ఇవ్వటంలో కానీ వాటికి సంబంధించిన అనుమానాలు, సందేహాలకు తగిన సమాధానాలివ్వటానికి జిల్లా అధికారులు సరైన ఏర్పాట్లు చేయకుండా కేవలం పత్రికా ప్రకటనలకు మాత్రమే పరిమితమయ్యారు. ఈ విషయంలో బిఎల్ఓలకు సైతం పూర్తి స్థాయిలో అవగాహన కల్పించక పోవటం వల్ల క్షేత్ర స్థాయిలో ఓటర్ల సందేహాలను పూర్తి స్థాయిలో నివృత్తి చేయలేకపోతున్నారు.

## కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి ఘన స్వాగతం

### అలియాబాద్ చౌరస్తాలో గజమాలతో స్వాగతం పలికిన బిజెపి నాయకులు



ప్రజాపక్షం/శామీర్‌పేట : కొమురవెల్లిలో రైల్వే స్టేషన్ ప్రారంభోత్సవానికి హైద్రాబాద్ నుంచి బయల్దేరిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌లకు అలియాబాద్ మున్సిపల్ ప్రధాన చౌరస్తాలో మున్సిపల్ బిజెపి అధ్యక్షుడు కొర్వి కృష్ణ ఆధ్వర్యంలో జిల్లా రూరల్ బిజెపి అధ్యక్షుడు బుద్ది శ్రీనివాస్, అలియాబాద్ మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ కన్‌రెడ్డి మాలతి మాధవరెడ్డిలు ఘన స్వాగతం పలికారు. ఆదివారం కొమురవెల్లిలో నూతనంగా నిర్మించిన రైల్వే స్టేషన్ ప్రారంభించాడానికి హైద్రాబాద్ నుంచి బయల్దేరిన కిషన్‌రెడ్డికి అలియాబాద్ చౌరస్తాలో బిజెపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఘన స్వాగతం పలికారు. అలియాబాద్ మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ కన్‌రెడ్డి మాలతి మాధవరెడ్డి గజమాలతో కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లను శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో జిల్లా బిజెపి మాజీ అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, మేడ్చల్ అసెంబ్లీ కంటెస్ట్ అభ్యర్థి ఏనుగు సుదర్శన్‌రెడ్డి, జిల్లా నాయకులు హృదయ్‌కుమార్, మాధవరెడ్డి, కైర యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచాన్ని మార్చే శక్తి విద్యకు ఉంది

### విద్యాభివృద్ధికి ప్రైవేటు విద్య సంస్థలు మరింత కృషి చేయాలి ఆర్‌బిఎల్ సిఇఒ బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి

ప్రజాపక్షం/తాండూరు : ప్రపంచాన్ని మార్చే శక్తి విద్యకు ఉందని, విద్యాభివృద్ధికి ప్రైవేటు విద్య సంస్థలు మరింత కృషి చేయాలని తాండూరు కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఆర్‌బిఎల్ సిఇఒ బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. తాండూరు పట్టణంలోని దుర్గగ్రాండ్ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన బిఆర్ఎస్ఎంఎ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ట్రస్మా తాండూరు శాఖ నూతన కార్యవర్గానికి ముందుగా శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రపంచాన్ని మార్చే శక్తి విద్యకు ఉందన్నారు. ఆలాంటి విద్యను అందిస్తున్న మీరందరు శక్తి వంతులేనని, విద్యార్థులందరిని, సంస్కార వంతులుగా తీర్చిదిద్దాలని సూచించారు. తాండూరు విద్యార్థులకు నేటి పోటి ప్రపంచాన్ని తట్టుకునే విధంగా నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పట్లోళ నీరాజబాల్‌రెడ్డి, బిఆర్ఎస్ఎంఎ జిల్లా కమిటీ అధ్యక్షుడు మోహన్ గౌడ్, సభ్యులు, తాండూరు విద్య సంస్థల ప్రతినిధులు పాల్గోన్నారు.




## చౌదరిగూడలో ఘనంగా బోనాలు



ప్రజాపక్షం/ఘట్‌కేసర్ : పోచారం డివిజన్ పరిధిలోని చౌదరిగూడలో ఆషాడ మాసం సందర్భంగా నిర్వహించిన శ్రీ దుర్గమ్మ మహంకాళి అమ్మవారి బోనాల మహోత్సవం భక్తిశ్రద్ధల మధ్య అత్యంత వైభవంగా జరిగింది.ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడగా ప్రత్యేక పూజలు బోనాల సమర్పణతో పండుగ వేడుకలు అంగరంగ వైభవంగా సాగాయి వేడుకల్లో మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మల్లిపెద్ది సుధీర్ రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గం ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ బాధ్యుడు గజ్జల కాంతం, డివిజన్ అధ్యక్షుడు కర్రె రాజేష్ పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. వేడుకల్లో మాజీ జడ్‌పిచైర్మన్ మల్లిపెద్ది శరత్ చంద్రారెడ్డి, డిసిసి ఉపాధ్యక్షులు వేముల మహేష్ గౌడ్, శ్రీకాంత్ రెడ్డి, మల్లికార్జున్ రెడ్డి, వినోద్ కుమార్,స్థానిక ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు గ్రామ పెద్దలు మహిళలు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.

## వైద్య శిబిరాన్ని సందర్శించిన మైనంపల్లి



ప్రజాపక్షం/దుండిగల్ : కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని 294 డివిజన్ బహదూర్‌పల్లి గ్రీన్ హిల్స్ కాలనీ దగ్గర, నిర్వహించిన 54వ ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషోర్ రెడ్డి మాట్లాడుతూ, 294 డివిజన్ బహదూర్‌పల్లి గ్రీన్ హిల్స్ కాలనీ వాసులు ఈ ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని మీడియా సమావేశంలో తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కుత్బుల్లాపూర్ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి, భూపతి రెడ్డి, శ్రీధర్ రెడ్డి, కావలి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## 28 మంది బాలకార్మికులకు విముక్తి

ప్రజాపక్షం/బోడుప్పల్ : ఆపరేషన్ ముస్కాన్12 లో భాగంగా జిల్లా సంరక్షణ విభాగం (డిసిపియు) మేడిపల్లి డివిజన్ పోలీసులతో కలిసి ఆదివారం ప్రత్యేక తనిఖీలు నిర్వహించి 28 మంది బాలకార్మికులను గుర్తించి రక్షించారు. సంరక్షణ విభాగ మేనేజర్ డా.పి.అరుణ్ జంజాల్ ఆధ్వర్యంలో ఎస్సై ఖలీల్, హెడ్ కానిస్టేబుళ్లు శివలాల్, శేఖర్, లాలూనాయక్,కానిస్టేబుల్ రాజ్‌కుమార్, మహిళా కానిస్టేబుల్ లక్ష్మి లు కలిసి వివిధ హోటళ్లు, దుకాణాలు, వ్యాపార సంస్థల్లో తనిఖీలు చేసారు. అనంతరం బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. చదువుకునే వయస్సులో పని చేస్తుండటం వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ బాల కార్మికులతో పని చేయించే సంస్థలపై చట్ట ప్రకారం చర్యలు కఠినంగా ఉంటాయని స్పష్టం చేసారు. ప్రతి వ్యాపార సంస్థలో నో చైల్డ్ లేబర్ అన్న బోర్డులను విధిగా ఏర్పాటు చేసుకోవాలన్నారు.


## సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ముందుకు

### మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో మరింతగా అభివృద్ధి పనులను చేపడతాం : కొలను



ప్రజాపక్షం/ నిజాంపేట్ : జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో మరింతగా అభివృద్ధి పనులను చేపడతామని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలను హన్మంత రెడ్డి అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని నిజాంపేట్ సర్కిల్ బాచుపల్లి, ఎస్‌విఎస్ ఆభరణ కాలనీలో రూ.23 లక్షల వ్యయంతో సిమెంటు రోడ్డు పనులను మాజీ కార్పొరేటర్ కొలను వీరేందర్ రెడ్డితో కలిసి కొలను హన్మంత రెడ్డి ప్రారంభించారు. ముందుగా కాలనీలో పాదయాత్ర చేసి స్థానికంగా నెలకొన్న సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాచుపల్లిలో ఇప్పటికే కోట్లాది రూపాయల నిధులను వెచ్చించి రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, వీధి దీపాలు, పార్కుల అభివృద్ధి వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామని గుర్తు చేశారు. సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు వెళ్తుందని తెలిపారు. కాలనీలు, బస్తీలు అనే తేడా లేకుండా ప్రజలకు మెరుగైన మౌలిక వసతులను కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. కార్యక్రమంలో నిజాంపేట్ సర్కిల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొలను రాజశేఖర్ రెడ్డి, బాచుపల్లి డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు కొలను జీవన్ రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నవాబుపేట ఉపసర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడిగా గోపాలకృష్ణ ఏకగ్రీవం



ప్రజాపక్షం/నవాబుపేట్: నవాబుపేట మండల ఉప సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా కుమ్మరిగూడ గ్రామ ఉప సర్పంచ్ గోపాలకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉప సర్పంచుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు ఆవిశపేట్ ఆంజనేయులు గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం నవాబుపేట మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మండల ఉపసర్పంచులు ఏకగ్రీవంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వర్కింగ్ ప్రెసిడెంట్లు గంగ్యాడ గ్రామానికి చెందిన భానూరి హరీశ్వర్ రెడ్డి, ఎల్లకొండ గ్రామానికి చెందిన పెంటని రామచందర్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా పులుమామిడి గ్రామానికి చెందిన బి.నాగిరెడ్డి, మినేపల్లి కలాన్ గ్రామానికి చెందిన అంజయ్య యాదవ్ నియమితులయ్యారు. ప్రధాన కార్యదర్శులుగా మూలమాడ గ్రామానికి చెందిన ఎం.శ్రీనివాస్ యాదవ్, కడిచర్ల గ్రామానికి చెందిన ప్రభావతి, చించల్‌పేట్ గ్రామానికి చెందిన బాలరాజ్, గుల్లగూడ గ్రామానికి చెందిన బావగోని మహేందర్ బాధ్యతలు స్వీకరించారు. కార్యదర్శులుగా వట్టిమినేపల్లి గ్రామానికి చెందిన ఎన్.సురేందర్ రెడ్డి, యావపూర్ గ్రామానికి చెందిన ఎన్. శివనీల, తిమ్మారెడ్డిపల్లి గ్రామానికి చెందిన టి.మల్లేష్ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా ముబారక్‌పూర్ గ్రామానికి చెందిన వి.పార్వతమ్మ, యావపూర్ గ్రామానికి చెందిన ఎం.లక్ష్మి, చిట్టిగిద్ద గ్రామానికి చెందిన అనసూయ, గేటువనంపల్లి గ్రామానికి చెందిన బాలరాజ్, మమ్మదాన్‌పల్లి గ్రామానికి చెందిన అనంతయ్య నియమితులయ్యారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను సభలో పాల్గొన్న నాయకులు అభినందించి, మండలంలోని ఉపసర్పంచుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నవాబుపేట్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సామ వెంకట్ రెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు కొండల్ యాదవ్, ప్రభాకర్ రెడ్డి, చేవెళ్ల అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఉపేందర్ రెడ్డి, అనంత రాములు, తదితరులు పాల్గొన్నారు.

## సిల్వర్ ఆభరణాలు, వెండి వస్తువుకుల గమ్యస్థానం వాక్యా సిల్వర్



ప్రజాపక్షం/చర్లపల్లి : అత్యుత్తమైన 92.5 సిల్వర్ ఆభరణాలు, ప్రీమియం వెండి వస్తువులకు ప్రత్యేక గమ్యస్థానం వాక్యాసిల్వర్ అని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. ప్రీమియం 92.5 స్టెర్లింగ్ ఆభరణాలు,అత్యంత నైపుణ్యంతో రూపొందించిన వెండి వస్తువులకు ప్రసిద్ధి చెందిన ఆధునిక బ్రాండ్ వాక్యా సిల్వర్‌ను ఏఎస్‌రావు నగర్‌లో గణేష్ ప్రారంభించారు. రోజూవారీ వినియోగం, పండుగలు, వివాహాలు, ప్రత్యేక వేడుకలు,బహుమతుల కోసం అనువైన ఆభరణాలు ఇందులో అందుబాటులో ఉంచడం అభినందనీయమని ఎమ్మెల్యే అన్నారు. అత్యుత్తమ నాణ్యతతో రూపొందించిన వెండి ఉత్పత్తులను కోరుకునే వారికి ఇది ప్రత్యేక గమ్యస్థానంగా నిలవనుందని యాజమాన్యం తెలిపారు.ఈ కార్యక్రమంలో నిర్వహకులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల హక్కులు ప్రజాస్వామ్య పరిరక్షణకే క్యాండిల్ లైట్ ర్యాలీ



ప్రజాపక్షం/దుండిగల్ : న్యాయం కోసం వినిపించిన ప్రతి స్వరం సమాజానికి మార్గదర్శకం, విద్యార్థుల హక్కుల పరిరక్షణ, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం హైదరాబాద్ నెక్లెస్ రోడ్‌లో నిర్వహించిన క్యాండిల్ లైట్ ర్యాలీలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రోటోకాల్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ బొంగునూరి కిషోర్ రెడ్డి, 293 సూరారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీశైలం యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, సూరారం డివిజన్ కార్యకర్తలు పాల్గొని విద్యార్థులకు తమ సంఘీభావాన్ని తెలియజేశారు.


## గిన్నీస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ స్థాయిలో విద్యార్థులు ఎదగడం గర్వకారణం



ప్రజాపక్షం/ నిజాంపేట్ : గిన్నీస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ స్థాయిలో విద్యార్థులు ఎదగడం గర్వకారణమని బిఆర్ఎస్ ఎల్పి విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని పేట్‌బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విక్టరీ మార్షల్ ఆర్ట్స్ అకాడమీలో కరాటే శిక్షణ పొంది గిన్నీస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ స్థాయిలో ప్రశంసా పత్రాలను అందుకున్న సందర్భంగా ఎమ్మెల్యే ఎనిమిది మంది విద్యార్థులను అభినందించి సత్కరించారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ కష్టపడి సాధన చేసి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం ఎంతో గర్వకారణమన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు బీసు భరత్ కుమార్, నరేష్, అనంత్, ఓం కార్, రచ్చ అఖిలేశ్వర్, జతిన్, రాధాకృష్ణ, చరిత్, సేమిన్‌లకు వివేక్ ప్రశంసా పత్రాలను అందజేసి గోల్డ్ మెడల్స్‌ని అందజేసి అభినందించారు.

## ప్రజాస్వామిక వ్యతిరేక విధానాలకు మూల్యం తప్పదు

ప్రజాపక్షం/మల్కాజిగిరి : నియంతృత్వ ధోరణితో ప్రజాస్వామిక వ్యతిరేక విధానాలను కొనసాగిస్తే ప్రజాగ్రహానికి గురి కాకతప్పదన్న నిజాన్ని కేంద్రానికి విద్యార్థి సంఘాలు కొనసాగించిన ఆందోళనలతో కేంద్రం తలవంచే పరిస్థితికి తేవటం ఓ గుణపాఠం లాంటిదని మల్కాజిగిరి కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ బికె శ్రీను అన్నారు. విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో కేంద్ర విద్యా మంత్రి ధర్మేంద్ర రాజీనామా చేయటం పట్ల ఆదివారం కాంగ్రెస్ శ్రేణులు మౌలాలిలో మిఠాయిలు పంపిణీ చేస్తూ ఇకనైనా కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం అహంభావాన్ని విడనాడాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీకి చెందిన పోతుల వినోద్ యాదవ్, వెంకటేష్, పిట్టల శ్రీనివాస్, మజర్ భాయ్, హమీద్, చుంకు శీను, ఫరూక్, యూసూఫ్,సంపత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.




## నాగారంలో అభివృద్ధి పనులు ప్రారంభం



ప్రజాపక్షం/చర్లపల్లి : నాగారం డివిజన్ పరిధిలోని గోధుమకుంట టిపిఎస్ కృష్ణానగర్ కాలనీలో 80 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న డ్రైనేజీ,సిసి రోడ్డు పనులను కాంగ్రెస్ పార్టీ నాయకులు వంగేటి పర్వత్‌రెడ్డి,కౌకుట్ల జీవన్‌రెడ్డిలు ప్రారంభించారు. అభివృద్ధి పనులు చేపట్టడంలో కాంగ్రెస్ పార్టీ ముందుంటుదని,పనులను నాణ్యతతో,త్వరితగతిన పూర్తి చేయాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మంచాల ప్రవీణ్, కాలనీ ప్రతినిధులు సంతోష్‌రెడ్డి,కార్తీక్ కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# క్యూర్ బిల్లుతో ఆస్తిపన్ను మోత

● క్యాపిటల్ వ్యాల్యూ ఆధారంగా కొత్త విధానం ● పశ్చిమ హైదరాబాద్‌లో భారీగా పెరగనున్న భారం ● ఏటా 20 శాతానికి మించకుండా పెంపునకు అవకాశం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన కోర్ అర్బన్ రీజియన్ (ఇంటిగ్రేటెడ్ గవర్నెన్స్)–2026 (క్యూర్) బిల్లు నగరంలోని లక్షలాది మంది గృహ యజమానులపై అదనపు ఆస్తిపన్ను భారాన్ని మోపేలా ఉందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే మధ్యప్రాచ్య యుద్ధం ప్రభావం, కృత్రిమ మేధ (ఏఐ) కారణంగా ఐటి రంగంలో ఉద్యోగాల అనిశ్చితి, ఆర్థిక మందగమనం నేపథ్యంలో రియల్ ఎస్టేట్ రంగం ఒత్తిడిని ఎదుర్కొంటున్న వేళ.. కొత్త బిల్లు మరో దెబ్బగా మారనుందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం అమల్లో ఉన్న విధానం ప్రకారం ఆస్తి పన్ను గ్రాస్ యాన్యువల్ రెంటల్ వ్యాల్యూ (జిఎఆర్‌వి) ఆధారంగా నిర్ణయిస్తున్నారు. భవనం వయస్సును బట్టి డిప్రెషియేషన్ కూడా వర్తిస్తోంది. అయితే క్యూర్ బిల్లు అమల్లోకి వస్తే రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ నిర్ణయించే మార్కెట్ విలువ (క్యాపిటల్ వ్యాల్యూ) ఆధారంగానే పన్ను విధించనున్నారు. దీంతో మార్కెట్ విలువలు పెరిగినప్పుడల్లా ఆస్తిపన్ను కూడా స్వయంచాలకంగా పెరిగే పరిస్థితి ఏర్పడనుంది.

**మూడుసార్లు పెరిగిన మార్కెట్ విలువలు**

గత ఐదేళ్లలో రిజిస్ట్రేషన్ శాఖ మూడు దఫాలుగా భూములు, భవనాల మార్కెట్ విలువలను సవరించింది. కొన్ని ప్రాంతాల్లో ఈ పెంపు 400 నుంచి 800 శాతం వరకు నమోదైంది. వాస్తవ మార్కెట్ పరిస్థితుల కంటే ప్రభుత్వ ఆదాయాన్ని పెంచే లక్ష్యంతోనే ఈ సవరణలు జరిగాయన్న విమర్శలు ఉన్నాయి. ఇప్పుడు అదే మార్కెట్ విలువలను పన్ను లెక్కింపుకు ప్రాతిపదికగా తీసుకుంటే గృహ యజమానులపై మరింత భారం పడే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.

**0.1 నుంచి 0.5 శాతం వరకు**

బిల్లు ప్రకారం నివాస గృహాలపై క్యాపిటల్ వ్యాల్యూలో కనిష్ఠంగా 0.1 శాతం నుంచి గరిష్ఠంగా 0.5 శాతం వరకు, వాణిజ్య భవనాలపై 0.2 శాతం నుంచి 2 శాతం వరకు ఆస్తిపన్ను విధించవచ్చు. స్థానిక సంస్థలు కొత్త రేట్లు నిర్ణయించే వరకు తాత్కాలికంగా నివాస గృహాలకు 0.15 శాతం, వాణిజ్య భవనాలకు 0.75 శాతం పన్ను అమల్లో ఉంటుంది. ఈ లెక్కల ప్రకారం 1,200 చదరపు అడుగుల డబుల్ బెడ్‌రూమ్ ఇంటికే కనీసం రూ.5 వేల వరకు ఆస్తిపన్ను చెల్లించాల్సి వచ్చే అవకాశం ఉందని అంచనాగా ఉందని నిపుణులు చెప్పుతున్నారు.

**పశ్చిమ హైదరాబాద్‌లో రెట్టింపు భారం**

మార్కెట్ విలువలు అధికంగా ఉన్న పశ్చిమ హైదరాబాద్ ప్రాంతాలపై ఈ విధానం తీవ్ర ప్రభావం చూపనుంది. ఉదాహరణకు, శేరిలింగంపల్లి ప్రాంతంలోని 1,500 చదరపు అడుగుల ఫ్లాట్‌కు ప్రస్తుతం సుమారు రూ.7 వేలుగా ఉన్న ఆస్తిపన్ను, కొత్త విధానంలో దాదాపు రూ.15 వేలకు చేరే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. అయితే ఒకేసారి భారీగా పెంచకుండా, ప్రతి ఏడాది గరిష్ఠంగా 20 శాతానికి మించకుండా పెంపు ఉండేలా బిల్లులో వెసులుబాటు కల్పించారు.

**ఇప్పటికే పెరిగిన భారం**

జిహెచ్‌ఎంసి గత రెండు దశాబ్దాలుగా ఆస్తిపన్ను రేట్లను సవరించలేదు. అయితే ఐదేళ్ల క్రితం వార్షిక అద్దె విలువ (ఏఆర్‌వి) లెక్కింపు విధానంలో మార్పులు చేసి, పాత భవనాలకు ఇచ్చే డిప్రెషియేషన్‌ను తొలగించింది. దీంతో అప్పటికే ఆస్తిపన్ను గణనీయంగా పెరిగింది. ఇప్పుడు క్యాపిటల్ వ్యాల్యూ ఆధారిత విధానం అమల్లోకి వస్తే గృహ యజమానులపై మరోసారి భారీ భారం పడనుందని భావిస్తున్నారు.

**న్యాయ వివాదాలకు అవకాశం!**

ప్రాంతాల వారీగా మార్కెట్ విలువలు భిన్నంగా ఉండటంతో ఒకే నగరంలో పన్ను భారం కూడా అసమానంగా ఉండటంపై ప్రజా విధాన నిపుణులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఒక ప్రాంతం నుంచి ఎక్కువ పన్ను వసూలు చేసినా అదే ప్రాంత అభివృద్ధికి ఆ నిధులు వినియోగించకపోతే న్యాయపరమైన వివాదాలు తలెత్తే అవకాశముందని హెచ్చరిస్తున్నారు. అపార్ట్‌మెంట్‌లలో ఉమ్మడి ప్రదేశాల విస్తీర్ణాన్ని కూడా పన్ను లెక్కల్లో చేర్చడం వల్ల గృహ యజమానులపై అనవసర భారం పడుతుందని సామాజిక కార్యకర్త, రచయిత దొంతి నరసింహారెడ్డి అభిప్రాయం వ్యక్తం చేశారు.

## డాక్టర్ జి. హరిచరణ్‌కు ధన్వంతరి ఎక్సలెన్స్ అవార్డు

రాజ్యసభ సభ్యుడు కె. లక్ష్మణ్ చేతుల మీదుగా పురస్కారం ప్రదానం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** అపోలో హాస్పిటల్, సికింద్రాబాద్, సీజన్స్ హాస్పిటల్స్, అంబర్‌పేటలో సీనియర్ కన్సల్టెంట్ ఫిజీషియన్, డయాబెటాలజిస్ట్, లిపిడాలజిస్టుగా సేవలందిస్తున్న డాక్టర్ జి. హరిచరణ్‌కు వైద్య రంగంలో విశిష్ట సేవలకు గుర్తింపుగా ప్రతిష్ఠాత్మక 'ధన్వంతరి ఎక్సలెన్స్ అవార్డు' ప్రదానం చేశారు. హైదరాబాద్‌లోని నారాయణగూడ కేశవ మెమోరియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్ ఈ అవార్డును అందజేశారు. బిజెపి డాక్టర్స్ సెల్ తెలంగాణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రముఖ వైద్యులు, ఆరోగ్య నిపుణులు, ప్రజాప్రతినిధులు, పలువురు విశిష్ట అతిథులు హాజరయ్యారు. రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం, మధుమేహ నియంత్రణలో విశేష కృషి చేయడం, నివారణ వైద్యంపై ప్రజల్లో అవగాహన కల్పించడం, ఉచిత వైద్య శిబిరాల ద్వారా సమాజ సేవ చేయడం, ప్రజారోగ్య పరిరక్షణకు అంకిత భావంతో పనిచేయడం వంటి సేవలను గుర్తించి డాక్టర్ హరిచరణ్‌ను ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ హరిచరణ్ మాట్లాడు తూ ఈ పురస్కారాన్ని తన రోగులు, గురువులు, సహచర వైద్యులు, కుటుంబ సభ్యులకు అంకితం చేస్తున్నట్లు తెలిపారు. ఈ గౌరవం సమాజానికి మరింత నిబద్ధతతో, మానవతా దృక్పథంతో సేవలు అందించేందుకు తనకు ప్రేరణగా నిలుస్తుందని పేర్కొన్నారు.

## అదనపు కట్నం వేధింపుల కేసు: సిఐ సస్పెన్షన్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** నగరంలో సంచలనం సృష్టించిన అదనపు కట్నం వేధింపుల ఉదంతంలో శాఖాపరమైన తీవ్ర చర్యలు తీసుకున్నారు. తన భర్త అయిన పోలీసు అధికారి తనను కట్నం కోసం వేధిస్తున్నాడంటూ బాధితురాలు కుంచం సంధ్య నేరుగా హైదరాబాద్ పోలీసు కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన విషయం విదితమే. ఈ ఫిర్యాదును తీవ్రంగా పరిగణించిన ఉన్నతాధికారులు, దర్యాప్తు అనంతరం మలక్‌పేట పోలీసు స్టేషన్ హౌజ్ ఆఫీసర్ (సిఐ) కుంచం నరసింహను సస్పెండ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. 2012 సంవత్సరంలో కుంచం నరసింహ, సంధ్యల వివాహం కుటుంబ సభ్యుల సమక్షంలో ఘనంగా జరిగింది. వివాహ సమయంలో రూ. 18.5 లక్షల నగదు, 10 తులాల బంగారం కట్నంగా సమర్పించారు. పెళ్లయిన నాటి నుంచి అదనపు కట్నం తేవాలంటూ భర్త నరసింహ తనను మానసికంగా, శారీరకంగా తీవ్రంగా హింసించాడని బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితురాలి తరపు బంధువులు పలుమార్లు పెద్ద మనుషులతో పంచాయతీలు పెట్టినా సదరు పోలీసు అధికారి తీరులో మార్పు రాలేదని, మరింత కట్నం డిమాండ్ చేస్తూ వేధించారని ఆరోపణలు ఉన్నాయి. శాస్త్రబద్ధమైన విచారణ చేపట్టి, బాధితురాలి ఫిర్యాదు ఆధారంగా శాఖా నియమాలకు విరుద్ధంగా ప్రవర్తించిన ఇన్స్పెక్టర్‌పై ఈ సస్పెన్షన్ వేటు పడినట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి. ఈ ఘటన పోలీస్ శాఖలో తీవ్ర చర్చనీయాంశమైంది.

## ప్రజా సమస్యలు విస్మరించారు : మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ ప్రసూన



**ప్రజాపక్షం/మెహిదీపట్నం:** ప్రజలకు ఆకర్షణీయ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన పాలకులు.. నేడు ప్రజా సమస్యలను పూర్తిగా విస్మరించారంటూ ప్రభుత్వ వైఫల్యాలను టిడిపి నాయకురాలు, మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ ప్రసూన దుమ్మెత్తిపోశారు. ఈ మేరకు తెలుగు దేశం పార్టీ పిలుపు మేరకు సికింద్రాబాద్ పార్లమెంటు పరిధిలోని మెహిదీపట్నం డివిజన్‌లో మెహదీపట్నం డివిజన్ అధ్యక్షుడు పూసల వీరబాబు, పుప్పాల బాలకృష్ణ, ఇ.కిషోర్ సమన్వయంతో సంతోష్‌నగర్ కాలనీలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించడం ద్వారా 'తెలుగుదేశం ప్రజాపథం' కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రసూన మాట్లాడుతూ... బస్తీల్లో డ్రైనేజీ పొంగిపొర్లుతున్నా, రోడ్లు ధ్వంసమైనా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని వాపోయారు. పేదలకు ఇండ్లు, మహిళలకు పింఛన్లు, విద్యార్థులకు స్కూటర్ల హామీలన్నీ నీటిమూటలుగానే మిగిలాయని మండిపడ్డారు. ప్రజా సమస్యల పరిష్కారం అయ్యేంతవరకు తెలుగుదేశం పోరాడుతుందని ఆమె తేల్చిచెప్పారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ పార్లమెంట్ కోఆర్డినేటర్ నల్లెల్ల కిషోర్, పి.బాల్‌రాజ్‌గౌడ్, రాష్ట్ర బిసి సెల్ మాజీ అధ్యక్షుడు శ్రీపతి సతీష్, రాష్ట్ర ఎస్సి సెల్ మాజీ అధ్యక్షుడు పి.అశోక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జివిజి నాయుడు, సి.విఠల్, ఎస్‌ఎమ్ లయీఖ్, స్వరూపారాణి, రాంప్రసాద్, శ్రీనివాస్, యాదగిరి, అనిల్, ప్రమీల, తడక వినోద్, శ్యామ్‌సుందర్, ఓ.వెంకటేష్ చౌదరి, పరుశురామ్, కరణం కిరణ్, భాను ప్రకాష్, బాలాజీ గోస్వామి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు నైపుణ్యాభివృద్ధిని పెంపొందించుకోవాలి

శిల్పా ఆర్ట్ క్రియేషన్స్ 30 వార్షికోత్సవంలో మాజీ గవర్నర్ దత్తాత్రేయ



**ప్రజాపక్షం / హిమాయత్‌నగర్:** విద్యార్థులు చదువుతోపాటు క్రమశిక్షణతో మెలుగుతూ తమ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. ఆదివారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన శిల్పా ఆర్ట్ క్రియేషన్స్ 30వ వార్షికోత్సవ సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇంటర్, ఎస్‌ఎస్‌సిలో అత్యధిక మార్కులు సాధించిన 70 మంది విద్యార్థులకు కాలేజీ బ్యాగులు, మెమెంటోలు, ప్రశంసాపత్రాలు అందజేసి, అభినందించారు. అనంతరం దత్తాత్రేయ మాట్లాడుతూ గత 30 ఏళ్లుగా శిల్పా ఆర్ట్ క్రియేషన్స్ అధ్యక్షులు కాపర్తి ప్రకాశ్ చేస్తున్న సేవలను అభినందించారు. నేటి పోటీ ప్రపంచంలో నిలదొక్కుకోవాలంటే మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు నైపుణ్య అభివృద్ధిని పెంపొందించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా యాదగిరిగుట్ట ఆలయ కమిటి సభ్యులుగా నియమితులైన ప్రముఖ ఆధ్యాత్మికవేత్త గుండా మల్లయ్యను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఎల్‌సి బొగ్గారపు దయానంద్, తెలంగాణ వైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కాల్వ సుజాత, ప్రముఖ పారిశ్రామికవేత్త తెగుళ్ల వీరస్వామి, గంగాధర్, శిల్పా ఆర్ట్ భాగ్యలక్ష్మి, ప్రధానకార్యదర్శి ఆర్ పద్మప్రియ, ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.రాములు, నిరీష, సౌమ్య శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఇవేమి ట్రాఫిక్ ఆంక్షలు?


గోల్కొండ కోట పరిసరాల్లో భక్తులకు ఇబ్బందులు



**ప్రజాపక్షం/గోల్కొండ:** చారిత్రక గోల్కొండ కోటలో జరుగుతున్న ఆషాడమాసం బోనాల నేపథ్యంలో తరలివచ్చే భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని అమలు చేస్తున్న ట్రాఫిక్ ఆంక్షల పట్ల భక్తులు మండిపడుతున్నారు. కోటలో జరిగే ఉత్సవాలకు కార్యక్రమాలు నిర్వహించే వారి వాహనాలను ట్రాఫిక్ పోలీసులు అడ్డుకుని కోటకు దూరంగా వాహనాలను పార్కింగ్ చేయాలని ఆదేశించడంతో సరుకులతో వస్తున్న వారి తీవ్ర ఇబ్బందుల పాలయ్యారు. ఈ క్రమంలోనే గోల్కొండ కోటలో అన్నదానం నిర్వహిస్తున్న ఇబ్రహీంబాగ్‌కు చెందిన యువకులను ట్రాఫిక్ పోలీసులు సుమారు అర కిలోమీటర్ దూరంలోనే తమ వాహనాలను నిలిపివేశారని వాపోయారు. అన్నదానం కోసం తీసుకొచ్చిన బియ్యం సంచులను కూడా అక్కడే ఆపేయడంతో వాటిని ఎలా గమ్యస్థానానికి చేర్చాలనే అయోమయంలో నిర్వాహకులు కొంతసేపు నిరీక్షించాల్సి వచ్చిందని మండిపడ్డారు. ట్రాఫిక్ పోలీసులను పలుమార్లు వేడుకున్న తర్వాతే తమ వాహనాన్ని ముందుకు వెళ్లేందుకు అనుమతించారని బాధితులు తెలిపారు. దీంతో అన్నదాన ఏర్పాట్లు ఆలస్యమయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు, సుమారు 80 ఏళ్ల వృద్ధురాలిని కూడా వాహనంతో ముందుకు వెళ్లనివ్వకుండా దాదాపు ఒక కిలోమీటర్ దూరంలో దింపి నడుచుకుంటూ వెళ్లాలని చెప్పారని సమాచారం. తాను షుగర్, బీపీ వంటి ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నప్పటికీ దూరం నడవాల్సి వచ్చిందని, వృద్ధుల పట్ల ఇలాంటి వ్యవహారం బాధాకరమని ఆ వృద్ధురాలు మీడియాతో మాట్లాడుతూ తన ఆవేదన వ్యక్తం చేశారు.బోనాల సందర్భంగా భక్తుల రద్దీ, భద్రత, ట్రాఫిక్ నియంత్రణ కోసం ప్రత్యేక ఆంక్షలు అమలు చేయడం అవసరమే అయినప్పటికీ, వృద్ధులు, దివ్యాంగులు, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నవారు, అలాగే బోనాల సామగ్రి లేదా అన్నదానానికి అవసరమైన వస్తువులతో వచ్చే భక్తుల పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని తగిన వెసులుబాటు కల్పించాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడ్డారు. మానవతా దృక్పథంతో ఇటువంటి వర్గాలకు ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తే భక్తులు ఇబ్బందులు పడకుండా ఉంటాయని ప్రజలు సూచిస్తున్నారు.


## కార్పొరేట్ సంస్థలు సహకరించాలి

-జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్‌యాదవ్



**ప్రజాపక్షం/యూసుఫ్‌గూడ:** ప్రభుత్వంతో పాటు కార్పొరేట్ సంస్థలు సామాజిక బాధ్యతలో భాగంగా తమవంతుగాసేవా కార్యక్రమాలు చేపట్టాలని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్‌యాదవ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు యూసుఫ్‌గూడలో ఆదివారం హ్యుందాయ్ మొబిస్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో కలిసి ఎమ్మెల్యే నవీన్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు నియో ఫ్లయి బోల్ట్ పవర్ వీల్‌చైర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సోషల్ వర్కర్ చిన్న శ్రీశైలం యాదవ్, జాతీయ దివ్యాంగుల హక్కుల సంఘం అధ్యక్షుడు తుడుం రాజేందర్, దివ్యాంగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షఫీ అహ్మద్‌ఖాన్, కాంగ్రెస్ నేత దేవిరెడ్డి నాగార్జునరెడ్డి, ప్రభాంజాన, సీఎస్సార్ జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## 'సర్' హెల్ప్‌డెస్క్ పరిశీలన



**ప్రజాపక్షం/అంబర్‌పేట్:** సర్ ప్రక్రియలో ప్రజలకు కలిగే అనుమానాలను నివృత్తి చేసేందుకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటైన సర్ హెల్ప్‌డెస్క్‌ను అంబర్‌పేట్ కాంగ్రెస్ ఇంచార్జి డా.రోహిన్‌రెడ్డి సందర్శించారు. ఈ మేరకు పటేల్‌నగర్ డివిజన్లో ఏర్పాటైన డెస్క్‌ను ఖైరతాబాద్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు మోత రోహిత్, అంబర్‌పేట్ డివిజన్ మాజీ కార్పొరేటర్ పులి జగన్‌లతో కలిసి రోహిన్‌రెడ్డి హెల్ప్‌డెస్క్ పనితీరును పరిశీలించి పార్టీ కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పటేల్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు రాఘవేంద్రరాజు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎం.శ్యామ్, షేక్ అలీం, శ్రీనివాస్‌రెడ్డి, మహమ్మద్ ఇనాయత్ అలీ, మొహమ్మద్ షబాజ్ ఆలం, మొహమ్మద్ అబ్దుల్ ఫరీద్, రాగుల వీరేశం తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్‌గాంధీని కోరుకుంటున్నారు



**ప్రజాపక్షం/వెంగళరావునగర్:** దేశ ప్రజలు రాహుల్ గాంధీ నాయకత్వాన్ని కో రుకుంటున్నారని ఏఐసీసీ జాతీయ కోఆర్డినేటర్ డా.పివి రవిశేఖర్‌రెడ్డి అన్నారు. వెంగళరావునగర్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 2029 సార్వత్రిక ఎన్నికల తర్వాత దేశానికి నాయకత్వం వహించే భాద్యతను భారత ప్రజలు రాహుల్‌గాంధీకి అప్పగిస్తారని ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. ఢిల్లీలో ప్రధాని ఇంటి ముందు ధర్నా, పోలీసుల దాడిలో ముక్కు మీద గాయమైనా, కిందపడి బట్టలు బురదమయమైనా లెక్కచేయకుండా ధైర్యంతో రాహుల్‌గాంధీ ముందుకు సాగారని కొనియాడారు.

## అన్ని రంగాలలో దేశం ముందు ఉండాలనిమోదీ కార్యాచరణ



**ప్రజాపక్షం/సికింద్రాబాద్:** దేశం అన్ని రంగాలలో ముందు ఉండాలని ప్రధాని నరేంద్ర మోడీ కార్యాచరణ రూపొందించి అమలు చేస్తున్నారని మహంకాళి బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి తెలిపారు. ఈ మేరకు ఆయన మన్ కి బాత్ కార్యక్రమంలో మోడీ మాట్లాడిన అంశాలను చర్చించారు. కార్యక్రమంలో సాయిదత్తు, మేకల కీర్తి, బిక్షపతి, శ్యామ్, నాగరాణి, యాదమ్మ, బాలయ్య, కనకయ్య, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## సమష్టిగా పాటుపడదాం



**ప్రజాపక్షం/బోరబండ:** సమస్యల పరిష్కారం కోసం సమిష్టిగా పాటుపడాలని కళ్యాణ్‌నగర్ కాలనీ కమిటీ ఆదివారం సమావేశం నిర్వహించి విస్తృతంగా చర్చించింది. ఈ సందర్భంగా కాలనీలో తీవ్రంగా ఉన్న తాగునీటి సమస్య, డ్రైనేజీ సమస్యలు, అక్రమ పార్కింగ్, ఇంకుడు గుంతల ఏర్పాటు, పార్కుల మరమ్మతులు, రహదారుల నిర్వహణ, పారిశుద్ధ్యం తదితర అంశాలపై సభ్యులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. సమావేశంలో ప్రముఖ సంఘ సేవకుడు కళ్లెం శ్రీనివాస్‌రెడ్డి, కంజర్ల సదాశివ యాదవ్, జవహర్, రాజేంద్రపటేల్, నరేందర్, భూమేష్, తిరుపతిరెడ్డి, కాసుల శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

## దుర్గమ్మకు బంగారు బోనం



**ప్రజాపక్షం/చార్మినార్:** విజయవాడ కనకదుర్గ అమ్మవారికి భాగ్యనగర్ ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ఆధ్వర్యంలో బంగారు బోనం సమర్పించారు. అమ్మవారికి నైవేద్యం, వడిబియ్యం, పట్టు వస్త్రాలు అందించడం జరిగింది. ఆంధ్రప్రదేశ్ దేవాదాయ ధర్మాదాయ శాఖ సహకారంతో జరిగిన కార్యక్రమంలో డప్పు వాయిద్యాలతో పోతురాజుల ఆటలతో అంగరంగ వైభవంగా ఉమ్మడి దేవాలయాల అధ్యక్షుడు మలయాళ మధుసూదన్ యాదవ్ ఆధ్వర్యంలో బోనం సమర్పించారు.

## సాయి సప్తాహ వేడుకలు

**ప్రజాపక్షం/సికింద్రాబాద్:** సాయి వ్యాధి నివారణ ఆశ్రమంలో గురు పౌర్ణమి సాయి సప్తాహ వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ మేరకు పద్మారావునగర్‌లోని సాయి ఆలయంలో వేడుకల్లో భాగంగా ఆదివారం ఆశ్రమ ఆవరణలో సామూహిక సాయి వ్రతాలు, నరసింహ స్వామి సేవా కార్యక్రమాలను పూజారులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలతో పాటు అన్నప్రసాద వితరణ జరిగింది.

## అన్నప్రసాద వితరణ



**ప్రజాపక్షం/సికింద్రాబాద్:** రోడ్ల పక్కన, ఫుట్‌పాత్‌లపై జీవిస్తున్న అనాథలు, నిరాశ్రయుల ఆకలి తీర్చడమే లక్ష్యంగా స్కయి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం 305వ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆకలితో అలమటిస్తున్న నిరుపేదలకు కనీసం ఒక్కపూటైనా పోషకాహారాన్ని అందించాలనే సంకల్పంతో ప్రతి నెలా రెండవ, నాలుగవ ఆదివారాల్లో క్రమం తప్పకుండా ఈ సేవలను అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో స్కయి ఫౌండేషన్ ఫౌండర్, ప్రెసిడెంట్ డాక్టర్ వై.సంజీవకుమార్, వైస్ ప్రెసిడెంట్ ఓ.పావని, ప్రతినిధి అగస్య తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారి ఘటం ఊరేగింపు



**ప్రజాపక్షం/అంబర్‌పేట్:** మహంకాళి అమ్మవారి ఘటం ఊరేగింపుతో అంబర్‌పేట్‌లో ఆదివారం బోనాల జాతర అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మోర పండిత్ ముదిరాజ్ అమ్మవారి ఘటాన్ని తలపై ఎత్తుకొని భాజా భజంత్రీల నడుమ ఊరేగింపుగా ముందుకు సాగారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు పద్మావతి రెడ్డి, పద్మరెడ్డి, వెంకటరెడ్డి, అంబర్‌పేట్ దేవస్థాన సేవా సమితి ప్రతినిధులు పంజాల జ్ఞానేశ్వర్‌గౌడ్, కుచ్చులకంటి దుర్గ ప్రసాద్‌రెడ్డి, గడ్డం లక్ష్మణ్‌గౌడ్, వై.శంకర్‌గౌడ్, బిందిమల్లికార్జునగౌడ్, రంగంపల్లి రాజు, గడ్డం శ్రీధర్ గౌడ్, సిహెచ్ సుధాకర్, చింతల శ్రీనివాస్ ముదిరాజ్, తోలుపునూరి కృష్ణ గౌడ్, కోటం అనిల్ కుమార్, సత్తిబాబు గౌడ్, అచ్చిని మహేష్ తదితరులు పాల్గొన్నారు. సికింద్రాబాద్ జోన్ అడిషనల్ కమిషనర్ జే నరసయ్య పర్యవేక్షణలో అంబర్‌పేట్ సిఐ కిరణ్‌కుమార్ భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు.

## విద్యుత్ స్తంభాలు తొలగించండి



**ప్రజాపక్షం/లాల్‌దర్వాజా:** రోజుకు లక్షల్లోనే అక్కడి రహదారిలో ప్రజల రాకపోకలు ఉంటాయి. అక్కడి నుంచి ఉప్పుగూడ రైల్వేస్టేషన్, కందికల్ రోడ్డు, లాల్‌దర్వాజా, గౌలిపుర, రాజన్నబౌలి తదితర ప్రాంతాలకు వెళ్లేవారు ఈ రహదారిని వినియోగిస్తారు. ఈ క్రమంలోనే రద్దీ అధికంగా ఉండే ఈ చత్రినాకా చౌరస్తా తరచుగా ట్రాఫిక్‌జామ్‌లు తప్పడం లేదు. పొరపాటు అంబులెన్స్ వచ్చిందంటే వేచిచూడాల్సిన దుస్థితి నెలకొంటుందని స్థానికులు వాపోతున్నారు. ఈ క్రమంలోనే చత్రినాక చౌరస్తాలో ఇనుప విద్యుత్ స్తంభాలు, ముండ్ల కంచె ఏర్పాటు కావడంతో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోంది. ఏదేమైనా విద్యుత్ స్థంభాలతో పాటు ముళ్లకంచెను వెంటనే తొలగించి అక్కడ రోడ్డు వేయాలని స్థానికులు కోరుతున్నారు.

## కొమురవెల్లికి తరలిన యాదవ సంఘం నేతలు



**ప్రజాపక్షం/నల్లకుంట:** కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చేతుల మీదుగా జరిగిన కొమురవెల్లి రైల్వేస్టేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి నల్లకుంట డివిజన్ నుంచి యాదవ సంఘం నాయకులు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. గ్రేటర్ హైదరాబాద్ యాదవ సంఘం ప్రధాన కార్యదర్శి ఎం.మధుసూదన్ యాదవ్ ఆధ్వర్యంలో నాయకులు భాస్కర్ యాదవ్, శిరీష, రవియాదవ్, నర్సింగ్ యాదవ్, సునీల్ యాదవ్, శ్రవణ్ యాదవ్, నవీన్ యాదవ్, మురళి యాదవ్, భాస్కర్ యాదవ్ కొమురవెల్లికి తరలినవారిలో ఉన్నారు.

# ఇది ఆరంభం మాత్రమే

### విమర్శలు, సందేహాలు ఉన్నప్పటికీ ఉద్యమానికి అండగా నిలిచిన వారికి అభిజీత్ దీప్కే ధన్యవాదాలు

### 'ఎక్స్' వేదికగా వీడియో పోస్ట్



**న్యూఢిల్లీ :** నీట్ పేపర్ లీక్ వివాదం వేళ ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడంలో కీలక పాత్ర పోషించిన తమ మద్దతుదారులకు కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే కృతజ్ఞతలు తెలిపారు. 37 రోజుల పాటు సాగిన తమ ఆందోళనలకు మద్దతు అందించడం వల్లే యువతకు ఈ భారీ విజయం సాధ్యమైందని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఒక వీడియో పోస్ట్ చేశారు. ఈ సుదీర్ఘ పోరాటం తమ బృందానికి ఎంతో సవాలుతో కూడుకున్నదని చెప్పారు. విమర్శలు, సందేహాలు ఉన్నప్పటికీ ఉద్యమానికి అండగా నిలిచిన వారికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. అనేక వారాలుగా నిరంతర కార్యకలాపాల తర్వాత తాను ఎట్టకేలకు హాయిగా విశ్రాంతి తీసుకోగలిగానని అన్నారు. అయితే, ఆందోళనలు విరమించడంతో ఉద్యమం ముగిసినట్లు కాదని, ఇది కేవలం ఆరంభం మాత్రమేనని అభిజీత్ దీప్కే చెప్పారు. 'ఇప్పుడు చాలా సంతోషంగా ఉంది. ఎట్టకేలకు నేను ప్రశాంతంగా నిద్రపోగలిగాను. 'తర్వాత ఏం చేయాలి?', 'ఈ సాయంత్రానికి ఏం జరుగుతుందో, జరగదో' అనే ఆందోళన లేకుండా నా బెడ్‌రూమ్‌లో నిద్రలేచాను. ఇప్పుడు ఎలాంటి ఆందోళన లేదు. గత 37 రోజుల్లో మేము ఎదుర్కొన్న పరిస్థితులు నిజంగా చాలా కష్టమైనవి. ఇది నాకు మాత్రమే కాదు, మా బృందం మొత్తానికి ఏమాత్రం సులభం కాదు. అందరూ మమ్మల్ని సందేహిస్తున్న సమయంలో మాకు మద్దతునిచ్చిన, మాపై నమ్మకం ఉంచిన ప్రజలందరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు. మీ మద్దతు లేకపోతే ఇది సాధ్యమయ్యేది కాదు. శనివారం జంతర్ మంతర్ వద్ద కృతజ్ఞతలు చెప్పడానికి వేచి ఉన్న వారందరినీ నేను కలవలేకపోయాను. దీనికి నేను నిజంగా క్షమాపణలు కోరుతున్నాను. ఎందుకంటే నాకు టైఫాయిడ్ తీవ్రమైన జ్వరం ఉంది. అందుకే నేను ఇంటికి రావాల్సి వచ్చింది. ఈ దేశం కోసం మీరు చేసిన పనిని నేను నిజంగా అభినందిస్తున్నాను. మీ అందరినీ నేను ఎంతో ప్రేమిస్తున్నాను. మీరు లేకపోతే మేము దీనిని సాధించలేకపోయేవాళ్లం. మీ అందరికీ సెల్యూట్. మీరు మమ్మల్ని విమర్శించకపోయి ఉంటే, మమ్మల్ని ప్రశ్నించకపోయి ఉంటే, బహుశా మేము మమ్మల్ని మేము మెరుగుపరచుకునే అవకాశం పొందేవాళ్లం కాదు. మీ విమర్శలు, ప్రశ్నల వల్లే మేము మమ్మల్ని మెరుగుపరచుకోగలిగాము. అందుకే మేము ఆశించిన ఫలితాలను సాధించగలిగామని నేను భావిస్తున్నాను. నేను మొదటి నుంచి చెబుతున్నట్లుగా ఇది కేవలం ఆరంభం మాత్రమే. 'కాక్రోచ్ జనతా పార్టీ'కి ఇంకా సుదీర్ఘ ప్రయాణం ఉంది, కచ్చితంగా మేము చాలా దూరం వెళ్తాము. ఇది కేవలం ఆరంభం మాత్రమే' అని అభిజీత్ దీప్కే పేర్కొన్నారు.

# జంతర్‌మంతర్ వద్ద 'నిశ్శబ్దం'

### 36రోజుల తర్వాత సద్దుమణిగిన నిరసనోద్యమ యుద్ధం



**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద 36 రోజులుగా నిరవధికంగా కొనసాగిన విద్యార్థులు, యువజనుల నిరసనల యుద్ధ వాతావరణం ఎట్టకేలకు శనివారం కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో ఆదివారం ఆ ప్రాంగణం అంతా సద్దుమణిగి ప్రశాంతత నెలకొంది. నెలరోజులకు పైగా మిన్నుముట్టే నినాదాలు, ఉద్రేకపూరిత ఉపన్యాసాలు, పోలీసుల బూట్ల చప్పుళ్లు, నిరసనకారుల శరీరాలపై లాఠీల మోతలు, టియర్‌గ్యాస్ ప్రయోగాలు, పోలీసులు, నిరసనకారుల పరస్పర రాళ్లదాడులు, కన్నీటి రోదనలు హఠాత్తుగా ఆగిపోయాయి. జంతర్‌మంతర్ ప్రాంగణంలో ప్రస్తుతం ప్రశాంతతతో కూడిన నిశ్శబ్దం రాజ్యమేలుతోంది. కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే, పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్‌వాంగ్‌చుక్‌ల నిరసన శిబిరానికి బిజెపి మినహా అన్ని రాజకీయ పార్టీలు, విద్యార్థి, యువజన సంఘాలు, సినీ ప్రముఖులు సంఘీభావం తెలపడం, ముఖ్యంగా జెన్–జీ పోటెత్తడంతో కేంద్ర ప్రభుత్వం తలొంచి పంతానికి ముగింపు పలికింది. అభిజీత్ దీప్కే టైఫాయిడ్ నుంచి ఇంటిలో కోలుకోగా, సోనమ్ వాంగ్‌చుక్ హాస్పిటల్‌లో కోలుకున్నారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన ఒకరోజు అనంతరం ఆదివారం నాడు దేశ రాజధాని నడిబొడ్డున విస్తరించి ఉన్న జంతర్ మంతర్ వద్ద ఇప్పుడు నిరసనకారుల తాత్కాలిక గుడారాలు మాయం కావడం, ఈ నిరసనోద్యమానికి మద్దతుగా దేశవ్యాప్తంగా నలుదిక్కుల నుంచి తరలివచ్చిన స్వచ్ఛంద కార్యకర్తలు, మద్దతుదారులు, విద్యార్థులు, యువకులు అందరూ ఇంటి దారి పట్టడంతో ఆ ప్రాంగణం నిర్మానుష్యంగా కనిపిస్తోంది. దీంతో ఆ ఆందోళనకు సంబంధించిన ఆనవాళ్లు దాదాపుగా కనుచూపుమేరలో కనబడకుండాపోయాయి. ఢిల్లీలో 16 మెట్రో రైల్ స్టేషన్ల మూసివేత, బస్సుల రద్దీ ఇక్కట్లతో అష్టకష్టాలు పడ్డ ఢిల్లీ ప్రజలు ఇప్పుడు ఊపిరి పీల్చుకుంటున్నారు. ఈ నిరసనోద్యమాన్ని నిర్వహించిన కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే సిరల ద్రవాలు స్వీకరిస్తున్న ఫోటో షేర్‌చేయడం, అలాగే నెలరోజులకు పైగా నిర్వహించిన అవిశ్రాంత ప్రచారం, అనిశ్చితి అనంతరం తాను ప్రశాంతంగా నిద్రపోయాననే ఒక వీడియో సందేశాన్ని ఆయన పంచుకోవడం దేశవ్యాప్తంగా ప్రజలు ఆయన అలుపెరుగని ఉద్యమంపై సంభాషించుకోవడానికి దారితీసింది. 'ఈ రకమైన అనుభూతి చాలా బాగుంది. ఈ రోజు, చివరికి, తర్వాత ఏం చేయాలో లేదా సాయంత్రం వరకు ఏం జరుగుతుందో అని ఆలోచించకుండా పడకగదిలో హాయిగా నిద్రపోగలిగాను, ఎలాంటి ఆందోళనా లేదు' అని దీప్కే చెప్పారు. ఢిల్లీలో జూన్ 20న జంతర్‌మంతర్ వద్ద ప్రారంభమైన ఈ నిరసన, జులై 20న ప్రదర్శనకారులపై పోలీసుల చర్యల తర్వాత నిరసనోద్యమం తీవ్ర రూపం దాల్చింది. ఆ తర్వాత ఈ ఉద్యమానికి సంఘీభావంగా సుదీర్ఘ నిరాహారదీక్ష చేపట్టిన సోనమ్ వాంగ్‌చుక్‌తో సహా పలు విద్యార్థి సంఘాలు, హక్కుల కార్యకర్తల మద్దతును కూడగట్టింది. నీట్ పరీక్ష పేపర్ లీకేజీ అనంతరం ఆత్మహత్య చేసుకున్నారని ఆరోపణలు ఎదుర్కొంటున్న విద్యార్థుల కుటుంబాలకు పరిహారం చెల్లించడం, నిరసనకారులపై దాఖలు చేసిన ఎఫ్ఐఆర్‌లను ఉపసంహరించుకోవడం సహా తమ అన్ని డిమాండ్లకు ప్రభుత్వం అంగీకరించిన తర్వాత, తమ ఆందోళనను విరమించుకోవడం జరుగుతున్నదని శనివారం సాయంత్రం కాక్రోచ్ జనతా పార్టీ ప్రకటించింది. గడిచిన 36 రోజులు 'నిజంగా, చాలా కష్టంగా గడిచాయని' దీప్కే వ్యాఖ్యానించారు. తమ ప్రచారంపై సందేహాలు ఉన్నప్పటికీ, కొత్తగా ఏర్పడిన ఈ బృందానికి అండగా నిలిచినందుకు దేశవ్యాప్తంగా ఉన్న మద్దతుదారులకు సిజెపి వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ధన్యవాదాలు తెలిపారు. ఈ ప్రచారాన్ని 'ఆరంభం మాత్రమే'నని పేర్కొంటూ, సిజెపి ఇంకా 'చాలా దూరం ప్రయాణించాల్సి ఉంది' అని అభిజీత్ దీప్కే తాజాగా ప్రకటించారు. కాగా జంతర్‌మంతర్ వద్ద సాధారణ ప్రక్షాళనను పునరుద్ధరించడానికి మున్సిపల్ కార్మికులు రంగంలోకి దిగారు. జంతర్ మంతర్ వద్ద, దాని పరిసర ప్రాంగణాలలో న్యూఢిల్లీ మున్సిపల్ కౌన్సిల్ (ఎన్‌డిఎంసి) 24గంటలూ కొనసాగే భారీ పారిశుద్ధ్య మెరుగుదల కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇందుకోసం 100మందికి పైగా పారిశుద్ధ్య కార్మికులు, భారీ వాహనాలు, యాంత్రిక పరికరాలను మోహరించింది. నిరసన తర్వాత మిగిలిపోయిన దాదాపు 60 మెట్రిక్ టన్నుల నిరుపయోగ వ్యర్థాలను తొలగించారు. మధ్యాహ్నానికల్లా దాదాపు 52 మెట్రిక్ టన్నుల వ్యర్థాలను ఇప్పటికే తొలగించినట్లు అధికారులు తెలిపారు.'నిరసనకారులు చెదిరిపోయిన తర్వాత జంతర్‌మంతర్ ప్రాంగణాన్ని పునరుద్ధరించేందుకు ప్రెజర్–జెట్టింగ్ మెషీన్లతో రోడ్లను శుభ్రం చేస్తున్నారు. నిరసన నినాదాలు ఉన్న గోడలకు తిరిగి రంగులు వేస్తున్నారు. దెబ్బతిన్న ఫుట్‌పాత్, కర్బ్ స్టోన్స్‌కు మరమ్మతులు చేస్తున్నారు' అని ఒక ఎన్‌డిఎంసి అధికారి వివరించారు.

## నియంతృత్వ ధోరణితో ఎవరూ ఏదీ సాధించలేరు

### అన్నా హజారే



**న్యూఢిల్లీ :** కేంద్ర విద్యాశాఖ మాజీ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై సామాజిక కార్యకర్త అన్నాహజారే స్పందించారు. ప్రజాస్వామ్య ప్రభుత్వంలో సమస్యలను పరిష్కరించడానికి చర్చలు మాత్రమే సరైన మార్గమని పేర్కొన్నారు. ఉద్రిక్తతలు సృష్టించడంతో, నియంతృత్వ ధోరణితో ఏమీ సాధించలేమని అన్నారు. ఇప్పటివరకు తాను 22 సార్లు నిరాహార దీక్ష చేశానని, ఎన్నడూ హింసను ఆశ్రయించలేదని అన్నారు. శాంతియుత ఆందోళనలే శాసనపరమైన మార్పులు తీసుకురావడానికి దోహదపడ్డాయన్నారు. తాను చేపట్టిన శాంతియుత నిరసనల కారణంగా 10 చట్టాలు అమల్లోకి వచ్చినట్లు వెల్లడించారు. ప్రభుత్వాలు పౌరుల మాట వినాలని, ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాలని హజారే సూచించారు. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం రెండు అడుగులు ముందుకు వేయాల్సి వచ్చినా అందులో ఏ తప్పూ ఉండబోదని పేర్కొన్నారు. మన నిర్ణయాలు ప్రజాప్రయోజనాలకు అనుగుణంగా ఉండటమే ముఖ్యమన్నారు. మంత్రుల రాజీనామా వంటి డిమాండ్లను సైతం శాంతియుత పద్ధతిలో సాధించుకోవాలని తెలిపారు. హింసాత్మక నిరసనల కంటే శాంతియుత నిరసనలు, చర్చలే ప్రజల్లో పాలనలో మార్పు తీసుకువస్తాయన్నారు.

### రక్షణ ఉత్పత్తులు, ఎగుమతుల్లో

# కొత్త శిఖరాలకు భారత్

### 'మన్ కీ బాత్'లో ప్రధాని మోదీ

**న్యూఢిల్లీ :** భారత్ ఒక విశ్వసనీయమైన ప్రపంచ రక్షణ భాగస్వామిగా ఎదుగుతోందని నరేంద్ర మోదీ తెలిపారు. దేశం తన రక్షణ సామర్థ్యాలను బలోపేతం చేసుకుంటూనే ఉందన్నారు. అలాగే యావత్ దేశం 'కార్గిల్ విజయ్ దివస్' జరుపుకుంటున్న సందర్భంగా కార్గిల్ యుద్ధంలో శత్రువులతో వీరోచితంగా పోరాడిన భారత సైనికులకు ఘన నివాళులు అర్పించారు. 1999లో పాకిస్థాన్‌తో జరిగిన సంఘర్షణలో కఠిన వాతావరణ పరిస్థితులు, శత్రువు నుంచి సవాళ్లు ఎదురైనప్పటికీ దేశ సైనికులు అసాధారణ ధైర్యాన్ని ప్రదర్శించారని కొనియాడారు. కార్గిల్ విజయ్ దివస్ దేశానికే గర్వకారణమని పేర్కొన్నారు. అత్యంత క్లిష్ట పరిస్థితుల్లోనూ సాయుధ దళాలు ప్రదర్శించిన అసాధారణ ధైర్యసాహసాలను కార్గిల్ విజయ్ దివస్ అందరికీ గుర్తుచేస్తుందని అన్నారు. ఆదివారం ప్రసారమైన 136వ 'మన్ కీ బాత్' ఎపిసోడ్‌లో మోదీ ఈ మేరకు వ్యాఖ్యానించారు. 'నేడు రక్షణ ఉత్పత్తులు, ఎగుమతులు, మిత్ర దేశాలతో రాజకీయ సహకారం ఇలా ఏ రంగంలోనైనా భారత్ నిరంతరం కొత్త శిఖరాలను చేరుకుంటోంది. జులై ప్రారంభంలో నేను ఇండోనేసియాలో పర్యటించాను. అప్పుడు



బ్రహ్మోస్, ఆస్ట్రా క్షిపణుల కోసం ఇండోనేసియాతో ఒక కీలక ఒప్పందం కుదిరింది. భారత్ బ్రహ్మోస్, ఆస్ట్రా క్షిపణులను ఇండోనేసియాకు భారత్ సరఫరా చేస్తుంది. దేశ రక్షణ పరికరాలు, సాంకేతికతపై ప్రపంచానికి విశ్వాసం పెరుగుతోంది' అని అన్నారు. ఈనెలలో డిఆర్‌డిఓ పినాకా దీర్ఘశ్రేణి గైడెడ్ రాకెట్‌ను విజయవంతంగా పరీక్షించిందని ప్రధాని మోదీ గుర్తు చేశారు. ఈ విజయం వెనుక భారత శాస్త్రవేత్తలు, ఇంజనీర్ల సమష్టి కృషి ఉందని అభిప్రాయపడ్డారు. కొన్ని రోజుల క్రితం ఐఎన్ఎస్ మహేంద్రగిరిని భారత నౌకాదళంలోకి ప్రవేశపెట్టారని హర్షం వ్యక్తం చేశారు. ఈ ఏడాది జులై 4న ప్రారంభించిన దేశవ్యాప్త 'క్యాచ్ ది రెయిన్' ప్రచారం గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజల ఉత్సాహభరితమైన భాగస్వామ్యంతో వర్షపు నీటి సేకరణ, భూగర్భ జలాల పునరుజ్జీవనం, సంప్రదాయ జలాశయాల పునరుద్ధరణ, పెద్ద ఎత్తున మొక్కల పెంపకాన్ని ప్రోత్సహిస్తోందని ప్రధాని మోదీ అన్నారు. అలాగే గ్లాస్గోలో జరుగుతున్న కామన్వెల్త్ గేమ్స్‌లో భారత అథ్లెట్స్ అద్భుతమైన ప్రదర్శన చేసి మెడల్స్ సాధించాలని ఆకాంక్షించారు. క్రీడాకారులు పతకాలు గెలిచి దేశానికి గర్వకారణంగా నిలవాలని కోరారు.

# దేశం మీకెప్పటికీ రుణపడి ఉంటుంది

### కార్గిల్ వీరసైనికులకు రాష్ట్రపతి, ప్రధాని, రక్షణమంత్రి నివాళులు



**న్యూఢిల్లీ :** కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా ఆదివారం భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నివాళులు అర్పించారు. మాతృభూమి రక్షణ కోసం తమ ప్రాణాలను అర్పించిన పరాక్రమ యోధుల వీరోచిత పోరాటాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము స్మరిస్తూ వారికి నివాళులు అర్పించారు. 'కార్గిల్ విజయ్ దివస్' సందర్భంగా ఆమె మాట్లాడారు. 'దేశం కార్గిల్ అమరజవాన్‌లకు ఎప్పటికీ రుణపడి ఉంటుంది' అని శ్లాఘించారు. 1999 జులై 26న భారత సైన్యం 'ఆపరేషన్ విజయ్' విజయవంతమైన పరాకాష్ఠను ప్రకటించింది. కార్గిల్ లడఖ్‌లో మంచుతో నిండిన ఎత్తైన శిఖరాలపై పాకిస్థాన్ దళాలతో దాదాపు మూడు నెలల సుదీర్ఘ యుద్ధం తర్వాత విజయాన్ని ప్రకటించింది. యుద్ధంలో భారత్ సాధించిన విజయాన్ని స్మరించుకోవడానికి 'కార్గిల్ విజయ్ దివస్'గా ఈ రోజును పాటిస్తారు. కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా, మన మాతృభూమి రక్షణ కోసం ప్రాణాలు అర్పించిన పరాక్రమ యోధులకు నేను వినయపూర్వకంగా నివాళులు అర్పిస్తున్నాను' అని రాష్ట్రపతి ద్రౌపదిముర్ము హిందీ 'ఎక్స్'లో పెట్టిన పోస్ట్‌లో పేర్కొన్నారు. వారి అసమానమైన పరాక్రమం, అచంచలమైన సంకల్పం, అసమానమైన దేశభక్తి మన సైన్యం యొక్క అద్భుతమైన సంప్రదాయాలకు, ఆదర్శప్రాయమైన నమూనాలుగా నిలుస్తాయని అన్నారు. దేశం వారికి ఎప్పటికీ రుణపడి ఉంటుందని, ఆ వీరోచిత యోధుల వీరగాథ పరాక్రమం భవిష్యత్ తరానికి జాతీయసేవ, దృఢమైన కర్తవ్యం మార్గాన్ని ప్రేరేపించడం కొనసాగిస్తుందని ముర్ము తెలియజేశారు.

**వీర సైనికుల శౌర్యం దేశానికి గర్వకారణం : ప్రధాని**

దేశం కార్గిల్ విజయ్ దివస్‌ను స్మరించుకుంటున్నఅత్యంత క్లిష్టమైన పరిస్థితుల్లోనూ భారతీయ వీర సైనికులు ప్రదర్శించిన శౌర్యం ఎప్పటికీ దేశ గర్వకారణంగా నిలుస్తుందని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ కీర్తించారు. భారతదేశ భద్రత పట్ల తమ అసాధారణ ధైర్య సాహసాలు, అంకితభావాన్ని ప్రదర్శించిన వీరసైనికులకు 'కార్గిల్ విజయ్ దివస్' సందర్భంగా దేశం కృతజ్ఞతలు తెలియజేస్తున్నదని ప్రధానమంత్రి మోదీ పేర్కొన్నారు. 'అత్యంత క్లిష్టపరిస్థితులలో వారు చూపిన శౌర్యం ఎప్పటికీ జాతీయ గర్వకారణంగా నిలుస్తుంది. వారి అచంచలమైన దేశభక్తి, కర్తవ్య నిష్ఠ తరతరాలకూ స్ఫూర్తినిస్తూనే ఉంటాయి' అని ఆయన ఒక పోస్ట్‌లో పేర్కొన్నారు. ఆపరేషన్ విజయ్‌లోని వీరయోధుల ధైర్యం, త్యాగం, అచంచలమైన సంకల్పాన్ని కార్గిల్ విజయ్ దివస్ గౌరవిస్తుంది. ఇది కార్గిల్ విజయంలో భారతదేశం సాధించిన చరిత్రాత్మక విజయాన్ని స్మరించుకుంటూ, దేశ సార్వభౌమత్వాన్ని కాపాడిన స్ఫూర్తిని వేడుకగా జరుపుకుంటుంది.

**పాకిస్థాన్‌తో చర్చలు జరిగితే పిఓకే కోసమే : రాజ్‌నాథ్‌సింగ్**

ఉగ్రవాదాన్ని పాకిస్థాన్ తన రాజ్య విధానంలో ఒక భాగంగా మార్చుకోవడంపై రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ తీవ్రంగా విమర్శించారు. అలాగే, పాకిస్థాన్ అక్రమంగా ఆక్రమించుకున్న భారత భూభాగమైన పాక్ ఆక్రమిత కశ్మీర్ (పిఓకె) అంశంపై తప్ప, ఆదేశంతో మరే ఇతర చర్చలు ఉండబోవని స్పష్టంచేశారు. ఆదివారం కార్గిల్ యుద్ధ స్మారక చిహ్నం వద్ద వీరసైనికులకు నివాళులు అర్పించిన అనంతరం రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రసంగించారు. ఉగ్రవాదంతో భారతదేశాన్ని బెదిరించడానికి చేసే వారి గతిని 'ఆపరేషన్ సిందూర్' స్పష్టంగా చూపించిందన్నారు. పాకిస్థాన్ ఒడిగట్టే ఎలాంటి దుస్సాహసానికైనా 'దేశం వారి ఊహకు అందని రీతిలో ప్రతిస్పందించగలదు' అని రాజ్‌నాథ్ సింగ్ హెచ్చరించారు. ఈ సందర్భం కార్గిల్ విజయ్ దివస్ 27వ వార్షికోత్సవం కాగా, 1999లో కార్గిల్ యుద్ధంలో భారతదేశం సాధించిన విజయాన్ని రాజ్‌నాథ్ సింగ్ 'భారతమాత కిరీటంలో పొదిగిన వజ్రం'గా అభివర్ణించారు.

# మోదీ క్షమాపణలకు ప్రతిపక్షాల ఒత్తిడి


### నేడు వ్యూహాన్ని ఖరారు చేయనున్న ఇండియా కూటమి ఎంపిలు



**న్యూఢిల్లీ :** జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన చేస్తున్న విద్యార్థులపై పోలీసులు క్రూరంగా ప్రవర్తించడాన్ని ప్రతిపక్ష పార్టీలు తీవ్రంగా ఖండించాయి. ఈ అంశంపై కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్షం పార్లమెంటులో నరేంద్ర మోదీ సర్కార్‌పై ఒత్తిడి పెంచాలని భావిస్తున్నాయి. ఈ దాడికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేయనున్నట్లు ఆదివారం వర్గాలు తెలిపాయి. అయితే, రెండేళ్ల క్రితం తీసుకొచ్చిన పేపర్ లీక్ నిరోధక చట్టాన్ని సవరించే బిల్లుపై సభా వ్యూహాన్ని, వైఖరిని సోమవారం ఉదయం పార్లమెంటులోని రాజ్యసభ ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున్ ఖర్గే ఛాంబర్‌లో జరిగే ఇండియా కూటమి సమావేశంలో ఖరారు చేయనున్నట్లు వర్గాలు తెలిపాయి. కాగా, శాంతియుతంగా నిరసన చేస్తున్న విద్యార్థులపై జరిగిన 'క్రూరమైన దాడి'కి జవాబుదారీతనం కోరుతూ, పెల్లెట్ గన్‌లతో సహా 'ప్రాణాంతక బలప్రయోగం' చేయడాన్ని ఆయన ఆమోదించారా అని ప్రశ్నిస్తూ లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు లేఖ రాశారు. ఈ లేఖను కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ సామాజిక మాధ్యమంలో షేర్ చేస్తూ రాహుల్ గాంధీ అమిత్ షాను రెండు ప్రశ్నలు అడిగారని, పార్లమెంటులో ఈ కీలక ప్రశ్నలకు తప్పక సమాధానం చెప్పాలని, ప్రధాన మంత్రి విద్యార్థులకు క్షమాపణ చెప్పాలని రమేశ్ హిందీలో చేసిన పోస్ట్‌లో పేర్కొన్నారు. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను విద్యార్థుల విజయంగా కాంగ్రెస్ అభివర్ణించింది, అయితే ప్రధాన మంత్రి కూడా విద్యార్థులకు క్షమాపణ చెప్పాలని నొక్కి చెప్పింది. ఇప్పుడు మోదీ క్షమాపణ చెప్పాల్సిన సమయం ఆసన్నమైందని, అలాగే ఆందోళన చేస్తున్న విద్యార్థులపై లాఠీలు, కర్రలు, పెల్లెట్ గన్‌లను ప్రయోగించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఖర్గే అన్నారు. ప్రధాన్ రాజీనామా తర్వాత, ఆందోళన సమయంలో విద్యార్థులపై జరిగిన అకృత్యాల కారణంగా వారికి క్షమాపణ చెప్పాలని రాహుల్‌గాంధీ కూడా ప్రధాన మంత్రిని కోరారు. ఇది ముగింపు కాదు. విద్యార్థులకు ప్రధాన మంత్రి క్షమాపణ చెప్పాలని తాము ఇంకా కోరుకుంటున్నామని రమేశ్ అన్నారు. అక్రమాలకు బాధ్యులైన వారిని జవాబుదారీగా చేయాలన్న డిమాండ్‌ను ఆయన పునరుద్ఘాటించారు. పార్లమెంటు ఉభయ సభలలో నెలకొన్న ప్రతిష్టంభనను ప్రభుత్వం, ప్రతిపక్షాలు పరిష్కరించుకుంటే, ప్రశ్నపత్రం లీక్ వ్యవహారంపై తీవ్రమైన చర్చ జరిగే అవకాశం ఉంది.

# నమ్మకాన్ని నిలబెట్టుకుంటా

### విద్యాశాఖ మంత్రిగా అదనపు బాధ్యతలు చేపట్టిన ప్రహ్లాద్ జోషి



**న్యూఢిల్లీ :** కేంద్ర విద్యాశాఖ మంత్రిగా నియమితులైన ప్రహ్లాద్ జోషి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఎంతో వినయంతో ఈ బాధ్యతలను స్వీకరిస్తున్నట్లు ఎక్స్ వేదికగా వెల్లడించారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు శక్తి వంచన లేకుండా పని చేస్తానన్నారు. తనపై నమ్మకంతో కీలక బాధ్యతలు అప్పగించిన ప్రధాని నరేంద్ర మోదీకి ధన్యవాదాలు తెలిపారు. నీట్ పేపర్ లీకేజీ వ్యవహారానికి సంబంధించిన ఆందోళనలు తీవ్రమైన నేపథ్యంలో ధర్మేంద్ర ప్రధాన్ తన మంత్రి పదవికి రాజీనామా చేశారు. ఈ క్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ సలహా మేరకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము.. ప్రహ్లాద్ జోషికి విద్యాశాఖ అదనపు బాధ్యతలు అప్పగించారు. కర్ణాటకకు చెందిన ప్రహ్లాద్ జోషి.. ధార్వాడ లోక్‌సభ స్థానం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజాపంపిణీ శాఖ మంత్రిగా ఉన్న ఆయన.. ఇవాళ్టి నుంచి విద్యా శాఖ అదనపు బాధ్యతలను కూడా నిర్వర్తించనున్నారు.

# ఏ ఎన్నికల్లోనూ పోటీ చేయను...

### వయసు, ఆరోగ్య కారణాలతోనే ఈ నిర్ణయం తీసుకున్నా...

### పైగా అవినీతి రాజకీయాలు పెరిగిపోతున్నాయి: సిద్ధ రామయ్య



**న్యూఢిల్లీ :** కర్ణాటక మాజీ సిఎం, కాంగ్రెస్ సీనియర్ లీడర్ సిద్ధరామయ్య కీలక ప్రకటన చేశారు. 2028లో రాష్ట్రంలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయబోనని ప్రకటించారు. తన వయసు, ఆరోగ్యంతోపాటు అవినీతి రాజకీయాలు పెరిగిపోతుండటం కారణంగా తాను 2028 ఎన్నికల్లో పోటీ చేయడం లేదని ప్రకటించారు. అయితే, తాను రాజకీయాల్లో చురుకుగా కొనసాగుతానని, ప్రజల కష్టాలు, సంక్షేమం కోసం గళమెత్తుతూనే ఉంటానని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడైన ఆయన స్పష్టం చేశారు. మండ్య జిల్లాలోని కె.ఆర్. పేటలో శనివారం జరిగిన ఒక ప్రైవేట్ కార్యక్రమంలో ఆయన చేసిన వ్యాఖ్యలను ఎక్స్ వేదికగా వెల్లడించారు. మైసూర్‌లోని వరుణ నియోజకవర్గ ప్రజలు తనను మరోసారి ఎన్నికల్లో పోటీ చేయాలని కోరుతున్న విషయాన్ని ప్రస్తావిస్తూ, 'ఇకపై ఏ ఎన్నికల్లోనూ పోటీ చేయకూడదని నేను నిర్ణయించుకున్నాను. గతంలో నేను ఎన్నికల్లో పోటీ చేసినప్పుడు, నియోజకవర్గ ప్రజలే మాకు ఆర్థికంగా అండగా నిలిచి విజయాన్ని చేకూర్చేవారు. నేడు ఆ పరిస్థితి లేదు,' అని ఆయన అన్నారు. 'నాకు ఇప్పుడు 79 ఏళ్లు. ప్రభుత్వ పదవీకాలం ఇంకా ఏడాదిన్నర పాటు ఉంది. అప్పటికి నాకు 81–82 ఏళ్లు నిండుతాయి. నా ఆరోగ్యం ఇప్పుడున్నంత దృఢంగా ఉండకపోవచ్చు, అలాగే గతంలో ఉన్నంత ఉత్సాహంతోనూ, శక్తితోనూ పని చేయలేకపోవచ్చు' అని ఆయన అన్నారు. కాంగ్రెస్ అధిష్టానం ఆదేశాల మేరకు సిద్ధరామయ్య మే 28న ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు, తద్వారా డి.కె. శివకుమార్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టేందుకు మార్గం సుగమమైంది. రాజీనామా అనంతరం, కాంగ్రెస్ అధిష్టానం ఆఫర్ చేసిన రాజ్యసభ సీటును తాను సున్నితంగా తిరస్కరించానని సిద్ధరామయ్య చెప్పారు. జాతీయ రాజకీయాలపై తనకు ఆసక్తి లేదని, రాష్ట్ర రాజకీయాల్లోనే కొనసాగుతానని ఆయన స్పష్టం చేశారు. 2028 నాటికి తనకు 82 ఏళ్లు నిండుతాయని పేర్కొన్న సిద్ధరామయ్య, అప్పటికి ప్రజా జీవితంలో తాను 50 ఏళ్లు పూర్తి చేసుకుని ఉంటానని చెప్పారు. 'నేను 1978లో తాలూకా బోర్డు సభ్యుడిగా నా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించాను. నేను గెలుపోటములు రెండింటినీ చూశాను, కానీ నేను నమ్మిన సూత్రాలకు విరుద్ధంగా ఎప్పుడూ వ్యవహరించలేదని లేదా నా అంతరాత్మకు ద్రోహం చేయలేదన్న సంతృప్తి నాకు ఉంది' అని ఆయన అన్నారు.

# 'ఓట్లను దొంగిలించొచ్చు...ప్రజలను కాదు'

### ప్రధానికి విద్యార్థులు నిరూపించారు: ఉద్ధవ్ థాక్రే



**ముంబై:** ప్రశ్నాపత్రం లీక్ వ్యవహారంపై దేశవ్యాప్తంగా విద్యార్థులు చేపట్టిన ఆందోళనలు బిజెపికి వ్యతిరేకంగా మరింత పెద్ద పోరాటానికి నాంది అని శివసేన (బిటి) అధినేత ఉద్ధవ్ థాక్రే అన్నారు. ''ఓట్లను దొంగిలించవచ్చు కానీ ప్రజలను దొంగిలించలేరు'' అనే విషయాన్ని విద్యార్థులు ప్రధాని నరేంద్ర మోదీకి నిరూపించారని వ్యాఖ్యానించారు. ముంబైలోని శివాజీ పార్క్‌లో ఆదివారం నిర్వహించిన 'తిరంగా' ర్యాలీలో ఆయన ప్రసంగించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను ప్రజాస్వామ్య విజయంగా జరుపుకునేందుకు భారీ సంఖ్యలో యువత, ముఖ్యంగా కళాశాల విద్యార్థులు, జాతీయ జెండాలు, భారత రాజ్యాంగ ప్రతులు, పోస్టర్లతో ర్యాలీలో పాల్గొన్నారు. ఉదయం నుంచి చిరు జల్లులు కురుస్తున్నప్పటికీ, రెయిన్‌కోట్లు, గొడుగులతో వచ్చిన యువత భారత రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్రాలతో పాటు దేశవ్యాప్తంగా నిరసనల్లో వైరల్ అయిన సామాజిక మాధ్యమాల మీమ్స్‌ను ప్రదర్శించారు. జులై 22న ఢిల్లీలో విద్యార్థులపై పోలీస్ చర్య అనంతరం మహారాష్ట్రలోని అనేక ప్రాంతాల్లో నిరసనలు కొనసాగగా... వాటికి ముంబైలోని శివాజీ పార్క్ ప్రధాన కేంద్రంగా మారింది. ఉద్ధవ్ థాక్రే మాట్లాడుతూ... దేశ ప్రజాస్వామ్య చరిత్రలో యువత ఒక సువర్ణ అధ్యాయాన్ని లిఖించిందని, వారి ఐక్యతతో ప్రారంభమైన ఉద్యమం దేశవ్యాప్త ప్రజా ఉద్యమంగా మారిందని అన్నారు. ''ఎన్నికలు జరగడానికి ఇంకా వడేళ్లు ఉండగా ఎందుకు వాటి గురించి మాట్లాడుతున్నారని కొందరు అడుగుతున్నారు. సమాధానం ఒక్కటే. ఓట్లను దొంగిలించవచ్చు కానీ ప్రజలను కాదు అనే విషయాన్ని ప్రధాని మోదీ ఇప్పుడు గ్రహించారు'' అని వ్యాఖ్యానించారు. ఇది మరింత పెద్ద పోరాటానికి ఆరంభం... బిజెపికి, భారతదేశానికి మధ్య జరుగుతున్న పోరాటం అని పేర్కొన్నారు. ''దేశంపై దృష్టి పెట్టాల్సిన సమయం వచ్చింది. మీ మంత్రులు రాజకీయ పార్టీలను చీల్చడంలో బిజీగా ఉన్నారు. వారిని దేశం కోసం పని చేయమని చెప్పండి'' అని ప్రధాని మోదీని ఉద్దేశించి థాక్రే అన్నారు. యువతను ఉద్దేశించి, ''ఈ చైతన్యం చల్లారిపోనివ్వకండి. అధికారంలో ఉన్నవారి అహంకారాన్ని సహించకండి. ప్రజల శక్తి ఏమిటో మీరు నిరూపించారు. ఇకపై ఈ దేశాన్ని ఎవరూ బలహీనపరచకుండా చూడండి'' అని పిలుపునిచ్చారు. ప్రభుత్వంపై మరోసారి విమర్శలు గుప్పించిన ఉద్ధవ్... రూపాయి విలువ పడిపోవడం, కానీ ప్రశ్నాపత్రం లీక్ వల్ల కలిగే ప్రయోజనాలు మాత్రం వివరిస్తారని ఎద్దేవా చేశారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ దేశ సరిహద్దులను కాపాడాల్సిందిపోయి ధర్మేంద్ర ప్రధాన్‌ను సమర్థిస్తున్నారని మండిపడ్డారు. కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీపై కూడా వ్యంగ్యంగా స్పందిస్తూ...గుంతల మంత్రి ఇప్పుడు ఎథనాల్ (ఈ20 పెట్రోల్) గురించి మాట్లాడుతున్నారన్నారు. ఎంఎన్ఎస్ అధినేత రాజ్ థాక్రే మాట్లాడుతూ, విద్యార్థుల ఉద్యమం విజయవంతం కావడం ద్వారా జెన్ జెడ్ తరం కూడా ప్రభుత్వాన్ని సవాలు చేయగలదని నిరూపితమైందన్నారు. ర్యాలీ సందర్భంగా శాంతిభద్రతలు కాపాడిన ముంబై పోలీసులకు ఆయన కతజ్ఞతలు తెలిపారు. ఢిల్లీలో నిరసనకారులపై జరిగిన పోలీసు చర్యలను ప్రస్తావిస్తూ... ''మహారాష్ట్ర పోలీసులకు, ఢిల్లీ పోలీసులకు మధ్య తేడా దేశం చూసింది'' అని అన్నారు. ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, నిరసనకారులకు సంఘీభావం తెలిపేందుకే వచ్చామని, ఇది ప్రజాస్వామ్య విజయమని పేర్కొన్నారు. శివసేన (బిటి) ఎమ్మెల్యే ఆదిత్య థాక్రే మాట్లాడుతూ, త్రివర్ణ పతాకాలతో ముంబై ప్రజలు ఏకగళంగా తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారని అన్నారు.

''నియంత వణికిపోయాడు. ఇదే యువత శక్తి. వారికి ఎవరూ చెప్పాల్సిన అవసరం లేదు. వారికి ఏమి కావాలో వారికి తెలుసు. ముంబై నుంచి అపూర్వ స్పందన లభించింది'' అని చెప్పారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్), నియోజకవర్గాల పునర్విభజన (డిలిమిటేషన్) అంశాలపైనా యువత ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. ''వ్యవస్థకు వ్యతిరేకంగా యువశక్తి శాంతియుతంగా, ఐక్యంగా పోరాడి తన బలాన్ని చాటింది'' అని ఆయన అన్నారు.

# ఇజ్రాయెల్ మాయలో పడితే యుద్ధం ఇంకా విస్తరణ

- రాబోయే అన్ని పరిణామాలకు మేం సిద్ధం
- ట్రంప్‌కు ఇరాన్ హెచ్చరిక



**టెహ్రాన్:** ఇరాన్‌పై దాడులు కొనసాగిస్తే యుద్ధం ఇంకా విస్తరిస్తుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఇరాన్ తీవ్ర హెచ్చరిక చేసింది. ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూ మంగళవారం (జులై 28) వాషింగ్టన్ పర్యటనకు వెళ్లనున్న నేపథ్యంలో దానికి ముందుగా ఇరాన్ సైనిక ప్రతినిధి మొహమ్మద్ అక్రమినియా ప్రభుత్వ టెలివిజన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. ఇజ్రాయెల్ చేతుల్లో మోసపోవద్దని, ఆ దేశం వలలోపడి వారి ఒత్తిడికి లొంగి ఇరాన్‌పై దాడులు కొనసాగిస్తే యుద్ధం మరింత తీవ్రస్థాయిలో విస్తరిస్తుందన్నారు. రాబోయే అన్ని పరిణామాలను ఎదుర్కొనేందుకు ఇరాన్ సిద్ధంగా ఉందని చెప్పారు. నెతన్యాహూ రాబోయే మంగళవారం వైట్ హౌస్‌లో ట్రంప్‌ను కలుస్తారని ఇజ్రాయెల్ ప్రభుత్వం గడచిన శుక్రవారం ప్రకటించింది.
పశ్చిమాసియాలో కేవలం హోర్ముజ్ జలసంధిలోనే జరుగుతున్న యుద్ధం ఇప్పుడు హౌతీ దాడులతో ఎర్ర సముద్రంలోకి కూడా విస్తరించిన దశలో ట్రంప్ ఒక ప్రకటన చేస్తూ చర్చల ప్రక్రియ తెర వెనుక కొనసాగుతోందని, కానీ ఒప్పందం చేసుకోవడానికి ఇరాన్ సిద్ధంగా లేదని వ్యాఖ్యానించిన పూర్వరంగంలో ఇరాన్ నుండి ఈ హెచ్చరిక వెలువడింది. ఐతే పశ్చిమాసియా యుద్ధంలోకి బెంజమిన్ నెతన్యాహూ తన స్వప్రయోజనాలకోసం దాడులు చేయమని ఒత్తిడిచేసి బలవంతంగా ఈ యుద్ధంలోకి ట్రంప్‌ను లాక్కొచ్చారని ఫిబ్రవరి నెలాఖరు నుండి వార్తలు వెలువడుతున్నాయి. ఐతే తాము ఉమ్మడిగా ఈ దాడులు చేశామని ట్రంప్ చెప్పినప్పటికీ, నెతన్యాహూ ప్రోద్బలమే తెర వెనుక ఎక్కువగా ఉందని ప్రపంచవ్యాప్తంగా మీడియాలో ప్రచారమైంది. ''మీరు మళ్లీ జియోనిస్టుల మాయలో (ఇజ్రాయెల్ అనుకూల వాదులు) పడినా, వారితో చేతులు కలిపి ముందుకు నడిచినా, ముఖ్యంగా వైమానిక దాడుల ద్వారా యుద్ధం కొనసాగించాలని పట్టుబట్టినా భౌగోళికంగా ఈ యుద్ధం ఇంకా విస్తరిస్తుంది'' అన్నారు. పశ్చిమాసియాలో జరుగుతున్న యుద్ధంలో అమెరికా సైన్యాలు కష్టాలను ఎదుర్కొంటున్నాయని, వారు ప్రత్యామ్నాయంకోసం, ఒక కొత్త వ్యూహం కోసం ఎదురుచూస్తున్నారన్నారు. గడచిన 12 రోజులుగా విరామం లేకుండా పశ్చిమాసియాలో ఇరాన్‌పై దాడులు కొనసాగించిన అమెరికా సెంట్‌కామ్ సైన్యాలు శనివారం దాడులు చేయకుండా విరామం తీసుకున్నాయి. ఈ దశలో సౌదీ అరేబియా కూటమి, హౌతీ తిరుగుబాటు దళాల మధ్య దాడులు జరిగాయి.
అమెరికా–ఇరాన్ మధ్య మధ్యవర్తి దేశాలు ఎంపికయి కుదిరాయి. సమగ్ర పరిష్కారం సాధించేవరకూ చర్చల నిమిత్తం 60 రోజులపాటు కాల్పుల విరమణ గడువును కూడా నిర్ణయించారు. ఈ గడువు లోపు రెండు దేశాలమధ్య ఒక సమగ్ర ఒప్పందానికి ఇరుపక్షాలు శత్రుపక్షాలకూ కూడా అమెరికా –ఇరాన్ అంగీకరించారు. కానీ తర్వాత లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు ఆగకుండా కొనసాగాయి. దాన్ని ఇరాన్ తీవ్రంగా వ్యతిరేకించింది. ఎంపికయిన కట్టుబడేందుకు లెబనాన్‌లో ఇజ్రాయెల్ ఆక్రమణ ఆటంకంగా మారింది. అదేసమయంలో హోర్ముజ్ జలసంధిపై ఆధిపత్య సమస్యపై ఘర్షణ మొదలైంది. సుంకాల వసూలు విషయంలో వివాదం తలెత్తింది. దీంతో దాడులు మొదలయ్యాయి. గడచిన 12 రోజులుగా విరామం లేకుండా పూర్తిగా రద్దుచేసుకుంటున్నామని, ఒప్పందం నుండి వైదొలగుతున్నామని ఇరాన్ ప్రకటించిన తర్వాత హౌతీలు,హెజ్బొల్లాలు యుద్ధరంగంలోకి వచ్చేందుకు సిద్ధంగా ఉండాలని కూడా పిలుపు ఇచ్చింది. దీంతో హౌతీలు యుద్ధంలో చేరారు. ఎర్ర సముద్రంలో సౌదీ అరేబియా చమురు నౌకలపై దాడులు చేయడంతో సౌదీ అరేబియా కూటమి కూడా హౌతీలపై ప్రస్తుతం ఎదురుదాడులు కొనసాగిస్తోంది.

# యుద్ధంపై ట్రంప్‌తో విభేదిస్తున్న బర్న్‌హామ్!

- బ్రిటన్‌కోసం ట్రంప్‌ను నిలదీయడానికి సిద్ధం
- 'తొలి ఇంటర్వ్యూ'లో ఆండీ బర్న్‌హామ్



**లండన్:** అవసరమైతే తాను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను విమర్శించడానికి సిద్ధంగా ఉన్నానని బ్రిటన్ కొత్త ప్రధానమంత్రి ఆండీ బర్న్‌హామ్ స్పష్టం చేశారు. పదవీ బాధ్యతలు తీసుకున్న వెంటనే కొత్త సంప్రదాయాలకు శ్రీకారం చుట్టిన బర్న్‌హామ్ తన మొదటి ఇంటర్వ్యూలో బిబిసి ప్రతినిధి లారాకున్స్‌తో మాట్లాడుతూ, బ్రిటన్ జాతీయ ప్రయోజనాలే తనకు అన్నింటికంటే ముఖ్యమైనవన్నారు. ఈ ప్రయోజనాలు అన్నింటికంటే ముఖ్యమైనవని భావించి వాటిని కాపాడుకోవడం సరైన చర్య అయితే ట్రంప్‌ను విమర్శించడానికి, ప్రశ్నించడానికి, నిలదీయడానికి తాను సిద్ధంగా ఉన్నానన్నారు. మీరు ట్రంప్‌ను నమ్ముతున్నారా? అని రెండోసారి లారాకున్స్ ప్రశ్నించినప్పటికీ ఆయన సమాధానం చెప్పలేదు. ''ఇది మారుతున్న ప్రపంచం, పరిస్థితులు మారేకొద్దీ వాటిని బట్టి స్పందించాల్సి ఉంటుంది'' అన్నారు. ఇరాన్‌పై యుద్ధం ప్రారంభించిన విషయంలో తనకు ఆందోళన ఉందని, సరైనదని భావించే విషయాన్ని బయటకు చెప్పడానికి తాను వెనుకాడబోనన్నారు. ట్రంప్ అభిప్రాయాలకు భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తం చేయలేనని నేను చెప్పలేను, బ్రిటన్‌కు సరైనదని భావించే భిన్నమైన ఆలోచనలను నేను వ్యక్తం చేయాల్సిన అవసరం రావొచ్చు అన్నారు. సామాన్యులకు, ప్రజలకు దగ్గరగా ఉండటమే నాకున్న బలం, నేను ప్రధానమంత్రి ఉన్న తర్వాత కూడా ఆ ప్రాధాన్యతలో మార్పు రాదు'' అన్నారు. ఐతే సరైన సందర్భం ఎదురైతే ట్రంప్‌ను విమర్శిస్తారా? అని ప్రశ్నించగా, ''ఖచ్చితంగా...'' అని సమాధానం చెప్పారు. అన్నింటికంటే సొంత జాతీయ ప్రయోజనాలు కాపాడుకోవాలి, ఈ బాధ్యతలు సరిగ్గా నిర్వర్తించాలంటే ఆ పని చేయాల్సిందే అన్నారు. బ్రిటన్ రక్షణ రంగాన్ని పటిష్టం చేయడానికి స్థూల జాతీయోత్పత్తిలో మూడుశాతాన్ని కేటాయించే విషయంపై ఆయన ఎలాంటి స్పష్టతా ఇవ్వలేదు. నిర్దిష్ట తేదీని ప్రకటించలేదు. కానీ బ్రిటన్ భద్రత అంశం ఆయన ఎజెండలో ఉంది. 2030 నాటికి జిడిపిలో మూడుశాతం రక్షణకోసం ఖర్చు పెడతామని హామీ ఇవ్వకపోతే దేశం సురక్షితంగా ఉండబోదని పేర్కొంటూ ఈ విషయంలో సర్ కీర్ స్టార్‌మర్‌తో విభేదించి జాన్ హీలీ ఛాన్సలర్ పదవికి రాజీనామా చేశారు. బర్న్‌హామ్ అధికారంలోకి వచ్చాక ఆయన మళ్లీ తిరిగి వచ్చారు. ఐతే బర్న్‌హామ్ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, రక్షణ రంగం ప్రాముఖ్యత గురించి తనకు తెలుసని, అందుకే తాను జాన్ హీలీని తిరిగి ఆ పదవిలో నియమించానని చెప్పారు. ''రక్షణ రంగానికి కావాల్సిన నిధులను సమకూర్చేలా చూడటం మా ఇద్దరి ముందు ఉన్న పెద్ద సవాలు,అందుకే మాకు తక్షణ కర్తవ్యం, ఈ ఏడాది చివరలో ప్రవేశపెట్టే బడ్జెట్ ప్రక్రియలో ఈ నిధులను సమకూర్చడానికి అవసరమైన కార్యాచరణను తాము రూపొందించుకోవాల్సి ఉంది''అని బర్న్‌హామ్ చెప్పారు. పశ్చిమాసియాలో యుద్ధానికి సహకరించలేదని స్టార్మర్ ప్రధానమంత్రిగా ఉండగా బ్రిటన్‌తో ట్రంప్ విభేదించారు. ఆయన రాజీనామా చేయడానికి ముందుగానే ఇక ఆయన ప్రభుత్వం కుంటే మంచిదని కూడా ట్రంప్ వ్యాఖ్యలు చేశారు. బర్న్‌హామ్ పదవీ బాధ్యతలు తీసుకున్న వెంటనే ట్రంప్ ఫోన్‌లో సంభాషించారు. చాలా తొందరలోనే బర్న్‌హామ్‌ను కలిసేందుకు ట్రంప్ ఎంతో ఆసక్తితో ఉన్నారు.

# ఇరాన్ నౌకపై ఉక్రేన్ దాడి: అరాఘ్చి ఖండన

ఇయు ప్రతినిధి కాయా కల్లాస్‌తో సంభాషణ

నావికుడు మృతి: మరొకరికి గాయాలు



**టెహ్రాన్:** కాస్పియన్ సముద్రంలో ఇరాన్ నౌకపై ఉక్రేన్ దాడి చేసింది. ఈ దాడిని ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ అ రాఘ్చి తీవ్రంగా ఖండించారు. శనివారం తెల్లవారుజామున ఉక్రేన్ తమ నౌక పై చేసిన దాడిలో ఒక నావికుడు మరణించగా, మరో నావికుడు తీవ్రంగా గాయపడ్డాడని ఆయన ఆదివారం చెప్పా రు. ఉక్రేన్ చేసిన దాడివల్ల నౌకలో పేలు డు సంభవించిందని, ఒక నావికుడు మ రణించగా, మరో నావికుడు గాయపడ్డాడని ఆయన చెప్పారు. ఐక్యరాజ్యసమితి నిర్దేశించిన అంతర్జాతీయ చట్టంలోని ఆర్టికల్–2లో రాసిన నా లుగో పేరాలో చెప్పిన అంశాలన్నింటినీ ఉక్రేన్ ఉల్లంఘించింద ని ఆయన విమర్శించారు. ఇది యుద్ధ జ్వాలలను మరింతగా రగిలిస్తుందని, యుద్ధాన్ని ఇంకా బాగా విస్తరింపజేస్తుందని హెచ్చరించారు.
కాస్పియన్ సముద్రంలో నౌకపై జరిగిన దాడిని ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీ కూ డా అంగీకరించారని, ఇది ఇరాన్ ఇస్లామి క్ రిపబ్లిక్ పట్ల ఉక్రేన్ అనుసరిస్తున్న అహేతుకమైన,శత్రుపూరిత వైఖరికి ఒక పెద్ద సంకేతమని విమర్శించారు. రష్యా –ఉక్రేన్ మధ్య జరుగుతున్న ఘర్షణలో తాము ఏనాడూ ఏ పక్షానికి అనుకూలంగా జోక్యం చేసుకోలేదని నొక్కి చెబు తూ, ఉక్రేన్ శత్రుపూరిత వైఖరి అనుసరిస్తోందని విమర్శించారు. ఎంతమాత్రం సంబంధం లేని నౌకపై ఉక్రేన్ దాడి చేయడం ద్వారా అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించి యుద్ధ జ్వాలల ను, అభద్రతను చాలా ప్రకమాదకరమైన స్థాయిలో విస్తరింపజేయాలని ఉక్రేన్ ప్రయత్నం చేస్తోందంటూ ఇరాన్ జాతీయ ప్రయోజనాలను కాపాడుకుంటుందని హెచ్చరించారు. ఐరోపా సమాఖ్య విదేశీ వ్యవహారాల ఉన్నతస్థాయీ ప్రతినిధి కాయా కల్లాస్‌కు ఇరాన్ విదేశీమంత్రి అబ్బాస్ అరాఘ్చి ఫోన్‌చేసి ఈ విషయం గురించి చర్చించారు. ఐక్యరాజ్యసమితి, భద్రతామండలి, యూరోపియన్ యూనియన్‌లు ఈ విషయంపై తీవ్రంగా స్పందించాలని, ఈ నేరపూరిత చర్యకు పాల్పడినవారిని, సహకరించినవారిని జవాబుదారీ చేయాలని డిమాండ్ చేశారు.

# సౌదీ చమురు కర్మాగారంపై హౌతీ దాడులు

- చమురు మార్కెట్లపై తీవ్ర ఒత్తిడి
- ప్రపంచదేశాల్లో భయాందోళన

**దుబాయ్:** అమెరికా–ఇరాన్ మధ్య జరుగుతున్న యుద్ధం ఇప్పుడు ఎర్ర సముద్రం వరకూ విస్తరించింది. యెమెన్‌లోని హౌతీ తిరుగుబాటు సైన్యాలు సౌదీ అరేబియాను లక్ష్యంగా చేసుకుని ఉద్ధృత దాడులు చేస్తున్నాయి. సౌదీఅరేబియాకు చెందిన ప్రముఖ రిఫైనరీ ఆరామ్‌కో చమురు శుద్ధి కర్మాగారంపై హౌతీలు బాలిస్టిక్ క్షిపణులు,డ్రోన్లతో దాడులు చేశారు. ఈ ఘటనతో ఉత్పత్తిని నిలిపివేశారు. సౌదీ అరేబియాకు ఈ రిఫైనరీ ఎంతో కీలకమైనది. ఇరాన్ ఆదేశాలతో గత వారంలో యుద్ధరంగంలోకి దిగిన హౌతీ తిరుగుబాటుదారులు సౌదీ అరేబియా నౌకల రాకపోకలను అడ్డుకుంటామని ప్రకటించారు.రెండు రోజుల క్రితం మొదటిసారి ఎర్ర సముద్రంలో రెండు సౌదీ అరేబియా నౌకలను దగ్ధం చేశారు. దీంతో ఆగ్రహించిన సౌదీ అరేబియా తన కూటమి సభ్యులతో కలిసి యెమెన్‌లోని హౌతీల స్థావరాలపై దాడులు చేసింది. దీనికి ప్రతీకారం తీర్చుకుంటామని ప్రకటించిన హౌతీలు ఆరామ్‌కో చమురు శుద్ధి కర్మాగారంపై దాడులు చేశారు.
హోర్ముజ్ జలసంధిని మూసివేయడంతో ఇప్పటికే గడచిన ఐదు నెలలుగా ప్రపంచ దేశాలు చమురు సంక్షోభంలో చిక్కుకున్నాయి. ఇప్పుడు కొత్తగా ఎర్ర సముద్రంలో బాబ్ అల్ మండ్ జలసంధిలో నౌకల రాకపోకలను నిరోధిస్తే పరిస్థితులు చేజారిపోతాయని చమురు మార్కెట్ వర్గాలు ఆందోళన చెందుతున్నాయి. ఆరామ్‌కో కేంద్రంపై దాడి చేశామని,యాన్బు,జాజాన్ ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని చమురు కేంద్రాలపై బాలిస్టిక్ క్షిపణులు,డ్రోన్లతో దాడులు చేసినట్లు హౌతీ ప్రతినిధి యాహ్యా సరీ ప్రకటించారు. అదేవిధంగా కుమరాన్ ఐలాండ్‌లో సైనిక స్థావరాలపై కూడా దాడులు జరిగాయి. అనేక డజన్ల డ్రోన్లతో ఈ దాడులు చేశారు. అన్సార్ అల్లాపై సౌదీ అరేబియా కూటమి దాడులు చేసింది.
యాన్బు ఓడరేవు సౌదీ అరేబియా పైపులైన్‌కు ప్రధాన ముఖ ద్వారం. హోర్ముజ్ జలసంధిపై ఇరాన్ నౌకల రాకపోకలను నిషేధించినప్పటికీ సౌదీఅరేబియా నుండి ఈ పైపులైన్ ద్వారా చమురు రవాణా జరుగుతుంది. ఇప్పుడు హౌతీలు దీనిపై దృష్టి పెట్టడంతో సౌదీ అరేబియా చమురు రంగానికి భారీ ఆర్థికనష్టం వాటిల్లే ప్రమాదం ముంచుకువచ్చింది. ఐతే ఎంత నష్టం జరిగింది, ఎంత ఉత్పత్తికి తీవ్ర ఆటంకం కలిగిందనే విషయాలను సౌదీ అరేబియా ప్రభుత్వ వర్గాలు ఇంకా ధృవీకరించలేదు. ఈ నేపథ్యంలో ఇరాన్ ఒక ప్రకటన చేస్తూ యెమెన్ నుండి మొదలైన ఈ ఘర్షణకు సైనిక పరిష్కారం సాధ్యంకాదని పేర్కొంది. హౌతీలపై సౌదీ అరేబియా విధించిన దిగ్బంధనాన్ని ఎత్తివేయాలని డిమాండ్ చేసింది. హౌతీలు కూడా ఇదే విషయం చెప్పారు. దిగ్బంధనాన్ని ఎత్తివేసేవరకూ సౌదీ అరేబియా నౌకలను ఎర్ర సముద్రంలో అనుమతించబోమని, దాడులు కొనసాగిస్తామని యాహ్యా సరీ ప్రకటించారు.



**హోర్ముజ్‌లో రాకపోకలపై–ఇరాన్–ఒమన్ చర్చలు**

హోర్ముజ్ జలసంధిలో నౌకల రాకపోకలు సజావుగా కొనసాగించే విషయంపై ఒమన్‌తో చర్చలు జరిగినట్లు ఇరాన్ ప్రకటించింది. పలు విడతలుగా ఒమన్,ఇరాన్ మధ్య ఈ చర్చలు జరుగుతున్నాయి. ఇరాన్ విదేశీవ్యవహారాల మంత్రిత్వశాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఖాయీ ఆదివారం టెహ్రాన్‌లో పాత్రికేయులతో మాట్లాడుతూ, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఎంతో ఉపయోగకరంగా ఈ సాంకేతిక చర్చలు జరుగుతున్నాయని చెప్పారు.గడచిన రెండు రోజులుగా విదేశీమంత్రుల స్థాయిలో పరస్పర సార్వభౌమాధికారాలను గౌరవించుకుంటూ ఈ చర్చలు జరిగినట్లు చెప్పారు. వ్యూహాత్మకమైన ఈ జలమార్గంలో సురక్షితమైన సముద్ర రవాణా కార్యకలాపాలను నిర్ధారించడానికి ఉమ్మడి సూత్రాలు,ఆచరణాత్మక యంత్రాంగాలను ఏర్పాటు చేసే విషయంపై ఇరుపక్షాలు అభిప్రాయాలను పంచుకున్నట్లు చెప్పారు. మరోవైపు జలసంధిలో జల రవాణాలో ఎలాంటి మార్పూ లేదని చెప్పారు.

## సవరణ బిల్లు

(మొదటి పేజీ తరువాయి)

చేసినవారికి కఠిన శిక్షలు విధించడానికి, నేర నిర్ధారణకు వీలుగా అవసరమైన ప్రతిచోటా దర్యాప్తులు చేయడానికి ప్రత్యేకంగా ఒక కర్తవ్య నిర్వహణా బృందం (టాస్క్‌ఫోర్స్) ఏర్పాటు చేసే అధికారం ఈ బిల్లు ద్వారా కేంద్ర ప్రభుత్వానికి సంక్రమిస్తుంది. ఒక నిర్దిష్టమైన కాలపరిమితిలో క్రిమినల్ విచారణలు పూర్తిచేయడానికి ఈ బిల్లులో నిబంధనలు ఉన్నాయి. పోలీసులు, కేంద్ర దర్యాప్తు సంస్థ లేదా ప్రతిపాదిత కర్తవ్య నిర్వహణా బృందం ద్వారా రెండు నెలల కాలపరిమితిలో ఈ కేసులకు సంబంధించిన దర్యాప్తులు పూర్తిచేయాలనే నిబంధనలు ఇందులో పొందుపరిచారు. ప్రభుత్వ పరీక్షల నిర్వహణలో వ్యవస్థీకృత నేరాలకు పాల్పడినవారికి జైలుశిక్షను ఈ కొత్త బిల్లులో ఏడు సంవత్సరాలకు పెంచారు. ఇంతకుముందు ఈ జైలుశిక్ష ఐదు సంవత్సరాలు మాత్రమే. అదేవిధంగా వారికి విధించే జరిమానాను కూడా రూ.10 కోట్లకు పెంచారు. ఇప్పటివరకూఈ జరిమానా కోటి రూపాయలుగానే ఉంది. నేరాలకు పాల్పడినట్లు రుజువైతే ఈ పరీక్షల నిర్వహణలో భాగం పంచుకునే సేవా సంస్థల డైరెక్టర్లు, సీనియర్ మేనేజ్‌మెంట్‌సభ్యులు,బాధ్యులైన వ్యక్తులకు కొత్త బిల్లు ప్రకారం కనీసం ఐదు సంవత్సరాలు జైలు శిక్ష అనుభవించాలి. ఈ జైలుశిక్ష ఇప్పటివరకూ మూడు సంవత్సరాలుగానే ఉంది. వీరికి విధించే జరిమానాను కొత్త బిల్లు ప్రకారం రూ.5 కోట్లకు పెంచారు. ఇప్పటివరకూ ఈ జరిమానా కోటి రూపాయలుగానే ఉంది. ప్రభుత్వ పరీక్షల్లో భాగస్వామ్యం పంచుకునే సేవా సంస్థలు ఎలాంటి తప్పులు చేసినాగానీ వారిని ఇకమీదట ఎనిమిది సంవత్సరాలపాటు ఈ పరీక్షల విధానంలో పాల్గొనకుండా అంటే పరీక్షలను నిర్వహించకుండా దూరంగా ఉంచుతారు. ఇప్పటివరకూ వారిని నాలుగు సంవత్సరాలు మాత్రమే పరీక్షలు నిర్వహించకుండా దూరంగా ఉంచుతున్నారు. అదేవిధంగా ఎవరైనా వ్యక్తులు ఈ పరీక్షల నిర్వహణలో అక్రమాలు అవకతవకలకు పాల్పడినట్లు గుర్తించి, వారిని దోషులుగా నిర్ధారిస్తే, వారికి ఐదేళ్ళ నుండి పదేళ్ళు వరకూ శిక్ష విధిస్తారు. పాతచట్టం ప్రకారం వీరికి ఇప్పటివరకూ మూడేళ్ళ నుండి ఐదేళ్ళవరకూ శిక్ష విధిస్తున్నారు. అదేవిధంగా వ్యక్తులకు విధించే జరిమానాను రూ.10 లక్షల నుండి రూ.50 లక్షలకు పెంచారు.సచివాలయం ప్రకటన ప్రకారం ఉన్న చట్టం కింద నిర్వహిస్తున్న పరీక్షలకు ప్రశ్నాపత్రాలలో లీకేజీలు, అక్రమాలు, అవకతవకలు కారణంగా ఇటీవల జరిగిన సంఘటనల దృష్ట్యా చట్టాన్ని మరింత బలోపేతం చేయడంకోసం ఈ సవరణలు తీసుకువస్తున్నారు. కాక్రోచ్ జనతా పార్టీ విద్యావ్యవస్థ ప్రక్షాళన, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా లక్ష్యంగా ఈ ఉద్యమాన్ని ప్రారంభించింది. ఈ ఉద్యమంలో వివిధ విద్యార్థి సంఘాలు, యువజన సంఘాలు కూడా పాల్గొన్ని పూర్తి మద్దతు తెలియజేశారు. జనరేషన్–జెడ్ ఉద్యమం ఈ స్థాయిలో స్పందించి అతి తక్కువకాలంలో మొదటిసారి ప్రభుత్వాన్ని జవాబుదారీ చేయడం మన దేశ చరిత్రలో ఒక మైలురాయి ఘట్టం.

## సమావేశం (మొదటి పేజీ తరువాయి)

సిబిఐ, నార్కోటిక్స్ వంటి సంస్థలను ఉపయోగించి విద్యార్థులు, ప్రతిపక్షాలను బెదిరించడం నిలిపివేయాలన్నారు. యువశక్తి తిరగబడితే ఏ ప్రభుత్వమైనా దిగిరాక తప్పదని, గతంలో రైతు చట్టాల రద్దు మాదిరిగానే ఇప్పుడు దేశంలోని యువత, విద్యార్థుల పోరాటం ముందు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం మోకరిల్లిందన్నారు. యువశక్తే దేశ భవిష్యత్తుకు పునాదిగా నిలుస్తుందన్నారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ రంగాల్లో నాయకత్వ సామర్థ్యాన్ని ప్రదర్శిస్తున్న యువతకు, అదే స్థాయిలో రాజకీయ వ్యవస్థలోనూ అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని సిఎం అభిప్రాయపడ్డారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో యువత పాత్రను మరింత విస్తరించడం దేశ భవిష్యత్తుకు అవసరమని తెలిపారు. నేటి యువత 21 ఏళ్ల వయస్సులోనే ఐఎఎస్, ఐపిఎస్ అధికారులుగా సేవలందిస్తోందని, స్థానిక సంస్థల్లో ప్రజాప్రతినిధులుగా బాధ్యతలు నిర్వహిస్తోందని, ప్రపంచస్థా యి సంస్థలకు నాయకత్వం వహిస్తోందని ముఖ్యమంత్రి వెల్లడించారు. సా ంకేతిక, పరిపాలనా, వ్యాపార రంగాల్లో తమ ప్రతిభను చాటుతున్న యువతకు చట్టసభల్లోనూ తగిన ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. భారత రాజ్యాంగం 61వ సవరణ ద్వారా ఓటు హక్కు వయస్సును 21 నుంచి 18 ఏళ్లకు తగ్గించిన విషయాన్ని, 73వ, 74వ రాజ్యాంగ సవరణల ద్వారా స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే కనిష్ట వయస్సును 21 ఏళ్లకు సవరించిన విషయాన్ని సిఎం ప్రస్తావించారు. అదే స్ఫూర్తితో అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే కనిష్ట వయస్సును 25 నుంచి 21 ఏళ్లకు, శాసనమండలి, రాజ్యసభ ఎన్నికల్లో పోటీ చేసే కనిష్ట వయసును 30 నుంచి 25 ఏళ్లకు తగ్గించాలని ప్రతిపాదించారు. ఈ అంశంపై సమగ్ర చర్చ నిర్వహించేందుకు ఆగస్టు నెలలో తెలంగాణ శాసనసభ, శాసనమండలి సంయుక్త సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. అన్ని రాజకీయ పక్షాల అభిప్రాయాలు స్వీకరించిన అనంతరం పోటీ వయోపరిమితి తగ్గింపును కోరుతూ అధికారిక తీర్మానాన్ని ఆమోదించి కేంద్ర ప్రభుత్వానికి పంపనున్నట్లు సిఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

## 8500లా..? (మొదటి పేజీ తరువాయి)

ఆయన ప్రశ్నించారు. కనీస వేతన చట్టం కూడా నెలకు రూ.16 వేలు ఇవ్వాలని చెబుతున్నా విషయాన్ని ఆయన గుర్తు చేశారు. త్వరలో అసంఘటితరంగా కార్మికులను సమన్వయ పరిచి కనీస వేతనం కొరకు రాష్ట్ర వ్యాప్తం పోరాటం చేయనున్నట్లు ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు. పంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉందన్నారు. రాష్ట్రంలో ఎక్కడ మీటింగ్ జరిగిన ప్రతి నెల ఒకటవ తేదినే కార్మికులకు ఉద్యోగులకు జీతాలు చెల్లిస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న రేవంత్‌రెడ్డి గ్రామ పంచాయతీ కార్మికులకు మాత్రం ఒకటవ తేదీనే జీతాలు ఎందుకు చెల్లించడం లేదో సమాధానం చెప్పాలని ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఎండి యూసఫ్ ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 12 వేల గ్రామ పంచాయతీ 54 వేలు మంది కార్మికులు పనిచేస్తున్నారని వారందరికీ ప్రతి నెల ఒకటవ తేదిన జీతాలు చెల్లించాలన్నారు. 1986 సంవత్సరం నుండి ఇంతవరకు గ్రామ పంచాయతీ వర్కర్స్‌ను నియమించటానికి ఒక్క పర్మినెంట్ నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదంటే ఈ కార్మికులపై ప్రభుత్వాలు ఎంత వివక్షత చూపుతున్నాయో అర్థం చేసుకోవాలన్నారు. ప్రమాదంలో మరణించిన కుటుంబ సభ్యులలో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలన్నారు. సహజ మరణానికి 10 లక్షల రూపాయల ఇన్సూరెన్స్ సౌకర్యంతో పాటు పిఎఫ్, ఇఎస్‌ఐ సౌకర్యాన్ని కార్మికులకు వెంటనే కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐకెఎస్ రాష్ట్ర అధ్యక్షులు భాగం హేమంతరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, కొత్తగూడెం నగరం మేయర్ మూడు గణేష్, ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి సింగు నరసింహరావు, రాష్ట్ర కార్యవర్గసభ్యులు బిజి క్లెమెంట్, వెంకటరాజ్యం, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు రావిశివరామకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు, రాష్ట్ర సమితి సభ్యులు సిహెచ్ సీతామహాలక్ష్మి, నిమ్మటూరి రామకృష్ణ, మల్లికార్జున్, గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘం నాయకులు వాసిరెడ్డి మల్లేష్, రఘునాథపాలెం మండల కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## టాస్క్‌ఫోర్స్ (మొదటి పేజీ తరువాయి)

కోట్లాదిమంది విద్యార్థుల భవితవ్యాన్ని, పరీక్షలను పూర్తిస్థాయీ సాంకేతికత ఆధారంగా తీర్చిదిద్దేందుకు ఈ అత్యున్నతస్థాయీ కర్తవ్య నిర్వహణాబృందం తగిన సిఫార్సులు, సూచనల నివేదిక ఇస్తుంది. ఈ నివేదిక ఆధారంగా తమ ప్రభుత్వం వీలైనంత త్వరగా రాబోయే పరీక్షల విధానంలో విశ్వసనీయత పునరుద్ధరణకు తగిన చర్యలు తీసుకుంటుందని మోదీ ప్రకటించారు. పరీక్షల విధానంలో సంస్కరణలకోసం కాక్రోచ్ జనతాపార్టీ ప్రపంచదృష్టిని ఆకర్షించేవిధంగా ఉద్యమించి తొలి ఘన విజయం నమోదు చేసిన మరునా డే మోదీ ఈ చర్య తీసుకున్నారు. విద్యార్థుల భవిష్యత్తును నా శనం చేసిన, ప్రశ్నాపత్రాల లీకేజీలలో ప్రమేయం ఉన్నట్లు ఆ రోపణలు ఎదుర్కొంటున్నవారంతా జైలులో ఉన్నారని ప్రధానమంత్రి మోదీ ఆ వీడియో సందేశంలో తెలియజేశారు. ''భారత ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తు కోసం అనేక చర్యలు తీసుకుంటోంది, విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేసినవారంతా జైలులో మగ్గుతున్నారు,మేం ఇప్పటికే ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేశాం, ఈ కోర్టుల ద్వారా సంబంధిత కే సులను చాలా వేగంగా పరిష్కారం అవుతాయి, కఠినమైన చట్ట నిబంధనలు రూపొందించడానికి పార్లమెంటు ద్వారా ఒ క సవరణను కూడా తీసుకురావడానికి మా ప్రభుత్వం కృషి చేస్తోంది, పరీక్షల విధానాన్ని బలోపేతం చేసేందుకు తదుప రి సంస్కరణలు తీసుకురావడానికి దృష్టి కేంద్రీకరించాం, మనం భవిష్యత్తువైపు చూడాలి, మన పరీక్షల విధానం అక్రమాలు లేకుండా బాహాటత్వ పద్ధతిలో కొనసాగాలి,ఈ అంశాలన్నీ దృష్టిలో ఉంచుకునే ప్రపంచ ప్రఖ్యాత టెక్నాలజీ ని పుణుడు నందన్ నీలేకని నాయకత్వంలో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశాం, వారి నివేదిక ప్రకారం విద్యార్థుల్లో విశ్వసనీయత పునరుద్ధరిస్తాం'' అని మోదీ పేర్కొన్నారు. కాగా ప్ర భుత్వ పరీక్షల (అక్రమ పద్ధతుల నివారణ) చట్టానికి సవరణలతో కొత్త బిల్లును కేంద్ర ప్రభుత్వం సోమవారం లోక్‌సభలో ప్రవేశపెడుతోంది.

## కమ్ముకొస్తున్న కరువు

(మొదటి పేజీ తరువాయి)

కాకతీయుల కాలంలో నిర్మించిన గొలుసుకట్టు చెరువులు, కుంటలు, వాగుల్లో నీళ్లు లేవు. దీంతో పంటలే జీవనాధానమైన ఉమ్మడి వరంగల్ జిల్లాలో 202627 సంవత్సరంలో ఖరీఫ్ లో 17,39,714 ఎకరాలలో వివిధ పంటలు సాగు లక్ష్యంగా అధికారు లు అంచనా వేశారు. ఇందులో వరి పంట లక్ష్యమే 9,20,104 ఎకరాలుగా ఉంది. మరో 5,56,048 ఎకరాల్లో పత్తి సాగు చేయాల్సి ఉంది. వరంగల్ జిల్లాలో 1,25,160 ఎకరాలు, హనుమకొండ జి ల్లాలో 1,48,540 ఎకరాలు, జనగామ జిల్లాలో 2,13,500 ఎకరా లు, మహ బూబాబాద్ జిల్లాలో 2,18,557 ఎకరాలు, భూపాలపల్లి జిల్లాలో 1,08,106 ఎకరాల్లో, ములుగు జిల్లాలో 1,06,251 ఎకరాల్లో వరి పంట సాగు చేయాల్సి ఉంది. మొత్తం ఆరు జిల్లాలో 9,20,104 ఎకరాల్లో వరి పంట సాగు చేయాల్సి ఉండగా, కేవలం 27,107 ఎకరాల్లో మాత్రమే రైతులు నాట్లు వేస్తున్నారు. ఇందులో జనగామలో సుమారు 10వేల ఎకరాలు ఉండగా, భూపాల పల్లి జిల్లాలో 6,420 ఎకరాల వరకు శానికి ఉంది. ప్రధాన ప్రాజెక్టులతో పాటు వరి పంట ఎక్కువ పండించే ములు గు జిల్లాలో కేవలం 3,755 ఎకరాల్లో మాత్రమే వరి నాట్లు పడుతున్నాయి. ప్రధానంగా చెరు వుల్లో నీళ్లు లేకపోవటంతో వరి సాగుకు రైతులు మొగ్గు చూపటం లేదు. ఎల్ నినో ప్రభావంతో వర్షాలు పడే అవకాశం లేదనే ప్రచారంతో వరి సాగుకు రైతులు వెనకడుగు వేస్తున్నారు.

**నీరు లేక జలాశయాలు వెలవెల**

ప్రధాన జలాశయాల్లో సైతం నీటి మట్టం అంతంతే మాత్రమే ఉండటంతో రైతుల పంట సాగుపై అనిశ్చిత నెలకొంది. వరంగల్ జిల్లాలో ప్రధాన జలాశయం పాకాల సరస్సు కింద 29,500 ఎకరాల వరి పంట సాగవుతోంది. ప్రస్తుతం ఈసరస్సులో 14 అడుగుల నీళ్లే ఉండటంతో సాగు చేసేందుకు రైతులు వెనుకడుగు వేస్తున్నారు. భూపాలపల్లి జిల్లా గణపసముద్రం కింద 10వేల ఎకరాల పంట సాగవుతోంది. ములుగు జిల్లాలో రామప్ప, లక్నవరం, పాలెంవాగు, మల్లూరు ప్రాజెక్టు, గుండ్లవాగు తదితర ప్రాజెక్టుల కింద 36,506 ఎకరాల్లో అధికారికంగా పంటలు సాగవుతాయి. జనగామ జిల్లాలో 8 ప్రధాన రిజర్వాయర్లు ఉన్నాయి. వీటికింద 1,95,703 ఎకరాల ఆయకట్టు సాగవుతోంది. ప్రస్తుతం ఈ రిజర్వాయర్లలో 50 శాతం నీళ్లు కూడా లేకపోవటంతో పంటలు సాగు చేయటం లేదు. మహబూబాబాద్ జిల్లాలో 1,590 చెరువులు ఉండగా, పూర్తి స్థాయిలో ఏ చెరువులోకి నీళ్లు చేరలేదు. అంతేకాకుండా జనగామ జిల్లాలో భూగర్భజలాలు కూడా మేలో 7.78 మీట ర్లు ఉండగా, జూ న్లో 8.28 మీటర్ల లోతుకు పడిపోయాయి. మహబూ బాబాద్ జిల్లాలో మేనెలలో 6.71 మీటర్లు భూగర్భ జలాలు ఉండగా, జూన్ లో 7.01మీటర్లకు పడిపోయాయి. భూగర్భ జలాల పడిపోతుం డటంతో బోర్లపై సాగు చేసే రైతుల్లోనూ ఆందోళన వ్యక్తం అవుతోంది

**వర్షాభావంతో పత్తి రైతులు విలవిల**

నెలన్నర రోజులుగా చెప్పుకోదగ్గ స్థాయిలో భారీ వర్షాలు లేవు. దీంతో ఎకరాకు రూ.20 వేలకు పైగా ఖర్చులు చేసి జూన్ మొదటి వారంలోనే పత్తి విత్తనాలు విత్తారు. అయితే మేఘాలు ముఖం చాటేయటంతో పత్తి గింజలకు తడి కరువైంది. దీంతో చాలావరకు పత్తి మొలకెత్తకుండానే ఎండలకు దెబ్బతింటున్నాయి. దీంతో రెండోసారి కూడా పత్తి విత్తనాలు విత్తిన రైతులు ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 5,56,048 ఎకరాల్లో పత్తి సాగు అంచనా ఉండగా, ఇప్పటి వరకు 3,16,472 ఎకరాల్లో పత్తి గింజలను విత్తారు. వీటిలో చాల వరకు నీటి సౌకర్యం లేక మొలకలు ఎండి పోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. దేవాదుల పంపుహౌస్ నుంచి నీటిని ధర్మసాగర్, చలివాగు, పులుకుర్తి, రామప్ప రిజర్వాయర్లకు నీటిని లిఫ్టు చేస్తున్నారు. వీటి నుంచి ఆయా ప్రాంతాల్లోని గొలుసుకట్టు చెరువులకు నీటిని విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.

**జనగామలో 51 శాతం లోటు వర్షపాతం**

జనగామలో జులై 26 నాటికి 296.8 మిల్లీ మీటర్ల సాధారణ వర్షాపాతం నమోదు కావాల్సి ఉండగా 144.9 మిల్లీ మీటర్లు మాత్రమే నమోదైంది. జిల్లాలో 12 మండలాలు ఉండగా ఐదు మండలాల్లో వర్షాపాతం తీవ్ర లోటు ఉంది. అంటే వరి, పత్తి, చెరుకు, మొక్కజొన్న పంటలు దిగుబడి అయ్యే అవకాశాలు ఇక్కడ లేనేలేవు. జులై మాసంలో 167.5 మిల్లీ మీటర్ల వర్షాపాతం నమోదు కావాల్సి ఉండగా కేవలం 54.9 మిల్లీ మీటర్ల వర్షాపాతం మాత్రమే నమోదైంది. పై విధంగా వర్షాపాతం లెక్కలు చూస్తే జనగామలో కరువు ఛాయలు కనిపిస్తున్నాయనడంలో సందేహాలు లేవు.

**7 మండలాల్లో లోటు 5 మండలాలో తీవ్ర లోటు**

జనగామ జిల్లాలో వర్షాపాల పరిస్థితులు కన్నీరు పెట్టిస్తున్నాయి. ఏడు మండలాల్లో లోటు వర్షాపాతం ఉండగా 5 మండలాల్లో అతి లోటు ఉంది. అతి లోటు ఉన్న మండలాల్లో ఏ పంటలు పండే పరిస్థితి లేదని అధికారులు తేల్చి చెప్పారు. లోటు వర్షాపాతం ఉన్న మండలాలు తరిగొప్పుల, జఫర్‌గడ్, స్టేషన్‌ఘనపూర్, నర్మెట, జనగామ, దేవరుప్పుల, కొడకండ్ల కాగా అతి లోటు ఉన్న మండలాలు చిల్పూరు, రఘునాథపల్లి, బచ్చన్నపేట, లింగాలఘనపూర్, పాలకుర్తి మండలాలు.

**జిల్లాలో 10 శాతం నాట్లే**

జిల్లాలో ఇప్పటికీ 50 శాతం నాట్లు పూర్తి కావాలి. కానీ 10 శాతం నాట్లు మాత్రమే పూర్తయ్యాయి. జిల్లాలో సుమారుగా లక్షా 8వేల ఎకరాలకు పైగా ఖరీఫ్‌లో వరి సాగు చేస్తారు. ఈ ఏడాది జిల్లాలో ఇప్పటికీ 20 నుండి 25వేల ఎకరాల్లో కూడా నాట్లు పూర్తి కాని పరిస్థితి నెలకొంది.

## బాధ్యులెవరు


(మొదటి పేజీ తరువాయి)

శాంతియుత నిరసన చాలా కీలకమని, నిరసనకారులను రక్షించడం, చర్చల ద్వారా వారి సమస్యలను పరిష్కరించడం ప్రభుత్వ బాధ్యత అని ఆయన అన్నారు. 'ఇటువంటి క్రూరమైన హింస ప్రతి నిబంధనను నాశనం చేస్తుంది, దేశాన్ని ఆగ్రహానికి గురిచేసింది. మన దేశ భవిష్యత్తు అయిన యువత, విద్యార్థులు సమాధానాలు, జవాబుదారీతనం కోరుతున్నారు. వారు తమ గళాన్ని వినిపిస్తున్నారు' అని మాజీ కాంగ్రెస్ అధినేత అన్నారు. ఈనెల 20న ఢిల్లీలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై జరిగిన అమానుష దాడికి జవాబుదారీతనం కోరుతూ అమిత్ షాకు ఈ లేఖ రాస్తున్నానన్నారు. 'మన విద్యార్థులు నిష్పక్షపాతమైన, జవాబుదారీతనం గల విద్యా వ్యవస్థను డిమాండ్ చేస్తున్నారు. వారి వాదనలు వినడానికి బదులుగా, భద్రతా దళాలు ప్రాణాంతక ఆయుధాలు, టియర్ గ్యాస్‌తో సహా విచక్షణారహితంగా వారిపై దాడి చేశాయి' అని గాంధీ తన 25వతేదీ నాటి లేఖలో పేర్కొన్నారు. వందలాది మంది తీవ్రంగా గాయపడ్డారని, మహిళా విద్యార్థులపై పోలీసులు దాడి చేశారని, ఉద్దేశపూర్వకంగా వారి మర్మాంగాలను లక్ష్యంగా చేసుకున్నారని మండిపడ్డారు. ప్రాణాంతక పెల్లెట్ గన్‌లను ఉపయోగించడం అత్యంత దిగ్భ్రాంతికరంగా ఉందన్నారు. 'ఒక జర్నలిస్టుతో సహా, తీవ్రంగా గాయపడిన వారి గురించి మీడియా, సోషల్ మీడియాలోని నివేదికలు స్పష్టంగా చూపిస్తున్నాయి. నేను 19 ఏళ్ల విద్యార్థి సాహిల్ లోచాబ్‌ను కలిశాను, అతను ఇప్పుడు తీవ్రమైన నొప్పితో బాధపడుతున్నాడు. పెల్లెట్ గన్‌లతో కాల్చడం వల్ల ఒక కన్ను కోల్పోయే అవకాశం ఉంది' అని ఆయన చెప్పారు. 'ఢిల్లీలో మోహరించిన భద్రతా దళాలు అంతిమంగా మీకు జవాబుదారీగా ఉంటాయి, కాబట్టి నేను ఒక విషయం అడుగుతున్నాను: హోం మంత్రిగా, విద్యార్థులపై పెల్లెట్ గన్‌లతో సహా ప్రాణాంతక బలప్రయోగాన్ని మీరు ఆమోదించారా? లేకపోతే, ఎవరు ఆమోదించారు?' అని రాహుల్‌గాంధీ నిలదీశారు. సాదా దుస్తుల్లో లాఠీలతో విద్యార్థులను కొడుతున్న వారు పోలీసు సిబ్బందా లేక వలంటీర్లా? అని ప్రశ్నించారు. వారిని మోహరించడానికి ఎవరు అధికారం ఇచ్చారున్నారు. కాగా, ఎక్స్‌లో పోస్టు చేస్తూ ఢిల్లీలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పెల్లెట్ గన్‌లు, లాఠీలు, టియర్ గ్యాస్ ఉపయోగించారని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. తాను 19 ఏళ్ల సాహిల్ లోచాబ్‌ను కలిశానను, పెల్లెట్ల దెబ్బకు అతను ఒక కన్ను కోల్పోయే అవకాశం ఉందన్నారు. పేపర్ లీక్‌లకు ముగింపు పలకాలని, విద్యార్థులకు న్యాయమైన భవిష్యత్తును అందించాలని డిమాండ్ చేయడమే అతను చేసిన నేరమా అని ప్రశ్నించారు. 'అమిత్ షా జీ, నాకు రెండు ప్రశ్నలు ఉన్నాయి: 1. విద్యార్థులపై పెల్లెట్ గన్‌లతో సహా ప్రాణాంతకమైన బలప్రయోగాన్ని మీరు ఆమోదించారా? లేకపోతే, ఎవరు ఆమోదించారు? 2. సాదా దుస్తుల్లో లాఠీలతో విద్యార్థులను కొడుతున్న వ్యక్తులు పోలీసు సిబ్బందా లేక వలంటీర్లా?' 'వారిని మోహరించడానికి ఎవరు అధికారం ఇచ్చారు?' అని గాంధీ అన్నారు.

# చాను హ్యాట్రిక్.. దేశానికి తొలి స్వర్ణం అందించిన వెయిట్‌లిఫ్టర్

గ్లాస్గో వేదికగా జరుగుతున్న కామన్వెల్త్ గేమ్స్‌లో భారత వెయిట్‌లిఫ్టర్ మీరాబాయి చాను దేశానికి తొలి స్వర్ణం అందించింది. ఆదివారం జరిగిన మహిళల 48 కిలోల విభాగంలో సత్తా చాటిన మీరాబాయి అగ్రస్థానంలో పసిడి వెలుగులు విరజిమ్మింది. ఆసియా క్రీడలే తన అసలైన లక్ష్యమని, కామన్వెల్త్లో వందశాతం ప్రయత్నిస్తానో లేదోనని చెప్పిన ఆమె అందరి అంచనాలు అందుకుంటూ ఈ టోర్నీలో వరసగా మూడోసారి గోల్డ్మెడల్తో మురిసిపోయింది.

కామన్వెల్త్ క్రీడల్లో వెయిట్‌లిఫ్టర్ మీరాబాయి చాను తన ఆధిపత్యాన్ని కొనసాగించింది. 2018, 2022లో పసిడి పతకం కొల్లగొట్టిన మీరాబాయి గ్లాస్గోలోనూ పట్టువదల్లేదు. ఫైనల్లో బరువులు ఎత్తిన భారత స్టార్ ఈ ఎడిషన్‌లో దేశానికి తొలి స్వర్ణం అందించింది.



ఇదివరకు 82 కిలోలతో కామన్వెల్త్‌లో రికార్డు నెలకొల్పిన మీరాబాయి..క్లీన్ అండ్ జెర్క్ విభాగంలో తొలి ప్రయత్నంలో విఫలమైంది. రెండోసారి తడబడకుండా 82 కిలోలు, మూడో ప్రయత్నంలో 85 కిలోలు ఎత్తి సరికొత్త రికార్డు సాధించింది. అనంతరం 105 కిలోలను సైతం అవలీలగా ఎత్తిన మీరాబాయి పసిడి పతకంతో మువ్వన్నెల జెండాను రెపరెపలాడించింది. తద్వారా భారత్ పతకాల సంఖ్య మూడుకు చేరింది.



మీరా కంటే ముందు వెయిట్‌లిఫ్టింగ్‌లోనే చనంబమ్ రిషికాంత సింగ్ రజతంతో మెరిశాడు. పురుషుల 60 కిలోల విభాగంలో సత్తా చాటిన అతడు రెండోస్థానంతో సరిపెట్టుకున్నాడు. కామన్వెల్ రికార్డు నెలకొల్పిన రిషికాంత సింగ్ పసిడి వేటలో వెనకబడి.. వెండి వెలుగులు విరజిమ్మాడు. మలేషియా వెయిట్‌లిఫ్టర్ మొహమద్ అనిక్ బిన్ కస్దాన్ స్వర్ణం ఎగరేసుకుపోయాడు. రిషికాంత్, మొహమ్మద్లు.. ఇద్దరూ విజయవంతంగా 121 కిలోలు ఎత్తడం ఈ క్రీడల చరిత్రలో ఇదే మొదటిసారి.

# హాకీ ఆసియా ఛాంపియన్‌గా భారత్

### ఫైనల్లో పాకిస్థాన్‌పై విజయం

మస్కట్ వేదికగా ఉత్కంఠభరితంగా జరిగిన ఎఫ్ఐహెచ్ యూత్ హాకీ ఫైవ్స్ ఆసియా ఛాంపియన్‌షిప్ ఫైనల్ పోటీల్లో భారత సబ్‌జూనియర్ పురుషుల జట్టు తమ చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌ను 3–1 తేడాతో ఓడించి టైటిల్‌ను కైవసం చేసుకుంది. రోమిత్ పాల్(5వ నిమిషం), కెప్టెన్ కేతన్ కుష్వాహా(12వ నిమిషం), షారుఖ్ అలీ(13వ నిమిషం) చేసిన 3 గోల్స్‌తో భారత్ ఆసియా ఛాంపియన్‌గా నిలిచింది. ఈ విజయంతో భారత పురుషుల జట్టు ఎలైట్ పూల్ పట్టికలో అగ్రస్థానానికి చేరుకుంది.

### ఫైనల్లో సత్తా చాటిన భారత్

ఖచ్చితమైన పాస్‌లు, క్రమశిక్షణతో కూడిన వ్యూహాలతో ఫైనల్లో భారత్ ఆరంభంలోనే ఆధిక్యం సాధించింది. తొలి అర్ధభాగంలో పాకిస్థాన్ గోల్ కీపర్ను ఓడించి రోమిత్ పాల్ తొలి గోల్ చేయడంతో విరామ సమయానికి భారత్ 1–0 ఆధిక్యంలో నిలిచింది. రెండో అర్ధభాగం ఆరంభంలోనే కెప్టెన్ కేతన్ కుష్వాహా (12వ నిమిషం) గోల్ చేసి భారత్‌ను పటిష్టమైన స్థితిలో నిలబెట్టాడు.



ఆ వెంటనే షారుఖ్ అలీ మరో గోల్ చేసి స్కోరును 3–0కి చేర్చాడు. మహమ్మద్ ఉస్మాన్ (16వ నిమిషం) ద్వారా పాకిస్థాన్ ఆధిక్యాన్ని తగ్గించినప్పటికీ.. చివరి నిమిషాల్లో భారత డిఫెన్స్ విభాగం పటిష్టంగా నిలబడి మరిన్ని గోల్స్ జరగకుండా అడ్డుకుంది.

### ప్రపంచ కప్‌కు అర్హత సాధించిన హాకీ ఫైవ్స్

ఫైనల్కు చేరడం ద్వారా భారత్, పాకిస్తాన్ దేశాలు రెండూ తొలి ఎఫ్ఐహెచ్ యూత్ హాకీ ఫైవ్స్ ప్రపంచ కప్‌కు అర్హత సాధించాయి. మహిళల పోటీలో చైనాతో హోరాహోరీగా జరిగిన ఫైనల్లో 2–4 తేడాతో ఓడిపోయిన తర్వాత భారత సబ్ జూనియర్ మహిళా జట్టు రజత పతకాన్ని గెలుచుకుంది.

### భారత ఆటగాళ్లకు అవార్డులు

స్వర్ణ పతకం గెలుచుకున్న భారత పురుషుల జట్టులోని ప్రతి క్రీడాకారునికి రూ. 2 లక్షలు, ప్రతి సహాయక సిబ్బందికి రూ. 1 లక్ష చొప్పున, అలాగే రజత పతకం గెలుచుకున్న భారత మహిళల జట్టులోని ప్రతి క్రీడాకారిణికి రూ. 1 లక్ష, ప్రతి సహాయక సిబ్బందికి రూ. 50,000 చొప్పున రివార్డులను హాకీ ఇండియా ప్రకటించింది.

## ఆరోగ్యం



### జీవవృద్ధాప్యాన్ని నిదానించడం సాధ్యమే!


మధుమేహం, ఊబకాయం చికిత్సలో విస్తృతంగా ఉపయోగిస్తున్న 'ఓజెంపిక్' ఔషధంలోని క్రియాశీల పదార్థం 'సెమాగ్లూటైడ్' జీవవృద్ధాప్యాన్ని (బయోలాజికల్ ఏజింగ్) నిదానింపజేసే సామర్థ్యం కలిగి ఉండవచ్చని తాజా పరిశోధనలు సూచిస్తున్నాయి. శాస్త్రవేత్తల ప్రకారం, సెమాగ్లూటైడ్ కేవలం రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడం లేదా బరువు తగ్గించడానికే పరిమితం కాకుండా, శరీరంలో దీర్ఘకాలిక వాపు (ఇన్‌ఫ్లమేషన్)ను తగ్గించడం, జీవక్రియను మెరుగుపరచడం, గుండె సంబంధిత ప్రమాదాలను తగ్గించడం వంటి ప్రయోజనాలను కూడా అందించవచ్చు. ఈ మార్పులు వృద్ధాప్య వేగాన్ని తగ్గించడంలో పాత్ర పోషించే అవకాశం ఉందని భావిస్తున్నారు. అయితే ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఆధారాలు ప్రధానంగా పరోక్షమైనవేనని పరిశోధకులు స్పష్టం చేస్తున్నారు. సెమాగ్లూటైడ్ నిజంగా మనిషి జీవవృద్ధాప్యాన్ని నేరుగా నెమ్మదింపజేస్తుందా? ఆయుష్షును పెంచుతుందా? అనే విషయాన్ని నిర్ధారించడానికి మరిన్ని దీర్ఘకాలిక క్లినికల్ అధ్యయనాలు అవసరమని పేర్కొంటున్నారు. అందువల్ల, ఈ ఔషధాన్ని ప్రస్తుతం ఆమోదించిన వినియోగాలైన మధుమేహం, ఊబకాయం చికిత్సల కోసమే ఉపయోగించాలని, కేవలం వృద్ధాప్యాన్ని తగ్గించాలనే ఉద్దేశంతో వైద్యుల సలహా లేకుండా వినియోగించకూడదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

### 'స్లీప్ అప్నియా'తో గుండె, మెదడుకు ముప్పు



ఆధునిక జీవనశైలి, ఉద్యోగ ఒత్తిడి, అనియంత్రిత నిద్ర వేళలు, శారీరక శ్రమ తగ్గిపోవడం వంటి కారణాలతో నిద్ర సంబంధిత వ్యాధులు వేగంగా పెరుగుతున్నాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నా రు. ముఖ్యంగా 'అబ్స్ట్రక్టివ్ స్లీప్ అప్నియా' (ఒఎస్ఎ) అనే సమస్య అత్యంత సాధారణమైనదైనా, దాదాపు 80 నుంచి 90 శాతం కేసులు ఇప్పటికీ గుర్తింపు లేకుండానే ఉన్నాయని వారు పేర్కొంటున్నారు. గురక పెట్టడం, పగటి సమయంలో తీవ్ర నిద్రమత్తు రావడం వంటి లక్షణాలను చాలామంది సాధారణ సమస్యలుగా భావించి నిర్లక్ష్యం చేయడమే దీనికి ప్రధాన కారణమని చెబుతున్నారు. స్లీప్ అప్నియా అనేది నిద్రలో ఉన్నప్పుడు శ్వాస పలుమార్లు ఆగిపోయే పరిస్థితి. దీనివల్ల మెదడు, గుండెకు అవసరమైన ఆక్సిజన్ సరఫరా తగ్గుతుంది. చికిత్స తీసుకోకుండా వదిలేస్తే అధిక రక్తపోటు, గుండెపోటు, పక్షవాతం, మధుమేహం, ఆకస్మిక గుండె సంబంధిత సమస్యల ప్రమాదం రెండు నుంచి మూడు రెట్లు పెరిగే అవకాశం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. మధ్యవయస్కులైన ఉద్యోగులు, ముఖ్యంగా ఎక్కువసేపు కూర్చొని పనిచేసేవారు, రాత్రి వేళల్లో పని చేసే వారు, అధిక ఒత్తిడితో జీవించే వారిలో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తోందని అంచనా. ప్రతి ఐదుగురు మధ్యవయస్కుల్లో ఒకరు స్లీప్ అప్నియా ముప్పులో ఉండే అవకాశం ఉందని నిపుణులు పేర్కొంటున్నారు. నిద్రలో బిగ్గరగా గురక పెట్టడం, శ్వాస కొంతసేపు ఆగిపోవడం, ఉదయం లేవగానే తల నొప్పి ఉండటం, పగటిపూట అధిక నిద్రమత్తు, కారణం లేకుండా అలసటగా అనిపించడం, నియంత్రణలోకి రాని అధిక రక్తపోటు వంటి లక్షణాలు కనిపిస్తే వాటిని నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని సూచిస్తున్నారు. అవసరమైతే ప్రత్యేక నిద్ర పరీక్షలు (స్లీప్ స్టడీ) ద్వారా సమస్యను నిర్ధారించి చికిత్స ప్రారంభిస్తే తీవ్రమైన ఆరోగ్య సమస్యలను నివారించవచ్చని చెబుతున్నారు. నాణ్యమైన నిద్ర విలాసం కాదని, అది మంచి ఆరోగ్యానికి అత్యంత కీలకమైన ఆధారమని వైద్య నిపుణులు గుర్తు చేస్తున్నారు. రక్తపోటు, రక్తంలో చక్కెర స్థాయిలను ఎలా క్రమం తప్పకుండా పరీక్షించుకుంటామో, అదే విధంగా నిద్ర నాణ్యతపైనా శ్రద్ధ పెట్టాలని సూచిస్తున్నారు. నిద్ర సంబంధిత సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స పొందడం ద్వారా జీవన నాణ్యత మెరుగుపడటమే కాకుండా గుండె, మెదడు సంబంధిత అనేక తీవ్రమైన వ్యాధులను కూడా నివారించవచ్చని వారు స్పష్టం చేస్తున్నారు.

### అల్జీమర్స్‌పై పోరాటంలో కొత్త మలుపు



అల్జీమర్స్ వ్యాధి చికిత్సలో కొత్త మార్గాలకు దారితీసే కీలక ఆవిష్కరణను శాస్త్రవేత్తలు సాధించారు. మెదడు కణాల లోపల ఉండే అంతర్గత నిర్మాణంలో ఒక ప్రత్యేకమైన 'ద్వారపాలక' వ్యవస్థను వారు గుర్తించారు. ఈ వ్యవస్థ కణాలు అవసరమైన పదార్థాలను ఎలా గ్రహిస్తాయో నియంత్రిస్తుందని పరిశోధన వెల్లడించింది. పరిశోధకుల ప్రకారం, ఈ అంతర్గత అస్థిపంజరం లాంటి నిర్మాణం కణాల్లోకి ప్రోటీన్లు, ఇతర అణువులు ప్రవేశించే ప్రక్రియను నియంత్రిస్తుంది. ఈ వ్యవస్థలో లోపాలు ఏర్పడితే, అల్జీమర్స్ వ్యాధితో సంబంధం ఉన్న హానికరమైన ప్రోటీన్లు మెదడు కణాల్లో అసాధారణంగా పేరుకుపోయే అవకాశం ఉంది. ఈ 'గేట్‌కీపర్' వ్యవస్థ పనితీరును నియంత్రించే కొత్త ఔషధాలను అభివృద్ధి చేయగలిగితే, అల్జీమర్స్ వ్యాధి పురోగతిని నెమ్మదింపజేయడం లేదా కణాలను దెబ్బతినకుండా కాపాడడం సాధ్యమవుతుందని శాస్త్రవేత్తలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిశోధన ఇంకా ప్రారంభ దశలోనే ఉన్నప్పటికీ, అల్జీమర్స్ వ్యాధి ఎలా అభివృద్ధి చెందుతుందనే అంశంపై కొత్త అవగాహనను అందించడంతో పాటు, భవిష్యత్తులో మరింత ప్రభావవంతమైన చికిత్సల అభివృద్ధికి కొత్త లక్ష్యాలను సూచిస్తోందని నిపుణులు పేర్కొంటున్నారు.

# సంఘటిత పోరాటంతోనే హక్కులు సాధ్యం

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేణ శంకర్**

**ఆసిఫాబాద్‌లో ఎఐటియుసి జిల్లా 4వ మహాసభలు ప్రారంభం**




**ప్రజాపక్షం/ఆసిఫాబాద్/కాగజ్ నగర్ :** కార్మికుల హక్కులు ఎవరో దానమిస్తే రావని, సంఘటిత పోరాటాలతోనే వాటి సాధన సాధ్యమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేణ శంకర్ పేర్కొన్నారు. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని మైనార్టీ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఎఐటియుసి 4వజిల్లా మహాసభలు ఘనంగా ప్రారంభమయ్యాయి. సభకు ముఖ్య అతిథిగా కలవేణ శంకర్ హాజరు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక, కర్షక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రప్రభుత్వం స్పందించి, రాష్ట్రంలో నాలుగు లేబర్ కోడ్లను అమలు చేయబోమని అసెంబ్లీలో తక్షణమే తీర్మానం ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. ఆర్‌టిసి, పిహెచ్‌సి ఔట్ సోర్సింగ్ డ్రైవర్లను ప్రభుత్వంలో విలీనం చేసి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. మెడికల్ కాంట్రాక్ట్, శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ సిబ్బందికి 26,000 రూపాయల వేతనంతో పాటు ఇపిఎఫ్, ఇఎస్ఐ, బోనస్, గ్రాట్యుటీ హక్కులు కల్పించాలని కోరారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, సివిల్ సప్లై హమాలీ కార్మికులను నాల్గవ తరగతి ఉద్యోగులుగా గుర్తించి హమాలీ సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. మధ్యాహ్న భోజన, అంగన్వాడీ, ఆశా, ఐకెపి విఒఎ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి రూ.26 వేలు వేతనం అందించాలని కోరారు. ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ మాట్లాడుతూ మిషన్ భగీరథ కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించి, సీనియార్టీ ప్రకారం పదోన్నతులు ఇవ్వాలని, ఎన్‌హెచ్ఎం, ఎస్‌పిఎం కాంట్రాక్ట్ ఉద్యోగులను నిబంధనలు లేకుండా రెగ్యులర్ చేయాలన్నారు. భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా బీమా సదుపాయం కల్పించాలని, మున్సిపల్, ఫారెస్ట్ నర్సరీ కార్మికులకు రోజుకు 800 రూపాయల వేతనం ఇచ్చి సౌకర్యాలు పెంచాలన్నారు. సింగరేణిలో కొత్త బొగ్గు బ్లాకులు ప్రారంభించి కాంట్రాక్ట్ కార్మికులకు 15,000 రూపాయల వేతనం, సొంత ఇంటి పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహాసభ సందర్భం గా బస్‌స్టాండ్ నుంచి మైనార్టీ ఫంక్షన్ హాల్ వరకు వందలాది మంది కార్మికులతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎఐటియుసి జెండాను సంఘం జిల్లా అధ్యక్షుడు టి.దివాకర్ ఆవిష్కరించగా, 300 మంది ప్రతినిధులతో సభ జరిగింది. మహాసభలో ఎఐటియుసి రాష్ట్ర సమితి సభ్యులు రాజు, మేకల దాసు, లక్ష్మణ్, నాయకులు బద్రి సత్యనారాయణ, భోగే ఉపేందర్, చిరంజీవి, బాలేష్, రమేష్, జంషద్, షకీర్, రాజగౌడ్, సంతోషి, పుష్పలత, మమత, సుధాకర్, దత్తు, కాంతక్క, బుజ్జమ్మ, మోగిలి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# వర్షాభావ పరిస్థితుల నుంచి రైతును ఆదుకోవాలి

**ఎల్ నినోను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం నిర్దిష్టమైన చర్యలు చేపట్టాలి**

**రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ డిమాండ్**




**ప్రజాపక్షం/భూపాలపల్లి :** రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితుల నుంచి రైతులను ఆదుకోవాలని, ఎల్ నినో ప్రభావం వల్ల మెట్ట పంటలు వేసుకునే రైతులకు ఎకరాకి, ఎనిమిది వేల రూపాయలు ఆర్థికంగా సాయం చేసి రైతులను ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని రావి నారాయణరెడ్డి భవన్‌లో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం (ఎఐకెఎస్) భూపాలపల్లి జిల్లా 3వ మహాసభలు గుంటి చంద్రమౌళి అధ్యక్షతన నిర్వహించారు. మహా సభలకు ముఖ్యఅతిథిగా పశ్య పద్మ హాజరై మా ట్లాడారు. రైతు సంఘం ఆధ్వర్యంలో మెట్ట పంటలు వేసే ప్రతి రైతుకు ఎకరాకు 8,000 రూపాయలు ఇచ్చి వారిని ఆర్థికంగా ఆదుకోవాలని ప్రభుత్వానికి వివరించడం జరిగిందన్నారు. మండల ఆఫీస్‌లు, కలెక్టర్ ఆఫీస్‌ల ముందు చేసి వినతిపత్రాలు అందజేశామని తెలిపారు. దీంతో ప్రభుత్వం 29 మందితో ఈ వర్షాభావ పరిస్థితులలో రైతులు ఏం పంటలు వేయాలి అనే దానిపై ఒక కమిటీని ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. ఎల్ నినో వర్షాభావ పరిస్థితులలో రా నున్న రోజుల్లో తాగు, సాగు నీటికి సంబంధించి ఇప్పటి నుంచే నిర్దిష్టమైన చర్యలు తీసుకొని ప్రమాదాన్ని అరికట్టాలని ఆమె డిమాండ్ చేశారు. అమెరికాలో పండిన పంటలు మన దేశానికి దిగుమతి అయితే సుంకం తగ్గించి, మన దేశ రైతాంగం పండించిన పంటలు అమెరికాకు ఎగుమతి చేయాలి అంటే 18 శాతం పన్ను విధించడం అన్యాయం అన్నారు. దానికి సంబంధించి భారత్ అమెరికా వాణిజ్య ఒప్పందం మీద సంతకాలు అయిపోయాయని, ఈ ఒప్పందాన్ని రద్దు చేయాలని రైతుసంఘంగా డిమాండ్ చేస్తున్నామన్నారు. రైతులు పండించే పంటల మీద సుంకాన్ని మోపటమనేది ఆర్థిక దోపిడి, ఆర్థిక నేరం. ఈ ఆర్థిక దోపిడి నేరాన్ని మోదీ వ్యతిరేకించాలని తెలిపారు. ఈ దేశ రైతుల నిరుపేద ప్రజల యొక్క ప్రయోజనాలు కాపాడాలి అంటే రైతులతో చర్చించకుండా పార్లమెంట్లో చర్చించకుండా వాణిజ్య ఒప్పందం మీద సంతకం పెట్టి అమలు చేయటానికి పూనుకుంటే సహించమని హెచ్చరించారు. జిల్లాలో పంటలకు సంబంధించి జిల్లా వ్యవసాయ అధికారులు గ్రామాలలో పర్యటించి వర్షాభావ పరిస్థితులపై రైతులకు అవగాహన కల్పించాలని, రైతులను ఏకం చేసి ఎల్ నినో ప్రభావంపై అన్ని రకాల సలహాలు ఇవ్వటం ద్వారా ఈ వర్షాభావ పరిస్థితుల నుంచి భూపాలపల్లి రైతాంగాన్ని కాపాడటానికి కార్యచరణ రూపొందించాలని డిమాండ్ చేశారు. మహాసభల కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు మామిడాల సమ్మిరెడ్డి, జిల్లా అధ్యక్షులు గొంటు చంద్రమౌళి, సిపిఐ జిల్లా సహచ కార్యదర్శి పైళ్ల శాంతి కుమార్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పరమండ్ల రాజయ్య, పెంట రవి, కుడుదుల వెంకటేష్, నిమ్మల రాజయ్య, ఎండి నబి, తదితరులు పాల్గొన్నారు.

# నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

**ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఇమ్రాన్**

**ప్రజాపక్షం/మోటకొండూర్ :** కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం ఎఐటియుసి నిరంతరం పోరాడుతుందని సంఘం యాదాద్రి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఇమ్రాన్, జిల్లాగౌరవ అధ్యక్షులు బోలగాని సత్యనారాయణ అన్నారు. ఆదివారం ఎఐటియుసి మోటకొండూరు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన 3వ మహాసభలో వారు పాల్గొని ఎఐటియుసి పతాకాన్ని ఆవిష్కరించారు అనంతరం జరిగిన సభలో వారు మాట్లాడుతూ కార్మికుల హక్కులను హరించే విధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనాల అమలు, సామాజిక భద్రత, సంక్షేమ పథకాల విస్తరణ కోసం పోరాటాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అసంఘటితరంగా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బీరకాయల మల్లేష్, బోల్ల శ్రీనివాస్ అధ్యక్షత జరిగిన సభలో సిపిఐ మండల కార్యదర్శి గాదేగాని మాణిక్యం, ఎఐటియుసి నాయకులు సామల శోభన్ బాబు, ఆలేటి బాలరాజు, కొల్లూరి మల్లేష్, ముసుకు పెంటా రెడ్డి, బోట్ల శ్రీను, పైళ్ల రాంరెడ్డి, రేగు పాండు, నాగాచారీ, నల్ల రఘు, వడ్డెబోయిన శ్రీనివాస్, బొల్ల వెంకటేష్, సిరబోయిన వెంకటేష్, గజరాజు సురేష్, గిరబోయిన శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.



# సిపిఐలో వందమంది చేరిక




**పోరాటాలతోనే ప్రజాసమస్యల పరిష్కారం**

**సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు**

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** పోరాటాలతోనే ప్రజాసమస్యల పరిష్కారం సాధ్యమని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం హనుమకొండ బాల సముద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో నగరంలోని వివిధ కాలనీల నుండి పలువురు సిపిఐలో చేరారు. హనుమకొండలోని జ్యోతి రావు పూలే నగర్, దీనదయాళ్ నగర్, సర్వే నెంబర్ 964 భూపోరాట కేంద్రం కాలనీల నుండి సుమారు 100 మంది సిపిఐలో చేరారు. చేరిన వారిలో ఆలకుంట్ల యాకయ్య, ఆలకుంట్ల మల్లయ్య, నోముల కిషోర్, ఎన్నం వెంకటేశ్వర్లు, కంచర్ల కుమారస్వామి, సాంబరాజు స్వేత, పల్లకొండ శ్రీకాంత్ కనకం కావ్య తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా వారికి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు సిపిఐ కండవా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాసమస్యలపై సిపిఐ అలుపెరుగని పోరాటాలు నిర్వహిస్తున్నదన్నారు. సిపిఐ చేస్తున్న పోరాటాలకు ఆకర్షితులై పలువురు పార్టీలో చేరుతున్నారన్నారు. పేదలకు ఇండ్లు, ఇండ్ల స్థలాల సాధనకు ప్రభుత్వం ఒత్తిడి తీసుకువచ్చి పట్టాల సాధనకు కృషి చేయాలన్నారు. ఢిల్లీలో జరిగిన విద్యార్థుల ఉద్యమం స్ఫూర్తితో రానున్న రోజులలో మరిన్ని పోరాటాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, పార్టీ ప్రతినిధులు, ప్రజాసంఘాల నాయకులు ఏదునూరి వెంకట్రాజం, ఎన్.అశోక్ స్టాలిన్, వేల్పుల సారంగపాణి, కొట్టెపాక రవి, మాలోతు శంకర్ నాయక్, గుంటి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్యంలో ప్రజలదే అంతిమ విజయం

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.బాలనరసింహ్మా**

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** ప్రజా పోరాటాల ముందు మోదీ అహంకారం ఓడిందని, ప్రజాస్వామ్యంలో పాలకులు ఎంతపెద్ద నియంతలైనా అంతిమ విజయం ప్రజలదేనని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.బాల నరసింహ్మా. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ అన్నారు. ఆదివారం సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ప్రజాస్వామిక ఉద్యమం విజయం సాధించిన సందర్భంగా విజయోత్సవాలు నిర్వహించారు. బాణాసంచా కాల్చి స్వీట్లు పంచుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీట్ వ్యవహారంలో నైతిక బాధ్యత వహించి కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండు చేస్తూ విద్యార్థి యువజన లోకమంతా ఏకమై ఉద్యమిస్తున్నా కేంద్రప్రభుత్వం అహంకార పూరితంగా వ్యవహరించిన తీరు ప్రజలందరూ చూశారన్నారు. ప్రభుత్వాలు ఏవైనా ప్రజాస్వామ్యానికి లోబడి ఉండకపోతే ప్రజలు తగిన రీతిలో బుద్ధి చెప్తారని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు హెచ్.ఆనంద్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు తుమ్మల శివుడు, ఎండి కాజా మొయినుద్దీన్, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.శ్రీనివాసులు, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి బండి లక్ష్మి పతి, టి.కిరణ్ కుమార్, నాగర్‌కర్నూల్ పట్టణ కార్యదర్శి కొత్త రామస్వామి, వంకేశ్వరం శ్రీనివాసులు, ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు పర్వతాలు, వాసు దాసు, సంతోష్, యాదయ్య, బాలపీర్, సంఘం, కృష్ణ, కుమార్, నరసింహ, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.




## ఫిన్లాండ్ ప్రతినిధి బృందంతో 28న సిఎం ముఖాముఖి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఇటీవల ఫిన్లాండ్‌లో విద్య వ్యవస్థను అధ్యయనం చేసేందుకు వెళ్లిన ప్రతినిధి బృందంతో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఈనెల 28న ముఖాముఖి కానున్నారు. హైదరాబాద్‌లోని ఎంసిఆర్‌హెచ్‌ఆర్‌డి ఇనిస్టిట్యూట్‌లోని దాశరథి ఆడిటోరియంలో జరిగే ఈ ముఖాముఖి కార్యక్రమానికి పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్షా విభాగాలకు చెందిన ఆయా అధికారులతో పాటు నిర్దేశిత ప్రతినిధులు తప్పనిసరిగా హాజరుకావాలని పాఠశాల విద్యాశా ఖ సంచాలకులు డాక్టర్ ఇ. నవీన్ నికోలస్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సమావేశానికి పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్షా విభాగాల హెచ్‌ఓడీలు, అడిషనల్ డైరెక్టర్లు, జాయింట్ డైరెక్టర్లు. హైదరాబాద్, వరంగల్ ప్రాంతీయ జాయింట్ డైరెక్టర్లు, రాష్ట్రంలోని 33 జిల్లాల విద్యాశాఖాధికారులు, 33 జిల్లాల సమగ్ర శిక్షా క్వాలిటీ కోఆర్డినేటర్లు, ప్రాథమిక/ఉన్నత ప్రాథమిక పాఠశాలల ప్రతినిధులకు సంబంధించి సంబంధిత మండల విద్యాధికారులు, ఉన్నత పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులు హాజరుకానున్నారు. సిఎంతో జరిగే ముఖాముఖి కార్యక్రమానికి డీఈఓలు, ఇతర అధికారులు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని నవీన్ నికోలస్ ఆదేశించారు.

# అధికార, ప్రతిపక్ష పార్టీల సవాళ్ల సమరం

- కాళేశ్వరం ప్రాజెక్టు, నిరుద్యోగం, ఉద్యోగాల భర్తీ అంశాలపై అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బిఆర్‌ఎస్ మధ్య సవాళ్లు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు, నిరుద్యోగుల సమస్యలు, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ అంశాలపై అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్ష బిఆర్‌ఎస్ పార్టీల మధ్య పరస్పర విమర్శలు, సవాళ్లు, ప్రతిసవాళ్లు కొనసాగుతున్నాయి. ఈ అంశాలపై విమర్శలతో పాటు రెండు పార్టీల నేతలు వారి పార్టీపైనే కాకుండా వ్యక్తిగతంగా విమర్శలు, ఆరోపణలకు పాల్పడడంతో రాష్ట్రంలో రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. కాళేశ్వరం ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బిఆర్‌ఎస్ ప్రభుత్వంపై విమర్శలతో మొదలైన సవాళ్ల పర్వం నిన్నమొన్నటి నిరుద్యోగం, ఉద్యోగాల భర్తీ వరకు అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య సవాళ్లు, ప్రతిసవాళ్లు కొనసాగుతూనే ఉన్నాయి. రెండు పార్టీల మధ్య మాటల యుద్ధం జరుగుతున్నది. వానాకాలంలో చల్లగా ఉండాల్సిన వాతావరణం ఎల్‌నినో ప్రభావంతో ఇంకా వేడి వాతావరణం కొనసాగుతున్న మాదిరిగానే రాష్ట్రంలో రాజకీయ ఎల్‌నినో వేడి వాతావరణం కొనసాగుతున్నది. ఈ నేపథ్యంలో ఎల్‌నినో ప్రభావం వల్ల వ్యవసాయ రంగానికి, రైతులకు ఏర్పడిన కష్టనష్టాలు, సాగునీటి, తాగునీటి సమస్యలు, ఫీజు రీయంబర్స్‌మెంట్, ఉద్యోగాల భర్తీ, పేదలకు ఇళ్ల పట్టాలు, కొత్త పెన్షన్లు, విద్యుత్ కోతలు, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెల్లింపులు తదితర ప్రజల సమస్యల పరిష్కారం పక్కదారి పడుతున్నదని, వాటిని గాలికొదిలేశారని ప్రజలు, రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాళేశ్వరం ప్రాజెక్టుపై బిఆర్‌ఎస్‌ను తీవ్రంగా లక్ష్యంగా చేసుకున్నారు. అసెంబ్లీలో కాళేశ్వరం ప్రాజెక్టుపై సమగ్ర చర్చకు ప్రభుత్వం సిద్ధమని ప్రకటిస్తూ, బిఆర్‌ఎస్ లేఖ రాస్తే చర్చకు తేదీలు నిర్ణయిస్తామని సవాల్ విసిరారు. ప్రాజెక్టు నిర్మాణం, వ్యయాలు, నాణ్యత, బ్యారేజీల పరిస్థితిపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఇందుకు బిఆర్‌ఎస్ మాజీ మంత్రి హరీష్‌రావు ఘాటుగా స్పందించారు. సాగునీటి శాఖను మూడు నెలలు తనకు అప్పగిస్తే రైతులకు నీరు అందించి చూపిస్తానని, అది చేయలేకపోతే రాజకీయాలకు రాజీనామా చేస్తానని సవాల్ చేశారు. కాళేశ్వరం గురించి కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేస్తోందని ఆరోపించారు. సిఎం విమర్శలపై బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ మరో అడుగు ముందుకేసి, కాళేశ్వరం ద్వారా గోదావరి జలాలను వినియోగించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నష్టపరుస్తోందని ఆరోపించారు. రాజకీయ కారణాలతో ప్రాజెక్టును నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు.

### ఉద్యోగాల భర్తీపై మాటల యుద్ధం

ఉద్యోగాల భర్తీ అంశంలోనూ కాంగ్రెస్, బిఆర్‌ఎస్ మధ్య తీవ్ర వాదోపవాదాలు కొనసాగుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 70 వేలకుపైగా ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశామని, నియామక పత్రాలు అందజేశామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సహా కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారు. బిఆర్‌ఎస్ హయాంలో పేపర్ లీకులు, పరీక్షల వాయిదాలు, నియామకాలలో జాప్యమే జరిగిందని విమర్శిస్తున్నారు. దీనిపై ప్రతిపక్ష బిఆర్‌ఎస్ నేత కెటిఆర్ కూడా ఘాటుగానే స్పందిస్తూ కాంగ్రెస్ వాదనను తీవ్రంగా ఖండించారు. నిజంగా 70 వేల ఉద్యోగాలు భర్తీ చేసినట్లు ప్రభుత్వం ఆధారాలతో నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానని సవాల్ చేశారు. ప్రస్తుతం ఇస్తున్న నియామక పత్రాలు బిఆర్‌ఎస్ ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్ల ఫలితమేనని ఆరోపించారు. ఎన్నికల ముందు ఇచ్చిన రెండు లక్షల ఉద్యోగాల హామీని కాంగ్రెస్ నెరవేర్చలేదని విమర్శించారు.

నిరుద్యోగుల సమస్యలపై కూడా కాంగ్రెస్ నాయకులు బిఆర్‌ఎస్‌పై తీవ్ర విమర్శలు చేస్తున్నారు. పదేళ్ల పాలనలో పేపర్ లీకులు, పరీక్షల రద్దులు, ఉద్యోగాల భర్తీలో నిర్లక్ష్యంతో యువతను మోసం చేసిందని ఆరోపిస్తున్నారు. మరోవైపు బిఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయడంలో విఫలమైందని, నిరుద్యోగ యువతను నిరాశపరిచిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాజకీయంగా కీలకంగా మారిన రెండు అంశాలు

కాళేశ్వరం ప్రాజెక్టు అంశం రైతుల ప్రయోజనాలు, అవినీతి ఆరోపణల కోణంలో కొనసాగుతుండగా, ఉద్యోగాల భర్తీనిరుద్యోగుల సమస్య యువతను ప్రభావితం చేసే ప్రధాన రాజకీయ అంశంగా మారింది. ఈ రెండు అంశాలపైనే అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బిఆర్‌ఎస్ మధ్య సవాళ్లు ప్రతిసవాళ్లు ఇదే విధంగా కొనసాగితే తమ సమస్యల పరిష్కారం పరిస్థితి ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. రాజకీయాలు ఎన్నికలప్పుడు చూసుకోవాలని, వాటిపై విమర్శలు, ఆరోపణలు, సవాళ్లు, ప్రతిసవాళ్లతో ప్రజలనుర్లక్ష్యం చేయడం తగదని రాజకీయ పరిశీకులు అధికార, ప్రతిపక్ష పార్టీలకు సూచిస్తున్నారు.

## పెద్ది సుదర్శన్ రెడ్డి అత్యుత్తమ చికిత్స అందేలా చూడండి-కేసీఆర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** అనారోగ్యానికి గురైన మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డికి హైదరాబాద్ లో అత్యుత్తమ చికిత్స అందేలా చూడాలని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఆపార్టీ అధ్యక్షుడు,మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ఆదేశించారు. పెద్ది సుదర్శన్ రెడ్డి తీవ్ర అస్వస్థతకు గురైన నేపథ్యంలో పార్టీ ముఖ్య నేతలను కేసీఆర్ అప్రమత్తం చేశారు. పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోగ్యం విషయంలో కేసీఆర్ ఎప్పటి కప్పుడు వాకబు చేశారు. సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులతో పాటు, పార్టీ నేతలు కెటిఆర్, హరీష్ రావు, బోయినపల్లి వినోద్ కుమార్ తదితరులతో కేసీఆర్ ఎప్పటికప్పుడు మాట్లాడుతూ అప్రమత్తం చేశారు. కాగా పెద్ది ఆరోగ్య పరిస్థితిని,మెరుగైన చికిత్స తదితర అంశాలను కేసీఆర్‌కు వైద్యులు వివరించారు.





## ప్రజా భవన్ బోనాల ఉత్సవాల్లో మంత్రి కొండా సురేఖ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రజా భవన్‌లో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నివాసంలో నిర్వహించిన ఆషాఢ బోనాల ఉత్సవాల్లో అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. డప్పు చప్పుళ్లు, పోతురాజుల వీరనృత్యాల నడుమ అమ్మవారికి బోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని ప్రార్థించినట్లు మంత్రి తెలిపారు. బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, ఐక్యతకు ప్రతీక అని పేర్కొంటూ ఉత్సవాల నిర్వహణలో భాగస్వాములైన అధికారులు, ఆలయ కమిటీలు, భక్తులను అభినందించారు.

## బిసి ఆర్టిజన్స్ ఎగ్జిబిషన్‌కు విశేష ఆదరణ

### సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు: అలోక్ కుమార్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆషాఢ బోనాలు చేతివృత్తుల మేళాకు ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని బిసి సంక్షేమ శాఖ ఎంబిసి కార్పొరేషన్ సిఇఓ, మేళా ఆర్గనైజర్ అలోక్ కుమార్ తెలిపారు. మేళా విజయవంతానికి సహకరించిన మంత్రి పొన్నం ప్రభాకర్, అధికార యంత్రాంగం, కళాకారులు, మీడియా ప్రతినిధులు సహా ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. మేళా ముగింపు సందర్భంగా ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాలు, శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బాలామాయదేవి మార్గదర్శకత్వంలో నిర్వహించిన ఈ ఎగ్జిబిషన్‌కు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించిందన్నారు. గత ఏడాది 30 స్టాళ్లతో ఐదు రోజుల పాటు నిర్వహించిన ఎగ్జిబిషన్‌ను ఈసారి 60 స్టాళ్లతో 11 రోజుల పాటు నిర్వహించామని తెలిపారు. సాధారణ రోజుల్లో రోజుకు 1,500 నుంచి 2 వేల వరకు, వారాంతాల్లో 4 వేల నుంచి 5 వేల వరకు సందర్శకులు మేళాను సందర్శించినట్లు వెల్లడించారు. వచ్చే ఏడాది ఈ ఎగ్జిబిషన్‌ను మరింత విస్తృత స్థాయిలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో బిసి సంక్షేమ శాఖ జిల్లా అధికారులు ఆశన్న, ఝాన్సీ పాల్గొన్నారు.

## ప్రాణాలకు తెగించి పోరాడిన విద్యార్థులు దేశ ద్రోహులా..?

- కేంద్ర మంత్రి బండి, ఎంపి కొండా విద్యార్థులకు క్షమాపణ చెప్పాలి : ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్




**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఢిల్లీలో విద్యార్థులు తమ ప్రాణాలకు తెగించి పోరాటం చేస్తుంటే, ఆ ఉద్యమానికి విదేశీ ఫండింగ్ ఉందని, పాకిస్తాన్, బంగ్లాదేశ్, దుబాయ్ నుంచి స్విగ్గీ, జొమాటోల ద్వారా ఆహారం వస్తుందని బిజెపి నాయకులు చిల్లర ప్రచారాలు చేయడం సిగ్గుచేటని బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ మండిపడ్డారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో దాసోజు శ్రవణ్ మాట్లాడుతూ రాజ్యాంగ స్ఫూర్తి, కనీస సోయి లేకుండా కేంద్ర మంత్రి బండి సంజయ్ పోరాటం చేసిన విద్యార్థులను పాకిస్తానీలని, విదేశీ కీలుబొమ్మలని మాట్లాడటం ఆయన అజ్ఞానానికి నిదర్శనమన్నారు. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ గొప్పవాడని పొగుడుతూ ,నిరసన వ్యక్తం చేసిన విద్యార్థులను వేరే దేశాల్లో 'కాల్చిపడేస్తారంటూ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడడం ఆయన మానవత్వ రాహిత్యానికి అద్దం పడుతోందన్నారు. సౌదీ అరేబియా లాంటి దేశాల్లో పేపర్ లీక్ చేస్తే రాళ్లతో కొట్టి చంపుతారని, భారతదేశంలో కూడా నీట్ పేపర్ లీక్ చేసిన ధర్మేంద్ర ప్రధాన్‌ను, కేంద్రంలోని పెద్దలను కూడా సౌదీ తరహా రాళ్లతో కొట్టి చంపాలా?, సౌదీ రాజ్యాంగం ఇక్కడ అమలు చేయాలా? అని దాసోజు ప్రశ్నించారు. ప్రశ్నించే యువత పట్ల కరుణ, ప్రేమ చూపాలని, వారితో మాట్లాడి, సమాధానాలు చెప్పాలని స్వయంగా ఆర్‌ఎస్‌ఎస్ అధినేత ) మోహన్ భాగవత్ వ్యాఖ్యానించారని గుర్తు చేశారు. హిందూ సిద్ధాంతం గురించి మాట్లాడే వారు ఆచరణలో మాత్రం క్రూరమైన వైఖరి ప్రదర్శిస్తున్నారని దుయ్యబట్టారు. విద్యార్థి లోకాన్ని దేశద్రోహులుగా ముద్రవేసిన బండి సంజయ్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి వెంటనే విద్యార్థులకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని దాసోజు డిమాండ్ చేశారు.

## కర్ణాటక గూడూరు బ్యారేజ్ సందర్శించిన మాజీ మంత్రులు ఎమ్మెల్యేలు



**ప్రజాపక్షం/జడ్చర్ల:** పాలమూరు అన్యాయం చేస్తే సహించేది లేదు కర్ణాటక రాష్ట్రంలో కృష్ణ నదిపై అక్రమంగా నిర్మించిన చేసిన గూగల్ బ్యారేజ్, ను భీమా నదిపై గూడురు వద్ద నిర్మించిన బ్యారేజ్ ను పరిశీలించిన మాజీ మంత్రులు డా.సి లక్ష్మారెడ్డి , శ్రీనివాస గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు అల వెంకటేశ్వర రెడ్డి, అంజయ్య యాదవ్, చిట్టెం రామ్మోహన్ రెడ్డి, అంజయ్య యాదవ్, రాజేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి, బీఆర్ఎస్ శ్రేణులు ఆదివారం జడ్చర్ల మహబూబ్‌నగర్ జిల్లా నుంచి తరలి వెళ్లిన నేతలు మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలోనే అత్యంత నష్టపోయిన జిల్లా పాలమూరు ఆంధ్రా కుట్రతో పాలమూరికి అన్యాయం జరిగిందనీ ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే తెలంగాణ ఉద్యమం ప్రారంభమైందనీ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తరువాత పాలమూరు జిల్లాను బాగుచేసుకున్నామని వారు పేర్కొన్నా. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటైన తరువాల పాలమూరు రంగారెడ్డి పెద్ద ప్రాజెక్ట్ చేపట్టారనీ వివరించారు. ఆంధ్రా పాలకులు కుట్రతో పెండింగ్ లో పెట్టిన ప్రాజెక్టు లు పూర్తి చేసి పది లక్షల ఎకరాలకు నీళ్లు ఇచ్చామని తెలిపారు. అదేవిధంగా డ్రింకింగ్ వాటర్, బ్యారేజ్ లు పేరుతో ఎక్కడిక్కడ నీళ్ళు ఆపేస్తున్నారు. భీమా నదిపై హైడ్రాలిక్ గేట్ లు ఏర్పాటు తో వర్షాకాలం కూడా నీళ్లు రావట్లేదని అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా నాయకులు కలిసికట్టుగా పోరాటం చేయాలనీ రెండు రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది. మాట్లాడి నీళ్ల సమస్యను పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. కర్ణాటక, ఏపీ తో చర్చలు జరిపి జిల్లాకు అన్యాయం కాకుండా చూడాల్సిన బాధ్యత సీఎం మీద ఉందన్నారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ పనుల్లో వేగం పెంచాలనీ, మేము పాదయాత్ర చేస్తామని ప్రకటించిన తరువాత ప్రభుత్వంలో చలనం వచ్చిందని ఎద్దేవా చేశారు. ఎక్కడిక్కడ నీళ్లు ఆపుకుంటే పాలమూరు జిల్లా ఏడారి అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రిజర్వాయర్ లలో నీళ్ళు నింపే వాళ్లం కరువు పరిస్థితుల్లో తెలంగాణను కాపాడే రిజర్వాయర్ లు బీఆర్ఎస్ నిర్మించిందనీ తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ పెద్దలకు అవగాహన లేకపోవడం వల్ల నష్టం జరుగుతుందన్నారు. ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకొచ్చేందుకు పోరాటాలు చేస్తామని తెలంగాణ వాటా నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత సీఎం రేవంత్ రెడ్డి తీసుకోవాలని కోరారు. తెలంగాణ ప్రజలకు బిఆర్‌ఎస్ పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని చుక్క నీటిని కూడా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమాలలో మాజీ ఎమ్మెల్యేలు బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కొండల మధ్య నుంచి జాలువారుతున్న 'జలసిరి'

### సుదులోద్ది అటవీ మార్గంలో ప్రకృతి అందాలకు ముగ్ధులవుతున్న పర్యాటకులు




**ప్రజాపక్షం/ దండేపల్లి/ మంచిర్యాల :** వర్షాకాలం అడుగుపెట్టగానే ప్రకృతి తన అందాలను ఆవిష్కరించే వేళ, మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలంలోని సుదులోద్ది అటవీ సమీపంలో ఉన్న సహజ జలపాతం కనువిందు చేస్తోంది. సుదులోద్ది నుంచి గుండాల వైపు వెళ్లే అటవీ మార్గంలో కుడివైపున ఎత్తైన కొండల మధ్య నుంచి పాల ధారలా జాలువారుతున్న జలసిరి, చుట్టూ పరుచుకున్న దట్టమైన పచ్చని అడవి, మేఘాలను తాకే కొండలు, జలపాతం గలగల శబ్దం కలిసి ప్రకృతి ప్రేమికులను మంత్ర ముగ్ధులను చేస్తున్నాయి. వర్షాలు కురిసిన ప్రతిసారీ ఈ జలపాతం మరింత ఉద్ధృతంగా ప్రవహిస్తూ ఈ మార్గంలో ప్రయాణించే వారిని కాసేపు ఆగి ఆ అందాలను ఆస్వాదించేలా చేస్తోంది. ఫొటోలు, సెల్ఫీలు, వీడియోలతో "ఆ క్షణాలను పదిలం చేసుకుంటున్న సందర్శకులు," ఇలాంటి ప్రకృతి అందాలు జిల్లాలోనే ఉండటం అదృష్టం అంటూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియాలో ఈ జలపాతం దృశ్యాలు విస్తృతంగా ప్రచారం కావడంతో సమీప ప్రాంతాలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి కూడా ప్రకృతి ప్రేమికులు ఇక్కడికి చేరుకుంటున్నారు.దట్టమైన అటవీ మధ్య తెల్లని పాలధారలా జారిపడుతున్న జలపాతం చూపరులను మంత్రముగ్ధులను చేస్తోంది. చు ట్టూ అలుముకున్న పచ్చదనం, పక్షుల కిలకిలారావాలు, కొండల మధ్య ప్రతిధ్వనించే జలపాతం శబ్దం ప్రకృతి ఒడిలో విహరిస్తున్న అనుభూతిని కలిగిస్తోంది. భారీ వ ర్షాలు కురిసిన రోజుల్లో నీటి ప్రవాహం మరింత పెరిగి జలపాతం తన అసలు సౌందర్యాన్ని ఆవిష్కరిస్తోంది. సు దులోద్దిగుండాల అటవీ మార్గంలో ప్రయాణించే వాహనదారులు, స్థానికులు, యువత కాసేపు వాహనాలు నిలిపి జలపాతం అందాలను తిలకిస్తున్నారు. మొబైల్ ఫోన్లలో ఫొటోలు, సెల్ఫీలు, వీడియోలు చిత్రీకరిస్తూ ఆ ప్రకృతి సో యగాలను ఆస్వాదిస్తున్నారు. వర్షాలు కురిసిన రోజుల్లో సందర్శకుల సంఖ్య మరింత పెరుగుతోంది.

### పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దితే

సహజసిద్ధమైన ఈ జలపాతానికి ఇప్పటివరకు ప్రత్యేక పర్యాటక హోదా లేకపోయినా, అవసరమైన మౌలిక వసతులు, వీక్షణ స్థలాలు, పార్కింగ్, భద్రతా ఏర్పాట్లు, దిశా సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తే జిల్లాలో మరో ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందే అవకాశముందని స్థానికులు, పర్యావరణ ప్రేమికులు అభిప్రాయపడుతున్నారు. ప్రకృతి అందాలను ఆస్వాదించేందుకు వచ్చే సందర్శకుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని పర్యాటక శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. వర్షాకాలంలో రాళ్లు జారే అవకాశం ఉండటంతో సందర్శకులు అప్రమత్తంగా ఉండాలని స్థానికులు సూచిస్తున్నారు. నీటి ప్రవాహానికి అత్యంత సమీపంగా వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ప్లాస్టిక్ వ్యర్థాలు, మద్యం సీసాలు వంటి చెత్తను పడేయకుండా ప్రకృతి సంపదను పరిరక్షించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రకృతి ప్రసాదించిన ఈ అందాలను కాపాడుకుంటేనే భావితరాలకు ఈ అరుదైన సౌందర్యాన్ని అందించగలమని పర్యావరణ ప్రేమికులు పేర్కొంటున్నారు.

## మెదక్ జాతీయ రహదారిపై చిరుత పులి మృతి

- గుర్తుతెలియని వాహనం ఢీకొని ప్రాణాలు కోల్పోయిన చిరుత
- దర్యాప్తు చేస్తున్న అధికారులు



**ప్రజాపక్షం/మెదక్ :** మెదక్ జిల్లా హా వేలీ ఘన్‌పూర్ మండలం గంగాపూర్, శమ్నాపూర్ సరిహద్దు ప్రాంతంలోని గ్రామల శివారులో మెదక్ రామాయంపేట జాతీయ రహదారిపై గుర్తుతెలియ ని వాహనం ఢీకొని చిరుత మృతి చెం దింది. రహదారిపై చిరుత మృతదేహాన్ని గమనించిన స్థానికులు, ప్రయాణికులు వెంటనే అటవీశాఖ అధికారులకు, హవే లీ ఘన్‌పూర్ పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు సంఘటనా స్థ లానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. వెటర్నరీ వైద్యురాలు జ్యోస్నా స మక్షంలో పోస్టుమార్టం నిర్వహించిన అటవీశాఖ నిబంధనల ప్రకారం చిరుత మృతదేహాన్ని అక్కన్నపేట శివారులోని వికాస్ నగర పార్కులో ఖననం చేసినట్లు జిల్లా అటవీశాఖ అధికారి జోజి తెలిపారు. వాహనాన్ని గుర్తించేందుకు పోలీసులు, అటవీశాఖ అధికారుల ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు. చిరుతను ఢీకొట్టిన గుర్తుతెలియని వాహనం వివరాలు సేకరిస్తున్నాట్లు పేర్కొన్నారు.

## సనత్ నగర్‌లో పోలింగ్ కేంద్రాలను.. తనిఖీ చేసిన జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి. కర్ణన్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి (డిఈఓ), జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ సనత్ నగర్ అసెంబ్లీ నియోజకవర్గంలోని పలు పోలింగ్ కేంద్రాలను ఆదివారం తనిఖీ చేశారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్‌ఐఆర్ 2026) కార్యక్రమం అమలును సమీక్షించేందుకు శివాబాగ్ కాలనీ, దాసరం బస్తీ హట్స్ ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాలు నెంబర్ 139, 146, 160, 161, 162, 164లను సందర్శించారు. తనిఖీ సందర్భంగా ఎన్యూమరేషన్ ఫారాల సేకరణ, వాటి డిజిటలైజేషన్ ప్రక్రియను పరిశీలించిన డిఈఓ, బూత్ లెవల్ అధికారులు (బిఎల్‌ఓలు), ఎన్నికల సిబ్బందితో మాట్లాడారు. ఎన్యూమరేషన్ ఫారాలను సకాలంలో సేకరించడం, వాటిని కచ్చితత్వంతో డిజిటలైజ్ చేయడం, భారత ఎన్నికల సంఘం (ఈసిఐ) మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించడం, తలెత్తే సమస్యలను వెంటనే పరిష్కరించడం ద్వారా ఎలాంటి పొరపాట్లు లేని ఓటర్ల జాబితాల తయారీకి కృషి చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం స్థానిక నివాసితులతో కూడా మాట్లాడిన డిఈఓ, అర్హులైన ప్రతి ఎస్‌ఐఆర్2026లో చురుకుగా పాల్గొనాలని కోరారు. ఎన్యూమరేషన్ ఫారాలను పూర్తిగా, సక్రమంగా నింపి బిఎల్‌ఓలకు సమర్పించడం ద్వారా ఖచ్చితమైన, సమగ్రమైన ఓటర్ల జాబితాల రూపకల్పనకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## తేజ్ ప్రతాప్ అరెస్ట్... 14 రోజుల రిమాండ్

**పాట్నా:** జన్‌శక్తి జనతాదళ్ పార్టీ (బిజెపి) అధినేత తేజ్ ప్రతాప్ యాదవ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఆయనను పట్నా జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ముందు హాజరుపర్చగా... 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించారు. అనంతరం అధికారులు బేవూర్ సెంట్రల్ జైలుకు తరలించారు. నీట్ పేపర్ లీకేజీ ఉదంతం, దిల్లీలోని విద్యార్థులపై పోలీసుల చర్యలను నిరసిస్తూ ప్రతిపక్షాలు, వివిధ సామాజిక సంస్థలు శనివారం బీహార్ బంద్‌కు పిలుపునిచ్చాయి. పట్నాలో వేలాది మంది విద్యార్థులు, యువకులు రోడ్లపైకి వచ్చి భారీ ఎత్తున ఆందోళనలు చేపట్టారు. కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నిరసనకారులు పోలీసు వాహనాలను ధ్వంసం చేయడంతో పాటు ట్రాఫిక్ సిగ్నల్స్‌ను పగులగొట్టారు. దాంతో ఆ ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. విద్యార్థుల పోరాటానికి సంఘీభావం తెలిపేందుకు తేజ్ ప్రతాప్ యాదవ్ పట్నాలోని రామ్ గులాం చౌక్ వద్ద నిరసనలో పాల్గొన్నారు. విద్యార్థుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని, తమ పార్టీ ఎల్లప్పుడూ వారికి అండగా ఉంటుందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. సాయంత్రం దక్ బంగ్లా చౌరస్తా వద్ద పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత తేజ్ ప్రతాప్‌ను మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా... కోర్టు ఆయనకు 14 రోజుల రిమాండ్ విధించింది. ఆదివారం కోర్టుకు సెలవు కావడంతో సోమవారం బెయిల్ పిటిషన్ దాఖలు చేయనున్నట్లు ఆయన తరఫు న్యాయవాది వెల్లడించారు.

## లారీ ఢీకొని యువకుడు మృతి.. ఇద్దరికి గాయాలు

**ప్రజాపక్షం/మిర్యాలగూడ:** మండలంలోని వి.టి.పాలెం జంకు తండా ఎక్స్‌రోడ్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. రూరల్ ఎస్ఐ లక్ష్మయ్య తెలిపిన వివరాల ప్రకారం మిర్యాలగూడ పట్టణంలోని బాపూజీనగర్‌కు చెందిన గుడుగుంట్ల విజయ ప్రసాద్ (31) తన స్నేహితులతో కలిసి కొండ అజయ్ నడుపుతున్న మోటార్‌సైకిల్‌పై వి.టి.పాలెం ఎఫ్‌సీఐ గోదాముల వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో జంకు తండా వైపు వెళ్లేందుకు ఎక్స్‌రోడ్ వద్ద మలుపు తిరుగుతుండగా, అదే దిశలో వెనుక నుండి వస్తున్న లారీ మోటార్‌సైకిల్‌ను బలంగా ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో విజయ ప్రసాద్ తీవ్రంగా గాయపడి సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. మోటార్‌సైకిల్ నడుపుతున్న కొండ అజయ్‌తో పాటు మరో వ్యక్తికి గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పంచనామా నిర్వహించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుని తండ్రి గుడుగుంట్ల మల్లేశం ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌పై నిర్లక్ష్యంగా వాహనం నడిపినట్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు రూరల్ ఎస్ఐ లక్ష్మయ్య తెలిపారు.

## కోదాడ బైపాస్‌లో ప్రమాదం... క్షణాల్లో కారులో మంటలు

- ముందుటైరు ఊడిపోవడంతో అదుపుతప్పిన కారు
- సిఎన్‌జి లీక్‌తో మంటలు... ఒకరి పరిస్థితి విషమం



**ప్రజాపక్షం/కోదాడ:** సూర్యాపేట జిల్లా కోదాడ బైపాస్‌పై ఆదివారం ఉదయం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం పెను విషాదాన్ని తృటిలో తప్పించింది. విజయవాడ నుండి యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి వెళ్తున్న ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు ప్రయాణిస్తున్న మారుతి స్విఫ్ట్ డిజైర్‌కారు ముందుటైరు ఊడిపోవడంతో ఒక్కసారిగా అదుపుతప్పింది. వేగంగా దూసుకెళ్తున్న కారు డివైడర్‌ను బలంగా ఢీకొట్టి పలుమార్లు పల్టీలు కొడుతూ రోడ్డుకు ఆనుకుని ఉన్న పంట పొలాల్లోకి దూసుకెళ్లింది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఘటనాస్థలానికి పరుగెత్తి కారులో చిక్కుకున్న ఐదుగురిని ప్రాణాలకు తెగించి బయటకు తీసుకువచ్చారు. వారు బయటకు వచ్చిన కొద్ది క్షణాల్లోనే కారులోని సిఎన్‌జి గ్యాస్ లీక్ కావడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి కారు పూర్తిగా అగ్నికి ఆహుతైంది. స్థానికులు సమయస్ఫూర్తి లేకపోయి ఉంటే ఘోర విషాదం తప్పేది కాదని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విజయవాడకు చెందిన నాని, వెంకట చిన్నిక్ష్న, వెంకటలక్ష్మ, రోహిణి, శ్రీనివాస్ అనే ఐదుగురు ఒకే కుటుంబ సభ్యులు ఆదివారం ఉదయం యాదగిరిగుట్టకు బయలుదేరారు. కోదాడ మండలం శ్రీరంగాపురం సమీపంలోని జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్న సమయంలో కారు ముందు టైరు ఊడిపోవడంతో డ్రైవర్ నియంత్రణ కోల్పోయాడు. దీంతో కారు వేగంగా వెళ్లి డివైడర్‌ను ఢీకొట్టి పల్టీలు కొడుతూ రోడ్డుపక్కన ఉన్న పంట పొలాల్లో పడిపోయింది. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే కారువద్దకు చేరుకుని తలుపులు తెరిచి ప్రయాణికులను ఒక్కొక్కరిని బయటకు తీసుకొచ్చారు. అందరూ బయటకు వచ్చిన కొద్ది క్షణాల్లోనే కారులోని సిఎన్‌జి వ్యవస్థ నుంచి గ్యాస్ లీక్ కావడంతో ఒక్కసారిగా కారు పూర్తిగా కాలిపోయింది. మంటలు ఎగిసిపడటంతో కొంతసేపు జాతీయ రహదారిపై వాహనదారులు భయాందోళనకు గురయ్యారు. ఈ ప్రమాదంలో శ్రీనివాస్‌కు తీవ్రంగా గాయపడగా అతని వెంటనే కోదాడ ప్రభుత్వాసుపత్రికి తరలించి అనంతరం మెరుగైన చికిత్స కోసం విజయవాడకు పంపించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. అప్పటికే కారు పూర్తిగా కాలిపోయింది.

## ఆధ్యాత్మిక జ్ఞానం ఆచరిస్తే అద్భుతాలు



**ప్రజాపక్షం/బీబీనగర్ :** ఆధ్యాత్మిక జ్ఞానం ఆచరిస్తే అద్భుత ఫలితాలు శాంతి స్థాపనకు ఆధారమని బ్రహ్మకుమారి అంతర్జాతీయ సంయుక్త అధ్యక్షురాలు బికే సుధేష్ దీదీ అన్నారు. ఆదివారం మండలంలోని మహాదేవపూర్ గ్రామంలో గల బ్రహ్మకుమారి సైలెన్స్ ట్రీట్ సెంటర్లో రాష్ట్ర సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న జాయింట్ చీఫ్ సుధేశ్ దీదీ మాట్లాడుతూ సమాజంలో ప్రతి వ్యక్తికి రోజువారీ జీవితంలో ఎదురయ్యే మానసిక అశాంతి, అలజడులను తొలగించేది ఆధ్యాత్మిక జ్ఞానమేనని బ్రహ్మకుమారీస్ అంతర్జాతీయ సంయుక్త అధ్యక్షురాలు బి.కె.సుధేశ్ దీదీ అన్నారు. రాజయోగ సాధన ద్వారా మనసును ప్రశాంతపరుచుకుంటే ప్రపంచంలోని అన్ని యుద్ధాలు సమసిపోతాయని చెప్పారు. ఐదు రాష్ట్రాల నుంచి 200 మందికి పైగా ధ్యాన బోధకులు సాధకులు ఈ సదస్సులో పాల్గొన్నారు. ఇందులో సామూహిక ధ్యానం, సైలెన్స్ పవర్, రాజయోగ ధ్యాన ప్రయోగాలపై శిక్షణ అందించారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథులుగా హాజరైన రాష్ట్ర హైకోర్టు మాజీ యాక్టింగ్ చీఫ్ జస్టిస్ వి.ఈశ్వరయ్య మాట్లాడుతూ రాజ యోగ ధ్యానం ద్వారా లభించిన ప్రశాంతత, మనోబలంతో జడ్జిగా 69 వేల కేసులను విజయవంతంగా పరిష్కరించానని చెప్పారు. ఉస్మానియా మాజీ వైస్ ఛాన్సలర్, మణిపూర్ సెంట్రల్ యూనివర్సిటీ ఛాన్సలర్ తిరుపతిరావు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ కాలంలో వీసీగా తనకు ఎదురైన కఠిన సవాళ్లను బ్రహ్మకుమారీల జ్ఞానము, ధ్యాన పద్ధతుల ద్వారానే చక్కగా ఎదుర్కోగలిగానని వివరించారు. ఈ సదస్సులో సైలెన్స్ రిట్రీట్ సెంటర్ డైరెక్టర్లు బి.కె.రాజ్ కుమారీ, బి.కె.సునీత, బి.కె.పద్మజ, బి.కె.కాంతి పాల్గొన్నారు.

## అల్లం పేస్ట్ తయారీ కేంద్రంపై దాడి

**ప్రజాపక్షం/రామన్నపేట :** యాదాద్రి భువనగిరి జిల్లా పోలీసు సూపరింటెండెంట్ అక్షాన్ష్ యాదవ్ ఆదేశాల మేరకు, చౌటుప్పల్ డీఎస్పీ మధుసూదన్ రెడ్డి పర్యవేక్షణలో రామన్నపేట సర్కిల్ ఇన్స్‌పెక్టర్ ఎం.రవి, రామన్నపేట ఎస్సై జి.సతీష్, పోలీసు సిబ్బంది రామన్నపేట సెంటర్‌లో వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమానాస్పదంగా వెళ్తున్న ఒక వ్యాన్‌ను ఆపి తనిఖీ చేయగా, ఎటువంటి చట్టబద్ధ అనుమతులు లేకుండా పెద్ద మొత్తంలో అల్లం పేస్ట్ డబ్బాలను తరలిస్తున్నట్లు గుర్తించారు. వాహన డ్రైవర్‌ను విచారించగా, ఆ అల్లం పేస్టును కీసర ప్రాంతంలోని ఒక తయారీ యూనిట్లో తయారు చేసినట్లు వెల్లడించాడు. వెంటనే పోలీసులు ఫుడ్ సేఫ్టీ అధికారులతో కలిసి కీసరలోని సంబంధిత తయారీ కేంద్రంలో సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో కల్తీ అల్లం పేస్టును అక్రమంగా తయారు చేస్తున్నట్లు గుర్తించారు అనంతరం ప్రాంగణంలో సోదాలు నిర్వహించి, కల్తీ తయారీకి ఉపయోగిస్తున్న ముడి పదార్థాలు, యంత్రాలు, తయారైన అల్లం పేస్ట్ ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై సంబంధిత చట్టాల ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# 24 గంటల తాగునీటి సరఫరానే లక్ష్యం

- మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి

**ప్రజాపక్షం/మిర్యాలగూడ:** మిర్యాలగూడ పట్టణ ప్రజల తాగునీటి ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం చూపిస్తూ ప్రతి ఇంటికి నిరంతరం నాణ్యమైన నీటిని అందించేందుకు చేపట్టిన అమృత్ 2.0 పథకం పనులను స్థానిక శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి ఆదివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పెద్ద దేవులపల్లి వద్ద నిర్మాణంలో ఉన్న నూతన సంప్ హౌస్, నూతన పైప్‌లైన్ పనులను పబ్లిక్ హెల్త్ శాఖ అధికారులతో కలిసి తనిఖీ చేసి, వాటి పురోగతిపై విస్తృతంగా సమీక్షించారు. ఈ సందర్భంగా పనులను నిర్ణీత వ్యవధిలో వేగంగా, నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఆ తర్వాత పట్టణంలో విభిన్న ప్రాంతాల్లో నిర్మిస్తున్న 12 నూతన ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంకుల నిర్మాణాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పనులు పూర్తయితే పట్టణవాసులకు 24 గంటల పాటు నిరంతరాయంగా తాగునీటి సరఫరా అందుబాటులోకి వస్తుందని తెలిపారు. మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని పేర్కొన్నారు. ప్రజా అవసరాలకు అనుగుణంగా అధికారులు, కాంట్రాక్టర్లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ సూపరింటెండింగ్ ఇంజనీర్ వెంకటేశ్వర్లు, ఇతర అధికారులు, కాంట్రాక్టర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

**మహిళా సాధికారతకు గ్రామ సంఘాలే బలం**

గ్రామీణ మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి గ్రామ సంఘాలు కీలక భూమిక పోషిస్తున్నాయని, వాటి కార్యకలాపాలకు మరింత ఊతమివ్వాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అవసరమైన మౌలిక వసతులను కల్పిస్తోందని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మండలంలోని ధీరావత్‌తండాలో నూతనంగా నిర్మించిన గ్రామ సంఘం భవనాన్ని ఆదివారం ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ప్రారంభించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామ మహిళలు, ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. గ్రామ సంఘాల ద్వారా మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను పెంపొందించుకుని ఆర్థికంగా బలోపేతం కావడానికి ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సాహం అందిస్తోందన్నారు. గ్రామ సంఘాలకు శాశ్వత భవనం అందుబాటులోకి రావడంతో సమావేశాలు, పొదుపు కార్యక్రమాలు, వివిధ అభివృద్ధి కార్యకలాపాలు మరింత సమర్థవంతంగా నిర్వహించే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. నాణ్యతా ప్రమాణాలతో గ్రామ సంఘం భవన నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చిన అధికారులు, సిబ్బందిని ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ధరావత్ కైక లింగస్వామి, పంచాయతీరాజ్ సహాయ కార్యనిర్వాహక ఇంజనీర్ వరలక్ష్మి, సహాయ ప్రాజెక్ట్ మేనేజర్ గుంటి దిలీప్ కుమార్, ఉపసర్పంచ్ కవిత, గ్రామ సంఘం అధ్యక్షురాలు సునీత, విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్ రజిత, గ్రామ పెద్దలు, మహిళా సంఘాల సభ్యులు, ప్రజలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



## ట్రాన్స్‌ఫార్మర్లే టార్గెట్

- వరుస చోరీలకు పాల్పడుతున్న గుర్తు తెలియని వ్యక్తులు



**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** పట్టణ పరిధిలోని పాత నేరేడుచర్ల, జానలదిన్నె పరిసర ప్రాంతాలలో గుర్తు తెలియని వ్యక్తులు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను టార్గెట్ చేస్తూ వరుస చోరీలకు పాల్పడుతున్నారని ఆ ప్రాంత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ గత 15 రోజుల నుండి వేర్వేరు చోట్ల రెండు సార్లు ట్రాన్స్‌ఫార్మర్లలోని బుషలు, ఆయిల్ ఫీజులు తదితర సామాగ్రి చోరికి గురైందని తెలిపారు. ఇప్పటికే ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు లేక సాగర్ కెనాల్‌కు నీళ్లు రాక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. బోర్లు, బావులు సహాయంతో అరకొర వ్యవసాయం చేస్తున్న నేపథ్యంలో ఇలా వరుస చోరీలతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ సామాగ్రి చోరి అయినప్పుడల్లా 4 వేల నుండి ఐదు వేల రూపాయల ఖర్చు వస్తుందని, ఇక ట్రాన్స్‌ఫార్మరర్ ఆయిల్ లీకైతే 10వేల వరకు ఖర్చుదాటుతుందన్నారు. గత 15 రోజులలో దాదాపు 25 ట్రాన్స్‌ఫార్మర్లు పరికరాలు చోరికి గురైనట్లు తెలిపారు. పోలీసులు స్పందించి మరోసారి దొంగతనాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

## లీకేజీపై ధర్మేంద్ర ప్రధాన్‌ను జైలుకు పంపాలి

- ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వలివుల్లా ఖాద్రి డిమాండ్



**ప్రజాపక్షం/మునుగోడు :** నీట్ ప్రశ్నపత్రం లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌పై క్రిమినల్ కేసు నమోదు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వలివుల్లా ఖాద్రి డిమాండ్ చేశారు.ఆదివారం నల్లగొండ జిల్లా మునుగోడు నియోజకవర్గంలోని మునుగోడు మండల ఏఐవైఎఫ్ 16వ మహాసభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు.ఈ సందర్భంగా ఖాద్రి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం హయాంలో ప్రశ్నపత్రాల లీకేజీలు, అవినీతి ఆరోపణలు పెరుగుతున్నాయని విమర్శించారు. ప్రశ్నపత్రాల లీకేజీలతో లక్షలాది మంది విద్యార్థులు, నిరుద్యోగ యువత భవిష్యత్తు దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు, యువత సమస్యలపై కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. నిరుద్యోగ యువత తమ హక్కుల కోసం ఢిల్లీ జంతర్‌మంతర్ నుంచి పార్లమెంట్ వరకు ఆందోళనలు చేపట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కేంద్ర ప్రభుత్వం నెరవేర్చలేదని ఆరోపించారు. ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి తీర్పారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్రంలో ఖాళీగా ఉన్న సుమారు రెండు లక్షల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కొత్త పరిశ్రమలను ఏర్పాటు చేయాలని కోరారు. మునుగోడు నియోజకవర్గంలో ఏర్పాటు చేస్తున్న ఫార్మా పరిశ్రమల్లో స్థానిక యువతకు ప్రాధాన్యతనిస్తూ ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. స్థానిక ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పరిశ్రమల ఏర్పాటు, ఉపాధి కల్పనపై ప్రభుత్వం స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలని కోరారు. మహాసభకు ఉప్పరబోయిన సతీష్ అధ్యక్షత వహించగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గుజ్జ రామచంద్రం, బొల్గూరి నరసింహ, జిల్లా కౌన్సిల్ సభ్యులు బొమ్మరబోయిన లాలయ్య, సర్పంచ్ బండమీది యాదయ్య, ఏఐవైఎఫ్ నాయకులు గడ్డం నవీన్, బండారి శంకర్, సంజీవ,గోసుకొండ మల్లేష్,కట్ట దశరథ,పగిళ్ల రమేష్,పగిళ్ల బాబు,గోపగోని ఉదయ్,శ్రీపతి రవీందర్,అశోక్, కట్కూరి లింగస్వామి పాల్గొన్నారు.

# బాగుపడిన స్మశాన వాటిక... తీరిన ఇక్కట్లు!

**ప్రజాపక్షం/హాలియా:** చచ్చినా చావేనా అన్నట్లుగా ఉండేది ఈ స్మశాన వాటిక ప్రాంతం...గత కొన్నేళ్లుగా ఇబ్రహీంపేట వాగు వెంట హాలియా గ్రామస్తుల సౌకర్యం కోసం ఇక్కడో స్మశాన వాటిక తయారైంది. స్మశాన వాటికకు ఉండాల్సిన కనీస సౌకర్యాలు లేనప్పటికీ ప్రజలకు ఇబ్బందులు లేకుండా చనిపోయిన వారికి దహన సంస్కారాలు చేసుకునేందుకు వీలుగా ఉండేది. కాలక్రమంలో హాలియా మున్సిపాలిటీ ఏర్పడిన తర్వాత ఇక్కడో స్మశాన వాటిక నిర్మించాలని నిధులు మంజూరు చేసినా గుత్తేదారులు ఎవరూ ముందుకు రాకపోవడంతో నిర్మాణం పనులు ముందుకు సాగలేదు. దీంతో హాలియాలోని కొంత భాగం ప్రజలకు ఇక్కడి స్మశాన వాటికలో సౌకర్యాలు లేక చనిపోయిన వారికి ఇక్కడ దహన సంస్కారాలు చేసేందుకు ఇబ్బందులు పడేవారు. కనీసం మృతదేహాన్ని వాగులోకి తీసుకెళ్లేందుకు ఆ నలుగురికి మాత్రమే వీలు ఉండేది. మిగిలిన వారంతా రోడ్డు పైనే చివరి చూపు చూసుకునేవారు. మున్సిపాలిటీ అయిన తర్వాత పాత సాయి ప్రతాప్ నగర్ లోని ప్రజలు ఎవరైనా చనిపోతే ఈ వాగులో దహన సంస్కారాలు చేసేవారు. ఆ సమయంలోనే అప్పటి ప్రభుత్వంలో 30 లక్షల రూపాయలతో ఇక్కడ వైకుంఠధామం నిర్మించుకునేందుకు నిధులు మంజూరు చేశారు. కానీ నిర్మాణం చేపట్టేందుకు గుత్తేదారులు ఎవరు ముందుకు రాకపోవడంతో ఆ నిధులు అలానే మిగిలిపోయాయి. ప్రస్తుతం ఇక్కడ కొత్త వైకుంఠధామం నిర్మించకపోయినా పాత స్మశాన వాటికలో



చెట్లు, చెత్త పేరుకుపోయి కనీసం మనుషులు అందులోకి వెళ్లే పరిస్థితి లేకుండా ఉండేది. దీంతో చనిపోయిన వ్యక్తికి దహన సంస్కారాలు చేయడం అంటే చచ్చేంత చావు అయ్యేది. ఈ పరిస్థితిని గుర్తించిన మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి, మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డిలు ఈ ప్రాంతాన్ని పరిశీలించి నాలుగు రోజులపాటు యుద్ధ ప్రాతిపదికన పేరుకుపోయిన కంపచెట్లను, చెదురుగా పడి ఉన్న చెత్తను యంత్రాల సహాయంతో శుభ్రం చేసి స్మశాన వాటికకు కొత్త రూపు తెచ్చారు. ఇన్నాళ్ల తర్వాత ఇక్కడ దహన సంస్కారాలు చేసుకునేందుకు అనువైన స్థలం ఉందని గుర్తించేలా పనులు చేపట్టిన తీరు గమనార్హం. దీంతో ప్రస్తుతం హాలియా మున్సిపాలిటీలోని కొన్ని వార్డుల ప్రజలకు స్మశాన వాటిక సమస్య కొంత తీరినట్టైంది.



## బాలాజీనగర్‌లో భారీ కార్డెన్ సెర్చ్

- సరైన పత్రాలు లేని 25 ద్విచక్ర వాహనాలు, కారు స్వాధీనం
- కోదాడ పట్టణ సిఐ శివశంకర్‌నాయక్

**ప్రజాపక్షం/కోదాడ:** కోదాడ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని బాలాజీనగర్‌లో ఆదివారం తెల్లవారుజామున పోలీసులు భారీ కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజలకు సురక్షిత వాతావరణం కల్పించడమే లక్ష్యంగా చేపట్టిన ఈ ప్రత్యేక తనిఖీలు ఉదయం 4 గంటల నుండి 6:30 గంటల వరకు కొనసాగాయి. సూర్యాపేట జిల్లా పోలీస్ యంత్రాంగం అదేశాల మేరకు కోదాడ సబ్ డివిజనల్ పోలీస్ అధికారి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో కోదాడ టౌన్ సిఐ శివశంకర్‌నాయక్ నాయకత్వంలో ఈ అపరేషన్ చేపట్టారు. ఇందులో ఐదుగురు ఎస్ఐలు, సుమారు 100 మంది పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు. అపరేషన్‌ను పకడ్బందీగా నిర్వహించేందుకు ఐదు ప్రత్యేక సెర్చ్ బృందాలు, నాలుగు కట్ ఆఫ్ పాయింట్లు, ఒక హోల్డింగ్ పాయింట్‌ను ఏర్పాటు చేశారు. బాలాజీనగర్‌లో వీధుల్లో అనుమానస్పద ప్రాంతాలు ఇళ్లు, వాహనాలను క్షుణంగా తనిఖీ చేశారు. ముఖ్యంగా మాదకద్రవ్యాలు, అక్రమ మద్యం, పేలుడు పదార్థాలు, అక్రమ ఆయుధాల నిల్వలు, అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల పత్రాలు పరిశీలనపై ప్రత్యేక దృష్టి సారించారు. సోదాల అనంతరం సరైన పత్రాలు లేని 25 ద్విచక్ర వాహనాలు, ఒక కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. వారి వివరాలను సేకరించి తదుపరి చట్టపరమైన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

# ఆరోగ్యంగా ఉంటేనే ప్రజలకు వేగవంతమైన సేవలు



- సూర్యాపేట ఎస్‌పి కె.నరసింహ

**ప్రజాపక్షం/సూర్యాపేట :** పోలీస్ ఆరోగ్యంగా ఉంటేనే ప్రజలకు వేగవంతమైన సేవలు అందించవచ్చని జిల్లా ఎస్‌పి కె.నరసింహ అన్నారు. ఆదివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీసు సిబ్బంది, వారి కుటుంబాల సంక్షేమంలో భాగంగా జిల్లా పోలీస్ శాఖ, సూర్యాపేట పట్టణంలోని డివైన్ టచ్ హాస్పటల్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత లివర్ సంబంధ, రక్త సంబంధ వైద్య పరీక్షల శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో పోలీస్ సిబ్బందికి అత్యంత ఖరీదైన లివర్ ఫైబ్రోస్కాన్ పరీక్షలను ఉచితంగా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం ప్రజా రక్షణలో అనుక్షణం పనిచేస్తూ బిజిగా ఉంటూ పోలీస్ సిబ్బంది తమ ఆరోగ్యాన్ని అశ్రద్ధ చేస్తున్నారన్నారు. పోలీసు సిబ్బంది మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఉన్నప్పుడే ప్రజలకు మరింత వేగంగా, సమర్థవంతంగా పోలీసు సేవలు అందించగలరని ఆయన పేర్కొన్నారు. సిబ్బంది ఆరోగ్యం, సంక్షేమం కోసం అనుక్షణం కృషి చేస్తానని, అందులో భాగంగానే ఉచిత ఆరోగ్య శిభిరాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. మానవ శరీరంలో లివర్ అత్యంత ముఖ్యమైన అవయవమని, మంచి ఆహార అలవాట్లను అలవర్చుకోవడం ద్వారా కాలేయాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవచ్చని సూచించారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం మన అందరి బాధ్యత అని స్పష్టం చేశారు. సిబ్బంది సమయస్ఫూర్తితో విధులు నిర్వర్తించి ప్రజలకు పోలీస్ సేవలు అందించాలని కోరారు. ఒత్తిడి లేకుండా పనిచేయాలని సూచించారు. ఉద్యోగంతోపాటుగా కుటుంబ సభ్యులతో గడపడం ముఖ్యమన్నారు. ఎల్లప్పుడూ వ్యాయామం చేయడం, మంచి ఆహారం తీసుకోవడం వల్ల ఉత్సాహంగా ఉంటామన్నారు. ఈ సదుపాయాన్ని 200 మంది పోలీస్ సిబ్బంది సద్వినియోగం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్‌పి రవీందర్ రెడ్డి, డిఎస్‌పిలు ప్రసన్న కుమార్, నరసింహ చారి, డాక్టర్ విజయ మోహన్, సంధ్య మోహన్, సిఐ వెంకటయ్య, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, రిజర్వు ఇన్‌స్పెక్టర్లు ప్రవీణ్ కుమార్, జానయ్య, ఆర్ఎస్ఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

# కాలం తెచ్చిన కరువు కాదిది.. కాంగ్రెస్ కరువు

- బుల్లెట్ ట్రైన్ అలైన్‌మెంట్ మార్చొద్దు
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి



**ప్రజాపక్షం/సూర్యాపేట :** రాష్ట్రంలో ప్రస్తుతం కాలం తెచ్చిన కరువు కాదని కాంగ్రెస్ తెచ్చిన కరువని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి విమర్శించారు. ఆదివారం రాష్ట్రంలో ప్రస్తుతం తలెత్తుతున్న నీళ్లు, కరెంటు సమస్యలపై జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో ప్రభుత్వంపై మండిపడ్డారు. రాజకీయ కక్ష్యతో కాళేశ్వరంను వాడకుండా రైతులను గోసపట్టిస్తున్నారని అన్నారు. గోదావరిలో నీళ్లన్నీ పోతున్నా సూర్యాపేటకు మాత్రమే నీళ్లొస్తలేవన్నారు. కెసిఆర్ హయాంలో కరువు వచ్చినా అప్పుడు వచ్చిన నీళ్లు ఇప్పుడు ఎందుకు వస్తలేవని ఆయన ప్రశ్నించారు. కాళేశ్వరం, కన్నెపల్లి నుంచి ఇక్కడి వరకు అన్నీ వ్యవస్థలు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. ఇప్పటికే లక్ష క్యూసెక్కుల నీరు వృధాగా పోతుంటే ముఖ్యమంత్రి, మంత్రులు నిద్రావస్తలో ఉన్నారని దుయ్యబట్టారు. ప్రభుత్వ నిర్లక్ష్యపు ధోరణి, మూర్ఖపు పట్టుదలతో పంటలు ఎండబెట్టుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పుడు కూలిపోయింది, కొట్టకపోయిందని చెప్పి ఇప్పుడు నీళ్లు ఇస్తే పరువు పోతుందని భయపడుతున్నారని విమర్శించారు. వెంటనే కన్నెపల్లి పంప్‌హౌస్‌ను ప్రారంభించి రైతులకు నీళ్లు అందించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సరఫరాలో కూడా తీవ్రమైన అంతరాయం ఏర్పడుతుందన్నారు. రోజుకు 12, 13 గంటలు కూడా కరెంట్ ఇస్తలేరని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. మళ్ళీ 2014 ముందున్న పరిస్థితిలే పునరావృతం అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎక్కడ చూసినా బోరింగ్ రిగ్గులు కనబడుతున్నాయని మళ్లీ వాటికి గిరాకి పెరిగిందన్నారు. వీటి వల్ల రైతుల జేబులు ఖాళీ అవుతున్నాయని, అప్పుల పాలవుతున్నారన్నారు.

**ప్రభుత్వం పునరాలోచించాలి**

శంషాబాద్ నుంచి నల్లగొండ, సూర్యాపేట మీదుగా చెన్నై వరకు ప్రతిపాదించిన బుల్లెట్ ట్రైన్ అలైన్‌మెంట్‌ను మార్చవద్దని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రూట్ మారుస్తున్నారనే ప్రచారంతో ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రజల్లో తీవ్ర ఆందోళన నెలకొందని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రాంత అభివృద్ధికి బుల్లెట్ ట్రైన్ ఎంతో కీలకమన్నారు. గతంలో ప్రకటించిన ప్లాన్ ప్రకారం శంషాబాద్–చెన్నై బుల్లెట్ ట్రైన్ నల్లగొండ, సూర్యాపేట జిల్లాల మీదుగా వెళ్తుందని చెప్పడంతో ఈ ప్రాంత ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారని గుర్తు చేశారు. బుల్లెట్ ట్రైన్ అన్ని స్టేషన్లలో ఆగకపోయినా, జిల్లా కేంద్రాలకు అందుబాటులో ఉండటం వల్ల ఈ ఏరియా పారిశ్రామికంగా, ఆర్థికంగా ఎంతో ఎదిగే అవకాశం ఉందన్నారు. కానీ, ఇప్పుడు పాత అలైన్మెంట్ మార్చి వేరే వైపు నుంచి తీసుకెళ్లే ప్రయత్నం చేయడం సరికాదని ఆయన మండిపడ్డారు. బుల్లెట్ ట్రైన్ అలైన్మెంట్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచన చేయాలని కోరారు. ఈ ప్రాజెక్టు ఎంతో అవసరమని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.


## గాయపడిన వృద్ధురాలికి సకాలంలో 108 సిబ్బంది ప్రాణరక్షణ



**ప్రజాపక్షం/తుర్కపల్లి :** మండలంలోని ధర్మారం గ్రామంలో రైతు బావుల వద్ద జరిగిన గొడవలో 56 ఏళ్ల ధూళి అనే వృద్ధురాలు స్వల్పంగా గాయపడిందని సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది వెంటనే ఘటనాస్థలికి చేరుకుని వృద్ధిరాలిని కాపాడేందుకు తీవ్రంగా శ్రమించారు. రైతు పొలం వద్దకు అంబులెన్స్ వెళ్లే దారి లేకపోవడంతో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ (ఈ ఎం టి) రాజు, పైలెట్ రూపేష్ కాలి నడకన పొలంలోకి వెళ్లి గాయపడిన వృద్ధురాలిని సుమారు ఒక కిలోమీటర్ మేర స్ట్రెక్చు మోసుకుంటూ అంబులెన్స్ వద్దకు తీసుకువచ్చి అక్కడే ప్రథమ చికిత్స అందించి, అనంతరం 108 అంబులెన్స్లో భువనగిరి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి వృద్ధురాలి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని తెలిపారు.దారి లేకపోయినా వెనుకడుగు వేయకుండా మానవత్వంతో స్పందించి, సకాలంలో వైద్యసేవలు అందించిన 108 సిబ్బంది సేవలను గ్రామస్తులు, బాధిత కుటుంబ సభ్యులు వారి సేవాభావాన్ని ప్రశంసించారు.

## దేవస్థానం అధ్యక్షుడిగా బిట్ల చంద్రశేఖర్

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** భూదాన్ పోచంపల్లి మున్సిపల్ పరిధిలోని మార్కండేయనగర్ కాలనీలోని ప్రకాష్‌నగర్ కాలనీ శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం నూతన అధ్యక్షుడిగా బిట్ల చంద్రశేఖర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం ఏర్పాటు చేసిన నూతన కార్యవర్గానికి చేనేత కార్మిక సంఘం సహాయ కార్యదర్శి బిట్ల గణేష్, కాంగ్రెస్ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.



ప్రజాపక్షం
Telugu National Daily
హైదరాబాద్
సోమవారం
27-07-2026
www.prajapaksham.in

‘యంగ్ టాలెంటెడ్ హీరో హర్షిత్ రెడ్డి నటించిన రీసెంట్ సినిమా ‘దీవాన’ డిజిటల్ ప్రీమియర్ కు రెడీ అయ్యింది. ఈ చిత్రాన్ని అర్హ మీడియా, వీ స్టూడియోస్ బ్యానర్ పై వాసుదేవ్ కొప్పినేని, శ్రీదేవి కార్యంపూడి నిర్మించారు.’

రీల్



## ‘అగధ’ ఆగస్టు 14న రిలీజ్


హైదరాబాద్ నగరానికే కాదు... యావత్ తెలంగాణ రాష్ట్ర ప్రజల ఆరాధ్య దైవంగా వెలుగొందుతున్న చారిత్రక, ఆధ్యాత్మిక మహా పుణ్యక్షేత్రం బల్కంపేట ఎల్లమ్మ–పోచమ్మ దేవాలయం. శతాబ్దాల చరిత్రను సొంతం చేసుకున్న ఈ ఆలయ ం ప్రతి ఏడాది బోనాల సందర్భంగా లక్షలాది మంది భక్తులతో కళకళలాడుతుంది. రాష్ట్రం నలుమూలల నుంచే కాకుం డా దేశ విదేశాల నుంచి కూడా భక్తులు ఇక్కడికి వచ్చి అమ్మవార్ల ఆశీస్సులు పొందుతుంటారు. ప్రముఖ పారిశ్రామికవేత్త రిలయన్స్ అధినేత ముకేష్ అంబానీ సతీమణి నీతా అంబానీ సైతం ప్రతి సంవత్సరం ఈ ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించడం ఈ క్షేత్ర విశిష్టతకు నిదర్శనం. ఇలాంటి పవిత్ర క్షేత్రంలో అమ్మవార్ల దివ్య ఆశీస్సులతో తన ప్రచార ప్రయాణాన్ని ప్రారంభించింది ప్రముఖ దర్శక నిర్మాత ఎం.ఎస్. రాజు రూపొందించిన అత్యంత ప్రతిష్ఠాత్మక తెలుగు చిత్రం ‘అగధ’. ఈ చిత్రాన్ని శ్రీ ఆది వరాహ ప్రొడక్షన్ పతాకంపై అజయ్ కేఆర్ సమర్పణలో కాశీ విశాలాక్షి బలుసు నిర్మించారు. ప్రపంచవ్యాప్తంగా ఆగస్ట్ 14, 2026న భారీ స్థాయిలో ‘అగధ’ విడుదల కానుంది. జులై 26, 2026 నాడు ‘అగధ’ మూవీ టీమ్ బల్కంపేట ఎల్లమ్మ–పోచమ్మ దేవాలయాన్ని సందర్శించి, అమ్మవార్లకు సంప్రదాయబద్ధంగా బోనాలు సమర్పించింది.దర్శకులు ఎం.ఎస్. రాజు, నిర్మాత కాశీ విశాలాక్షి బలుసు, చిత్ర సమర్పకులు అజయ్ ఆర్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎన్.వి.ఎన్. సుబ్బరాజు, హీరో శ్రవణ్ రెడ్డి, తదితరులు తమ కుటుంబ సభ్యులతో సహా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. దర్శకుడు ఎంఎస్ రాజు మాట్లాడారు. కామాక్షి భాస్కర్ల, శ్రవణ్ రెడ్డి, ఉల్కా గుప్తా, జోవికా విజయ్ కుమార్, సిజ్జు, రోషన్, శ్రేయరాణి రెడ్డి తదితరులు నటించిన ఈ చిత్రానికి రచన దర్శకత్వం: ఎం.ఎస్. రాజు, సమర్పణ: అజయ్ కెఆర్, నిర్మాత: కాశీ విశాలాక్షి బలుసు,సంగీతం: రాకేష్ వెంకటాపురం,సినిమాటోగ్రఫీ: నాని చమిడిశెట్టి,ఎడిటింగ్: జునైద్ సిద్ధిఖీ, ప్రొడక్షన్ డిజైనర్ : రాజీవ్ నాయర్, అదనపు స్క్రీన్‌ప్లే: చైతన్య వేగి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎన్.వి.ఎన్. సుబ్బరాజు.

## రమేష్ కుటుంబానికి చిరంజీవి రూ.3లక్షల ఆర్థిక సాయం

తోటి కళాకారుల కష్టసుఖాల్లో ఎప్పుడూ ముందుండే చిరంజీవి మరో సారి తన మానవత్వాన్ని చాటుకున్నారు. ‘గబ్బర్ సింగ్’ చిత్రంతో పాటు పలు చిత్రాల్లో నటించి ప్రేక్షకులను అలరించిన నటుడు రమేష్ గారు ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న చిరంజీవి వెంటనే స్పందించారు. అపోలో ఆసుపత్రిలో డాక్టర్ సుబ్బారెడ్డి గారితో తరచుగా మాట్లాడుతూ రమేష్ ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్న చిరంజీవి గారు, చికిత్సకు అవసరమైన అన్ని విధాల సహాయం అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. రమేష్ కుటుంబ సభ్యులను పరామర్శించిన ఆయన, చికిత్స ఖర్చులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకూడదనే ఉద్దేశంతో ఆయన సతీమణికి తన తరఫున రూ.3 లక్షల చెక్కును అందజేశారు. అంతేకాకుండా, రాష్ట్ర ప్రభుత్వ ఆరోగ్య బీమా పథకం ద్వారా కూడా అవసరమైన సహాయం అందేలా సిఫార్సు చేస్తామని చిరంజీవి కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. అలాగే నిన్న నాగ బాబు గారు మరో రూ2 లక్షల చెక్కును అందించి ఆర్థిక సహాయాన్ని అందించారు. తోటి కళాకారుల పట్ల చిరంజీవి ఎప్పటినుంచో చూపిస్తున్న ఆప్యాయత, ఆత్మీయత, బాధ్యతాభావానికి ఇది మరో నిదర్శనంగా నిలిచింది. ఎన్నో సందర్భాల్లో అవసరంలో ఉన్న సినీ కార్మికులు, నటీనటులకు ఆయన అందించిన సహాయం పరిశ్రమలో అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. నటుడు రమేష్ త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి సాధారణ జీవితంలోకి రావాలని చిరంజీవి గారు ఆకాంక్షించారు.



## ‘ఓం’ .. అక్టోబర్ 16న విడుదల



జాతీయ అవార్డు గ్రహీత ధనుష్ ప్రధాన పాత్రలో ‘ఆర్ఆర్ స్టూడియోస్’, ‘వండర్‌బార్ ఫిలిమ్స్’ సంయుక్తంగా #డి55 ప్రాజెక్ట్‌ని నిర్మిస్తోంది. ‘అమరన్’ లాంటి బ్లాక్ బస్టర్ సక్సెస్ తర్వాత రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ కొత్త చిత్రానికి ‘ఓం’ అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ సందర్భంగా..వండర్‌బార్ ఫిలిమ్స్’ ప్రతినిధి శ్రేయస్ మమాట్లాడుతూ ‘దర్శకుడు రాజ్ కుమార్ ధనుష్ గారికి నా కృతజ్ఞతలు. మీకు నేను ఎప్పటికీ రుణపడి ఉంటాను. అత్యధిక బడ్జెట్‌తో రూపొందుతున్న చిత్రాలలో ఇది కూడా ఒకటి. నా సినీ ప్రయాణంలో ఇదే అత్యధిక బడ్జెట్ చిత్రమని నేను భావిస్తున్నాను. ‘ఆర్ఆర్ స్టూడియోస్’తో కలిసి పనిచేయడం నాకు చాలా సంతోషంగా ఉంది. తమిళంలో వారికి ఇదే మొదటి చిత్రం. మా జర్నీ ఇలానే కొనసాగుతుందని ఆశిస్తున్నాను. ఈ సినిమా ఖచ్చితంగా అభిమానులు, ప్రేక్షకుల అంచనాలను అందుకుంటుందని నేను భావిస్తున్నాను. ఈ చిత్రానికి సంబంధించిన టీజర్, ఇతర అప్‌డేట్స్ అందరినీ అలరిస్తాయని ఆశిస్తున్నాను. ఇది అందరినీ సంతృప్తిపరిచే చిత్రంగా ఉంటుంది. అక్టోబర్ 16న ఈ మూవీని విడుదల చేస్తున్నారు. ఈ దర్శకుడు రాజ్‌కుమార్ పెరియసామి. మ్యూజికల్ సెన్సేషన్ సాయి అభ్యంకర్ ఈ చిత్రానికి సంగీతం సమకూరుస్తున్నారు.

## ‘న్యూటన్స్ థర్డ్ లా’ ట్రైలర్ లాంచ్



సుమంత్ హీరోగా ఈవిన్ నిర్మాణంలో తెరకెక్కిన యూనిక్ థ్రిల్లర్ ‘న్యూటన్స్ థర్డ్ లా’. రాజేశ్ కర్ణ దర్శకత్వం వహించిన చిత్రాన్ని కె.హరీశ్ నిర్మించారు. ఈ సినిమా ఈ నెల 31న థియేటర్లలోకి రానుంది. ఈ సందర్భం గా మేకర్స్ ట్రైలర్ లాంచ్ చేశారు. ఈ వేడుకకు హీరో అడివి శేష్ ముఖ్య అతిధి గా హాజరయ్యారు. ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో హీరో అడివి శేష్ మాట్లాడు తూ న్యూటన్స్ థర్డ్ లా ట్రైలర్ చాలా న చ్చింది. డైరెక్టర్ రాజేష్ నాకు ఎప్పటినుంచో మంచి స్నేహితుడు. ఇలాంటి సినిమా తీసుకురావడం చాలా హ్యాపీగా ఉంది. ట్రైలర్‌లో చాలా మంచి ఎనర్జీ ఉంది. సీట్ ఎడ్జ్ థ్రిల్లర్‌లా అనిపిస్తోంది. సుమంత్ నా ఫేవరెట్ బ్రో. నా ఫస్ట్ సినిమా నుంచి చాలా సపోర్ట్‌గా ఉన్నాడు. జగపతి బాబు గారు చాలా స్టైలిష్‌గా అనిపించారు. జులై 31న అందరూ కూడా ‘న్యూటన్స్ థర్డ్ లా’ సినిమాను సపోర్ట్ చేయాలని కోరుకుంటున్నాను అందరికీ నమస్కారం. ‘మళ్లీ రావా’ సినిమా తర్వాతసింగిల్ సిట్టింగ్‌లో ఓకే చేసిన కథ ‘న్యూటన్స్ థర్డ్ లా’. రాజేష్ స్టైల్, కథ, స్క్రీన్‌ప్లే నాకు చాలా నచ్చాయి. ఈ ట్రైలర్‌లో మేము చాలా తక్కువ కథనే చెబుతున్నాం 31న థియేటర్‌లో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. దర్శకుడు రాజేష్ కర్ణ , మ్యూజిక్ డైరెక్టర్ సింజిత్, యాక్టర్ త్రినాథ్, నటుడు రవి వర్మ నటిస్తున్నారు

## హైదరాబాద్ కల్చర్ నేపథ్యంలో ‘అమీర్ లోగ్’



అవ్వల్ నంబర్ ప్రొడక్షన్స్’ బ్యానర్‌పై మాధవి రెడ్డి సోమ నిర్మించిన తొలి చిత్రం ‘అమీర్ లోగ్’. ఈ మూవీకి రమణా రెడ్డి సోమ దర్శకత్వం వహించారు. ఈ సినిమాకి మనోహర్ రెడ్డి మంచురి సహ నిర్మాతగా వ్యవహరించారు. ఈ చిత్రంలో ఎంసి హరి, మనోజ్, శశిధర్ ప్రధాన పాత్రల్లో నటించగా.. వేధా జలంధర్, రావణ్ నిట్టూరు, విశ్వేందర్ రెడ్డి, సాయోగి కీలక పాత్రలు పోషించారు. రానా దగ్గుబాటి సంస్థ ‘స్పిరిట్ మీడియా’ ఈ మూవీని తెలుగులో గ్రాండ్‌గా రిలీజ్ చేయబోతోంది. ఆగస్ట్ 21న ఈ మూవీని విడుదల చేయబోతోన్నట్టుగా శనివారం నాడు ప్రకటించా రు. రిలీజ్ డేట్‌తో పాటుగా ‘అవ్వల్ దావత్’ సాంగ్‌ని కూ డా విడుదల చేశారు. ఈ మేరకు నిర్వహించిన మీడియా సమావేశంలో మదర్శకుడు రమణా రెడ్డి సోమ మాట్లాడు తూ .. ‘‘మాది నల్గొండలోని రాఘవపురం. నేను 97లోనే హైదరాబాద్‌కు వచ్చాను. హైదరాబాద్‌లోని చాలా ఏరియాల్లో జీవించాను. హైదరాబాద్ మనుషుల్ని తెరపై చూపించాలని ‘అమీర్ లోగ్’ తీశాను. మేం ముందుగా మా టీంకి సినిమా వేసి చూపించాము. ఆ తర్వాత స్పిరిట్ మీడియా టీంకి కూడా చూపించాం. వారికి సినిమా నచ్చడంతో రిలీజ్ చేసేందుకు ముందుకు వచ్చారు. డబ్బులున్న వారు అమీర్ లోగా?, సంతోషంగా ఉండే వారు అమీర్ లోగా? అన్నది ఈ చిత్రం చూసిన తర్వాత అర్థం అవుతుంది. ఈ సినిమాలో ఫిలాసఫీ ఉంటుంది. అలా అని ఏదో నీతి బోధ చేసినట్టుగా ఉండదు. ఈ మూవీని చూసిన తర్వాత హైదరబాద్ మనుషుల మీద మరింత ప్రేమ, గౌరవం పెరుగుతుంది. ఆగస్ట్ 21న మా చిత్రం రాబోతోంది. అందరూ చూసి సపోర్ట్ చేయండి’ అని అన్నారు.నిర్మాత మాధవి రెడ్డి మాట్లాడుతూ* .. ‘‘అమీర్ లోగ్’లో చూపించే బస్తీలోనే నేను పుట్టి పెరిగాను. అక్కడి నుంచి ఇక్కడి వరకు రావడానికి కారణం నా భర్త రమణా రెడ్డి. ఈ సినిమాలో నటించిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. ఆగస్ట్ 21న మా మూవీ రాబోతోంది. అందరూ మా సినిమాని చూసి ఆర్టిస్టుల్ని, టెక్నీషియన్లను సపోర్ట్ చేయాలని కోరుకుంటున్నాను’ అని అన్నారు. మ్యూజిక్ డైరెక్టర్ స్మరణ్ సాయి మాట్లాడుతూ* .. ‘కల్చర్‌ను ప్రతీకగా తీసే సినిమాలంటే నాకు చాలా ఇష్టం.. నాకు సపోర్ట్ చేసిన రాహుల్, కీరవాణికి థాంక్స్. తెలుగు సినిమాల్లో ఇదొక డిఫరెంట్ చిత్రంగా నిలుస్తుంది. ఆగస్ట్ 21న ఈ చిత్రం రాబోతోంది. అందరూ చూసి సపోర్ట్ చేయండి’ అని అన్నారు. వేదా జలంధర్ మాట్లాడుతూ* .. ‘‘అమీర్ లోగ్’ ప్రపంచంలోకి అందరినీ స్వాగతించేందుకు మేం ఈ రోజు ఇక్కడకు వచ్చాం. నటుడు మనోజ్ మాట్లాడుతూ అమీర్ లోగ్’ సినిమాలో నాకు అవకాశం ఇచ్చిన రమణా రెడ్డి గారికి థాంక్స్. ఈ మూవీ అందరికీ రిలేట్ అవుతుంది. హైదరాబాద్‌లో మనుషులు ఎలా ఉంటారు.. బిర్యానీ ఎలా ఉంటుంది.. కీర్తి మాట్లాడుతూ అమీర్ లోగ్’ చిత్రంలో అవకాశం ఇచ్చిన రమణా రెడ్డి గారికి థాంక్స్. హరి, మనోజ్, శశి అద్భుతంగా నటించారు. వేద అందరినీ ఆకట్టుకుంటుంది. అందరూ మా మూవీని చూడాలని కోరుకుంటున్నాను’ అని అన్నారు.

## సామాజిక స్పృహతో చట్టాల అమలుతోనే న్యాయం

ఐఎఎల్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** సామాజిక స్పృహతో చట్టాలను అమలు చేయడం ద్వా రానే ప్రజలకు న్యాయం జరుగుతుందని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్(ఐఎఎల్) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్ అన్నారు. ఐఎఎల్ గ్రేటర్ హైదరాబద్ అధ్యక్షుడు ఎ.వి.కృష్ణారావు అధ్యక్షతన ఐఎఎల్ హైదరాబాద్ నగర కమిటీ విస్తృత సమావేశం జరిగింది. ఈ సమావేశానికి బొమ్మగాని ప్రభాకర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ అట్టడుగు వర్గాలను సామజిక, ఆర్థిక, సాంఘీకంగా అభివృద్ధి పర్చాలని, ప్రజలలో ఆర్థిక అసమానతలు లేకుండా చూడాలనే ఉద్దేశంతోనే ‘భారత రాజ్యాంగాన్ని’ రూపొందించారని వివరించారు. ఆ లక్ష్యాలకు అనుగుణంగానే న్యాయమూర్తులు చట్టాలను అమలు జరిగేలా చూడాలని ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. భారతదేశప్రజాస్వామ్య, లౌకికవాద,సామాజిక న్యాయం కోసం న్యాయవాదులు తమ కర్తవ్యాన్ని నిర్వర్తించాలని కోరారు. ఈ సమావేశంలో ఐఎల్ హైదరాబాద్ నగర ప్రధాన కార్యదర్శి డి. జయ శ్రీనివాస్ ‘ ఐఎఎస్ నగర కార్యకలాపాల సమీక్షను’ సమర్థించగా , సీనియర్ న్యాయవాదులు కె.నగేష్, డి.ప్రభాకర్ రెడ్డి , కె.రా మ్మూర్తి, లక్ష్మ య్య, నాగేశ్వర్‌రావు, పి.భగత్‌సేన్, శ్రీనివాస్ గుప్తా, శ్రీనివాస్, సునీల్ తదితరులు మాట్లాడుతూ న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఐఎల్ సభ్య త్వ నమోదు చేపట్టాలని, న్యాయవాద సమస్యలపైన చైతన్యపర్చే కార్యక్రమాలను చేపట్టాలని ఈ సమావేశంలో నిర్ణయించారు.

## వారం రోజులపాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో రానున్న వారం రోజులపాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. ఆదివారం మధ్యాహ్నం విడుదల చేసిన వాతావరణ బులెటిన్‌లో ఈ మేరకు సూచనలు జారీ చేసింది. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశముందన్నారు. ఇదే సమయంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో బలమైన ఉపరితల గాలులు అక్కడక్కడ వీచే అవకాశం ఉందని హెచ్చరించారు. సోమవారం నుంచి వచ్చెనెల 2వ తేదీ వరకు రాష్ట్రంలో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందన్నారు. ఈ ఏడు రోజుల పాటు అన్ని జిల్లాల్లో అక్కడక్కడ 30–40 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఉరుములు, ఈదురుగాలుల సమయంలో చెట్ల కింద, విద్యుత్ స్తంభాల సమీపంలో నిలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ శాఖ సూచించారు. రైతులు స్థానిక వాతావరణ పరిస్థితులను గమనిస్తూ వ్యవసాయ పనులను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని అధికారులు సూచించారు.

## తెలంగాణ రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ.. పెన్షనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ పెన్షనర్స్ అసోసియేషన్‌ను ఆదివారం నూతనంగా ఏర్పాటు చేశారు. హైదరాబాద్‌లోని సమాచార భవన్‌లో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో సంఘం నూతన కార్యవర్గాన్ని సభ్యులందరూ ఏకగ్రీవంగా ఎన్నుకునా న్నరు. అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా ఎ.ఎల్. కిస్మత్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా ఎం.వి. భాస్కర్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే కార్యనిర్వహక కార్యదర్శిగా ఏర్వ వెంకటేశం, కోశాధికారిగా ఎం. రమాదేవి బాధ్యతలు చేపట్టనున్నారు. ఉపాధ్యక్షులుగా కె. మనోహరాచారి, బి. రషీద్, సహాయ కార్యదర్శులుగా ఎం. గోవింద్, పి. భాస్కర్ ఎంపికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా బి. మోహన్, రెహమాన్, పి.సి. వెంకటేశ్, ఎ. సైదులు, బి. అరుణ, సి.హెచ్. అనంతం, వి.కె.ఎస్. కుమార్, డి. వెంకటాచారి, కె. సత్యనారాయణలను ఎన్నుకున్నట్లు ప్రకటించారు. శాఖ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమం, భూసేకరణ వ్యయంతో సమస్యల పరిష్కారానికి నూతన కార్యవర్గం నిరంతరం కృషి చేస్తుందని ఈ సందర్భ ంగా ఎన్నికైన ప్రతినిధులు తెలిపారు. ఈ సమావేశంలో శాఖకు చెందిన పలువురు వి శ్రాంత అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎయిర్‌ఫీల్డ్ (మొదటి పేజీ తరువాయి)

కార్గో టెర్మినల్, హ్యాంగర్లు, భవిష్యత్ విస్తరణ అవసరాల కోసం కేటాయించనున్నట్లు తెలిపారు. భూసేకరణతో పాటు ఇప్పటికే ఉన్న రహదారుల మళ్లింపు, 765 కెవి హైటెన్షన్ విద్యుత్ లైన్ల తరలింపు, వాగుల మళ్లింపు, మిషన్ భగీరథ తాగునీటి పైప్ లైన్ల మార్పు, విద్యుత్ స్తంభాల తొలగింపు వంటి అన్ని అనుబంధ పనులకు అవసరమైన నిధులను కూడా ఈ పరిపాలనా అనుమతిలో భాగంగా కేటాయించినట్లు మంత్రి వివరించారు. ఆదిలాబాద్ జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్ రాష్ట్రానికి వ్యూహాత్మకంగా అత్యంత కీలకమైన ప్రాజెక్టు అని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. భారత వైమానిక దళం, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా సంయుక్తంగా అభివృద్ధి చేయనున్న ఈ ఎయిర్ ఫీల్డ్ వల్ల ఉత్తర తెలంగాణలో పారిశ్రామికాభివృద్ధి, పెట్టుబడులు, కార్గో రవాణా, పర్యాటకం, రక్షణ రంగాలకు విశేష ఊతం లభించడంతో పాటు వేలాది మంది యువతకు ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు ఏర్పడతాయని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ, పౌర విమానయాన మంత్రిత్వ శాఖ, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాతో నిరంతర సమన్వయం ఫలితంగానే ఈ ప్రాజెక్టు వేగంగా ముందుకు సాగుతోందని మంత్రి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ వ్యయంతో పాటు అన్ని అడ్డంకుల తొలగింపు ఖర్చును కూడా భరిస్తోందని చెప్పారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు భూసేకరణతో పాటు రహదారులు, విద్యుత్ లైన్లు, ఇతర మౌలిక వసతుల మార్పిడి పనులను 2026 డిసెంబర్ 31 నాటికి పూర్తి చేయాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించినట్లు మంత్రి వెల్లడించారు. ప్రాంతీయ సమతుల అభివృద్ధే సిఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని, ఆదిలాబాద్ జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్ ఉత్తర తెలంగాణ అభివృద్ధికి గేమ్‌చేంజర్‌గా నిలుస్తుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు.



## ఆశలు బూడిద
(మొదటి పేజీ తరువాయి)

ఆస్తి నష్టం జరిగింది. 27 మంది చిరు వ్యాపారుల కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ అగ్నిప్రమాదంలో రాజ్యలక్ష్మి అనే మహిళకు జరిగిన నష్టం మరింత విషాదాన్ని మిగిల్చింది. సొంతింటిని నిర్మించుకోవాలనే ఆశతో ఏళ్ల తరబడి కష్టపడి దాచుకున్న సుమారు రూ.20 లక్షల నగదు మంటల్లో పూర్తిగా కాలిపోయింది.జీవితకాల పొదుపు కళ్లముందే బూడిద కావడంతో ఆమె తీవ్ర ఆవేదనకు గురయ్యారు.దుకాణాల నష్టంతో పాటు తమ కుటుంబాల భవిష్యత్తు కూడా ప్రశ్నార్థకంగా మారిందని బాధితులు వాపోయారు.

**గ్రామపంచాయతీ రికార్డులు సైతం బూడిద**

అగ్నిప్రమాదంలో దుకాణాల్లో ఉన్న గ్రామపంచాయతీకి సంబంధించిన రికార్డులు, ముఖ్యమైన పత్రాలతో పాటు కొందరు దాచుకున్న నగదు, బంగారం కూడా అగ్నికి ఆహుతైనట్లు బాధితులు తెలిపారు. ఏళ్లుగా సంపాదించుకున్న ఆస్తులు, వ్యాపారానికి సంబంధించిన సామగ్రి, విలువైన వస్తువులు కళ్ల ముందే కాలిపోవడంతో బాధితుల ఆవేదన వర్ణనాతీతంగా మారింది. అగ్నిప్రమాద సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని తీవ్రంగా శ్రమించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. దీంతో సమీప ప్రాంతాలకు మంటలు వ్యాపించకుండా, ప్రాణ నష్టం జరగకుండా నివారించగలిగారు. అయితే భారీగా ఆస్తి నష్టం సంభవించింది.

**బాధితులకు ఎమ్మెల్యే వీరేశం అండ**

ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే ప్రభుత్వ విప్,నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఘటనా స్థలానికి చేరుకుని బాధితులను పరామర్శించారు. కాలిపోయిన దుకాణాలను పరిశీలించి, వ్యాపారుల నుంచి నష్ట వివరాలను అడిగి తెలుసుకున్నారు.బాధితుల ఆవేదనను విన్న ఎమ్మెల్యే వారికి తక్షణ సహాయంగా ప్రతి ఒక్కరికీ రూ.20 వేల చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు.ప్రభుత్వం తరపున బాధితులకు అందించాల్సిన సహాయంపై తగిన చర్యలు తీసుకోవాలని నల్లగొండ ఆర్‌డిఒ అశోక్‌రెడ్డి, తహసీల్దార్, ఎంపీడీఓ, స్థానిక ఎస్‌ఐ విష్ణమూర్తి, అగ్నిమాపక శాఖ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. నష్టాన్ని పూర్తిస్థాయిలో అంచనా వేసి బాధితులకు ప్రభుత్వపరంగా మరింత సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.చెరువు గట్టు ఆలయ పరిసరాల్లో భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా అగ్నిమాపక భద్రతా చర్యలను బలోపేతం చేయాలని ఎమ్మెల్యే సూచించారు. దుకాణాల విద్యుత్ వ్యవస్థను పూర్తిగా తనిఖీ చేసి, లోపాలు ఉంటే వెంటనే మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

**బాధితులకు రాజకీయ పార్టీల నాయకుల పరామర్శ**

అగ్నిప్రమాద విషయం తెలుసుకున్న వివిధ రాజకీయ పార్టీల నాయకులు కూడా ఘటనా స్థలానికి చేరుకుని బాధిత కుటుంబాలను పరామర్శించారు.బీఆర్‌ఎస్ పార్టీ మాజీ గ్రంథాలయ చైర్మన్ రెగట్టే మల్లికార్జునరెడ్డి,బీజేపీ నాయకులు తదితరులు బాధితులకు అండగా నిలిచారు. రాజకీయాలకు అతీతంగా బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని, దుకాణాలను తిరిగి ఏర్పాటు చేసుకునేందుకు ప్రత్యేక ఆర్థిక సహాయం అందించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.

## ‘మధ్యాహ్న’ భారం
(మొదటి పేజీ తరువాయి)

కోడిగుడ్డు కూడా పెట్టాల్సి రావడంతో పెరిగిన ధరలతో సాధ్యం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పెట్రోల్ డీజిల్ ధరలతో పాటు అన్ని రకాల వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటాయి. గడిచిన వేసివి పుణ్యమా అని ఇప్పుడు కోడిగుడ్ల ధరలు కూడా గణనీయంగా పెరుగుతుండటంతో మెనూ ప్రకారం వడ్డించడం అసాధ్యంగా మారుతోంది.

జిల్లాలో 1398 స్కూళ్లలో అమలు : జిల్లా వ్యాప్తంగా మధ్యాహ్న భోజన పథకం మొత్తంగా 1398 పాఠశాలల్లో అమలవుతోంది. ఈ పాఠశాలల్లో 610 సం. వయస్సు గల పిల్లలు 60894 మంది ఉండగా, 1114 సం.లు గల పిల్లలు 53375 మందితో కలిపి మొత్తంగా 114269 మంది పిల్లలు ప్రతీ రోజూ మధ్యాహ్న భోజనాన్ని తింటున్నారు. వీరికి పిఎం పోషణ్ మధ్యాహ్న భోజన పథకం క్రింద అమల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం 60 శాతం వాటా, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం వాటాను భరిస్తున్నాయి. పిల్లలకు పౌష్టికాహారాన్ని వేడివేడిగా అందించేందుకు జిల్లా వ్యాప్తంగా వంట మనుషులు, వారి చేతికింద సహాయకులు మొత్తం కలిపి సుమారు 3500 మంది వరకు ఉన్నారు. ఇదిలా ఉండగా రోజువారీ ఛార్జీల క్రింద ఏజెన్సీలకు 1 నుండి 5 తరగతుల ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు రూ.6.78 పైసలు, ప్రాథమికోన్నత విద్యార్థులకు (6 నుండి 8వ తరగతి) విద్యార్థులకు రూ.10.17, ఉన్నత పాఠశాలల్లోని 9,10 తరగతుల విద్యార్థులకు రూ.13.17 లను ప్రభుత్వం చెల్లిస్తుండగా, అదనంగా కోడిగుడ్డుకు రూ.6 ఇస్తున్నారు. ప్రస్తుత మెనూ ప్రకారం వారంలో మూడు రోజుల పాటు ఒక్కొక్క విద్యార్థికి మూడు కోడిగుడ్లు అందించాల్సి ఉంది. ఏజెన్సీలకు వంట చేసిపెట్టినందుకు పారితోషికంగా రూ.3 వేలు అందిస్తున్నారు. అంతే కాకుండా పెరిగిన గుడ్ల ధరలతో ఏజెన్సీలకు లక్షల్లో నష్టం వాటిల్లుతోంది.

వారం పాటు మెనూ అమలు పెద్ద సవాలే : మధ్యాహ్నన భోజనంలో పౌష్టికాహారం అందించే లక్ష్యంతో సోమవారం నుండి శనివారం వరకు మెనూ నిర్ణయించారు. ఈ మెనూ ప్రకారం కూరగాయలు, సాంబారు పప్పు దినుసులు, ఆకు కూరలతో పాటు చిక్కీ వంటి పౌష్టికాహార పదార్థాలు అందించాల్సి ఉంటుంది. అయితే ప్రస్తుతం పెరిగిన నిత్యవసరాల ధరలతో నాణ్యమైన భోజనం అందించడం కష్టమే అని వంట ఏజెన్సీల వారు అంటున్నారు. మరో ప్రక్క వర్షాభావ పరిస్థితులతో అన్ని రకాల కూరగాయల ధరలు ఆకాశాన్ని అంటాయని ప్రభుత్వం నిర్ణయించిన ధరలు సరిపోవని, ప్రతీ నెలా అప్పులు చేసి విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని అందించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని చెబుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ ధరలకు వంటలు చేయలేమని, వంట ఛార్జీలు పెంచడంతో పాటు పెరిగిన ధరలకు అనుగుణంగా రేట్లు పెంచాలని మధ్యాహ్న వంట కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

**ధరలకు అనుగుణంగా బిల్లులు ఇవ్వాలి**



‘‘ప్రస్తుతం ధరలు ఆకాశాన్ని అంటాయి. పెరిగిన ధరలో వంటలు చేసి పెట్టడం సాధ్యం కాదు. కేవలం గుడ్డు మీదే ఏజెన్సీలకు భారం పడుతోంది. కూరగాయలు నిత్యవసరాల ధరలు కూడా పెరిగాయి అటుఇటుగా కలిపి ఏజెన్సీలపై నష్టం వాటిల్లుతోంది. ప్రభుత్వం ఇప్పటికైనా దృష్టి సారించి పెరిగిన ధరలకు అనుగుణంగా బిల్లులు ఇవ్వడంతో పాటు కనీస వేతన చట్టాన్ని వంట ఏజెన్సీలకు అమలు చేయాలి.’’ అని మధ్యాహ్నన భోజన వర్కర్స్ యూనియన్ (ఏఐటియూసి)జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభావతి అన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com